# వరసం

## (వర్ధమాన రచయితల సంఘం)

### -1-

మా కాలేజీ స్టాఫ్‌రూంలో కూర్చుని ఖాళీ పీరియడ్‌లో ఆరోజు పాఠం ఓసారి చూసుకుంటున్నాను. మా జున్ను హడావుడిగా వచ్చాడక్కడికి.

"రారా" అని ఆహ్వానించాను.

"రేపు 'మాసికం'లో చదవటానికేమయినా రాశావా?" అని అడిగాడు జున్ను కుర్చీలో కూర్చుంటూ

"ఏదీ కుదిరి చావటంలేదు" అన్నాను.

"చచ్చు కథ రాయటానికి కుదిరేదేమిట్రా! పైగా నెలరోజులయింది. ఏదో ఒకటి తగలెట్టరాదూ!"

"చచ్చు కథయినా పిచ్చికథయినా మీరనుకున్నంత తేలికేం కాదు..."

"అదుగో ఆ మాటలేవద్దు. కథో, కవితో ఏదో ఒకటి రాయి. పరువు పోయేట్టుంది"

"కథ అంటే ఏమోగానీ, కవితలు నా వల్లకాదు"

"కవిత మాత్రం కష్టమేముంది. పెన్నూ, కాయితం తీసుకు కూర్చో అదే తన్నుకు వస్తుంది" అని టేబుల్ మీద ఉన్న నోట్‌బుక్‌లో నుండి ఓ కాయితం చింపి దానిమీద ఇలా రాశాడు:

**"కవితా, కవితా, ఓ నవ కవితా!**
**నా హృద్యానంలో విరిసిన సుమలతా!**
**నా మదిలో ఫెటిల్లుమన్న విస్ఫోటికా!**
**నా మానస సరోవరంలో**
**నా సరస్తీర మానసంలో**
**ఉదయించిందో కదలిక**
**కదిలిందో ప్రహేళిక!"**

అని ఇంకా రాయబోతూంటే, "ఇదేం కవితరా, నా బొంద!" అన్నాను ఆ కవిత అర్థం కాక.

"కవిత కాదు... నవకవిత. అసలీ ప్రక్రియకు నేను 'తవిక' అని నామకరణం చేద్దామనుకున్నాను. మరీ జనం ధడుచుకుచస్తారని 'నవకవిత' అని పేరెట్టాను. ఎలా వుంది!" అన్నాడు.

"ఆ 'హృద్యానం' ఏంటి? 'సరస్తీర మానస'మంటే...? అసలు నువ్వు చెప్పదలుచుకున్నదేంటి?"

వాడు విచిత్రంగా నా వంకచూశాడు. 'వీడికి బాగుపడే లక్షణాలు లేవు' అన్నట్టుగా ఉంది వాడి చూపు. వాడన్నాడు. "హృది' ప్లస్ 'ఉద్యానము' 'హృద్యానం' అయింది. అయినా నాకు తెలీక అడుగుతాను - కవిత్వంలో అర్థమేంటి? అర్థంకోసం ఎవరూ కవిత్వం చదవరు. అయినా రాసింతర్వాత దానికర్థం లేకుండా ఎలా పోతుంది. ఏదో ఉండే ఉంటుంది. అర్థం కాలేదూ అంటే ఆ పాఠకుడికి అర్థం చేసుకునే స్తోమత, సామర్థ్యం లేదన్నమాట. కవి స్థాయికి నువ్వు ఎదిగినప్పుడు 'నవకవిత' నీ కర్థమవుతుంది."

మా స్టాఫ్‌రూంలో ఇంకెవరయినా ఉన్నారేమోనని నేను తలతిప్పి అటూ ఇటూ చూశాను. ఎవరూ లేరు. అందరూ క్లాసులకు వెళ్ళిపోయారు. తృప్తిగా నిట్టూర్చి. "అంటే పాఠకులందరూ కవి స్థాయికి ఎదగాలన్నమాట...?" అనడిగాను.

"ఎదిగితే మంచిది. అర్థం చేసుకునే శక్తిలేని కొంతమంది చచ్చు సన్నాసులు 'అస్పష్టత, అస్పష్టత' అని వాపోతున్నారు. కవితా ప్రాభవానికి పరాకాష్ఠ అస్పష్టత. అది గ్రహించుకోలేరే పెద్ద మనుషులు!"

"స్పష్టంగా రాసే శక్తి కవులకే కొరవడుతున్నదని నా అభిప్రాయం."

"నీ ముఖంలే అర్థమయ్యేట్టు రాస్తే అదసలు కవిత్వం కాదు. ఉచ్చశ్రేణి కవిత్వంలో - 'నవకవిత'లో అస్పష్టత పతాక స్థాయిలో ఉంటుంది. కవి సూచిస్తాడు. పాఠకుడు అర్థం చేసుకోవాలి. అరటిపండు వలిచి చేతిలో పెట్టటానికి అది వచనం కాదు కవిత్వం."

"పాఠకుడు ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నాడు? మాటలు అర్థంకాకా? కాదు. కవికే ఏం చెప్పాలో తెలియకపోవటంవల్ల. కవి మనస్సులోని భయంకర శూన్యం కవితను అస్పష్టత పాలు చేస్తున్నది."

నా మాటలతో మావాడి ఓపిక సన్నగిల్లింది.

"నీకు 'నవకవిత' సంగతి చెప్పటం నాదే బుద్ధి తక్కువ. దాన్ని అర్థం చేసుకునే పరిణతబుద్ధి నీకింకా రాలేదు. ఇంకా కొన్నాళ్ళు మా సంఘంలో మెలిగితే గానీ నీకు తెలిసిరాదు. సరే, ప్రస్తుతానికి ఈ 'కవిత'కు ఇంకో నాలుగు లైన్లు చేర్చి రేపు 'మాసికం'లో చదువు. ఈసారి కూడా నువ్వేమీ చదవకపోతే నా పరువు పోతుంది" అన్నాడు జున్ను.

"నావల్ల కాదేమోరా?" అన్నాను భయంతో

"నీ బొంద, కాకేంటి! నోటికొచ్చింది రాయి. ఆపైన నేనున్నాను" అని కాయితం మడిచి నా జేబులో పెట్టి, "నే తొందరగా వెళ్ళాలి. ఈసారి సమావేశం హన్నూ వాళ్ళింట్లో. మర్చిపోకు. వస్తాను" అని వచ్చినంత హడావుడిగా వెళ్ళిపోయాడు జున్ను.

ఈ మధ్య జున్ను నన్నో సాహిత్య సంఘంలో సభ్యుణ్ణి చేశాడు. జున్ను నా చిన్నప్పటి మిత్రుడు. నాచేత ఏదయినా మహత్కార్యం చేయించాలని వాడి తపన. దానికి తోడు మా

ఆవిడ పోరు పెట్టసాగింది. మాది సాయం కళాశాల. సాయంత్రం నాలుగ్గంటల ఉద్యోగం. మిగతా సమయంలో పుస్తకాలు చదువుతూనో, మిత్రులతో బాతాఖానీ వేస్తూనో, ఏం తోచకపోతే రోడ్డు సర్వే చేస్తూనో గడిపేయటం నా అలవాటు. ఇలా రోజుకున్న ఇరవై నాలుగ్గంటల్లో ఇరవై గంటలు వృధా చేయటం ఆవిడకు నచ్చలేదు. అందుకే ఓరోజు అల్టిమేటం ఇచ్చేసింది. "ఏవయినా కథలు రాస్తూండ రాదు, అలా అస్తమానం గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుండకపోతే..." అని. సరే, వాళ్ళ బోరు భరించలేక, 'నుదిటి రాత తప్పుతుందా' అనుకుంటూ, ఓరోజు జున్నుతో కల్సి ఆ సాహిత్య సంఘానికి వెళ్ళాను.

"ఇతని పేరు 'పాణిని.' మిత్రుడు. మన సంఘంలో చేరుద్దామని తీసుకొచ్చాను. ఇది వరకు చాలా పత్రికల్లో మంచి కథలు రాశాడు. ప్రస్తుతం ఏమీ రాయటంలేదు. మనతో తిరిగితే ఇతనూ మంచి రచయిత అయిపోతాడు" అన్నాడు జున్ను నన్ను మిగతా సభ్యులకు పరిచయం చేస్తూ.

ఆనాటి 'వర్ధమాన రచయితల సంఘం' – 'వరసం' సమావేశం జున్ను ఇంట్లో జరిగింది. మరెవరికీ తెలీకుండా మావాడి తొడ గిల్లాను. "ఎందుకురా అబద్ధాలు. మంచి కథ అలావుంచి పిచ్చి కథయినా రాసిన పాపాన పోయినవాడిని కాదు కదా!" అని చెప్పాలని నా ఉద్దేశం. అయితే, వాడిది దళసరి చర్మం. దోమని తరిమేసినట్టు నా చెయ్యి పక్కకి తోసేశాడు.

"అహహ... ఇహిహి... ఏదో మీ అనుగ్రహం. అందరూ అలా అనుకుంటారు గానీ, నేను మాత్రం రచయిత ననుకోను సుమండీ! ఏవో రెండు గిలికితే రచయిత అయిపోయినట్టేనా!" అన్నాను పైకి, మావాడి గౌరవం కాపాడే ఉద్దేశంతో సిగ్గులు చిందిస్తూ.

"అవును. నేనూ నా మిత్రులతో అలాగే చెప్తూంటాను. నిజానికి రచయితలందరూ అలాగే భావిస్తారు" అన్నాడు హన్ను.

"అయితే, ఈయన్ని మన సంఘంలో చేర్చుకోటానికి మీలో ఎవరికైనా అభ్యంతర ముందా?" అడిగాడు జున్ను హన్ను, బన్నూలకు

"మీరు తీసుకొచ్చి సిఫారసు చేశాక ఇంకెవరికి అభ్యంతరముంటుంది. హన్నూ! ఐ థింక్ ఉయ్ కెన్ ప్రొసీడ్ విత్ ది ఇనీషియేషన్ సెరిమొనీ" అన్నాడు బన్నూ.

కర్తవ్య పరాయణుడయిన హన్ను లేచాడు, పవిత్ర గ్రంథాన్ని – సంఘ నియమావళీ గ్రంథాన్ని చేత ధరించి చదవసాగాడు: "సంఘ నియమావళిలో మొదటి అధికరణం; సంఘ సభ్యులుగా చేరే హక్కు పరిమితమైంది. సాహిత్య కసరత్తులు చేస్తున్నంత మాత్రాన ప్రవేశం లభించదు. సంఘ సభ్యుల సిఫారసు లేనిదే కొత్త వారికి ప్రవేశం లభించదు"

"అలగా జనం అందర్నీ చేర్చుకోలేం కదండీ. అందుకే ఈ నియమం" అన్నాడు బన్ను.

కాని అసలు విషయం వేరు. నాకా తర్వాత తెల్సింది. సంఘం ప్రారంభించిన కొత్తల్లో రచయితలను, కవులను, విమర్శకులను, తదితర సాహిత్య కృషీవలులను ఆహ్వానించటం

జరిగింది. కానీ, ఎవరి దగ్గరనుండీ జవాబు రాకపోవటంతో జున్నూ, హన్నూ, బన్నూల అహం దెబ్బతిన్నట్లయింది, పరువు పోయినట్లయింది. సంఘ కాన్స్టిట్యూషన్ని తిరగ రాసేసుకున్నారు.

"హిహి... అంతే కదండి మరి" అన్నాను నేను చేసేదిలేక ఇకిలిస్తూ.

"రెండు: ప్రవేశం పొందిన సభ్యులకు పునర్నామకరణం చేయబడుతుంది. వారు ఆ కలం పేరుతోనే రచనలు చెయ్యాలి. పేరు రెండక్షరాలదై ఉంటుంది. రెండో అక్షరం విధిగా 'న్ను' అయివుంటుంది. ఈ 'న్ను'తో కలిపేందుకై శ్రావ్యసుభగత్వం కోసం వ్యక్తి పేరులోని మొదటి అక్షరాన్ని మార్చే హక్కు సంఘానికి ఉంటుంది" చదివాడు హన్నూ, నుదుట పట్టిన చెమటను తుడుచుకుంటూ.

"అయితే, ఈ అధికరణం ప్రకారం నా పేరేమవుతుంది?"

"మీరు 'పాణిని' కదా! 'పొన్ను' అవుతుంది" అన్నాడు హన్ను.

" 'పొన్ను' నాకు బాగాలేదు, 'పెన్ను' చెయ్యండి" అన్నాను.

సంఘంలో సాంతం చేరకుండానే ఇలా ఎదురుచెప్పటం బన్నూకు నచ్చలేదు.

"అలా వీల్లేదు. హన్నూ చెప్పినట్టు 'పొన్నూ' అంటేనే బావుంది.

"మావాడు జనార్ధనరావు 'జున్ను' అయినా, మీరు బ్రహ్మానందం 'బన్ను' అయినా ఆ పేర్లలో ఏదో అర్ధముంది. 'పొన్ను'లో ఏంవుంది? పోనీ 'పన్ను'గా మార్చండి" అని ప్రాధేయపడ్డాను వాళ్ళను.

"అమాటకొస్తే నా పేరు హనుమంతు - 'హన్ను' అయానా? దాంట్లో ఏం అర్థ ముందంటారు?"

"అసలు అర్థంకోసం చూడటమంత తెలివి తక్కువ పని మరొకటిలేదు. సాహిత్య రంగంలో అస్పష్టత పరాకాష్ఠ నందుకుంటున్న రోజుల్లో 'అర్థం పర్థం' అని గింజు కుంటున్న వాళ్ళని మిమ్మల్నే చూశాను...

'అందునా సాహిత్య వృషభులం
త్యజించాలి అర్థాన్ని మనం
అర్థం లేకపోతేనే అదో అందం
మీరేమన్నా మీ పేరు 'పొన్నూ'నే ఖాయం" అంటూ కవిత్వం చదివేశాడు బన్నూ.

జున్ను చప్పట్లు కొట్టాడు, ఆ కవితారసధునిలో తలమునకలవుతూ. ఆపైన అన్నాడు: " 'పన్న'యినా, 'పెన్న'యినా, 'పొన్న'యినా పేరులో ఏముంది? 'వాట్సిన్ నేం?' అన్నాడు కదా పెద్దమనిషి. అయినా నువ్వింత చిన్నచిన్న వాటికి మంకుపట్టు పట్టడమేం బాగాలేదు" అన్నాడు జున్ను.

"ప్రజాస్వామ్యంలో మెజారిటీ అభిప్రాయానికే విలువ. కనుక మేం ముగ్గురం ఏక కంఠంతో మీకు 'పొన్ను' అని నామకరణం చేస్తున్నాం. ఇక దీంట్లో వాదనలకు తావులేదు" అన్నాడు బన్ను.

"సరే, సరే. పెద్దలు మీరందరూ నామంచి కోసం ఏం నిర్ణయిస్తే అదే శిరోధార్యం" అన్నాను నేను, వాళ్ళ మాట కాదంటే సంఘంలో చేర్చుకోరేమోనన్న భయంతో. చెప్పొద్దూ, ఇక్కడ కొచ్చింతర్వాత నాలోనూ కీర్తి కాంక్ష - 'ద లాస్ట్ ఇన్ఫర్మిటీ ఆఫ్ ది నోబుల్‌మాన్' - మొదలయింది. వాళ్ళ భుజాల అసరాతో పై కెదగాలన్న కోరిక జాగృతమైంది. పైగా పేరు విషయంలో అంతకు ముందే నేనుండే లోగిల్లో రాజీపడి ఉండటం వల్ల, నే నింకేం అభ్యంతరం చెప్పలేదు.

"మూడో అధికరణం: సంఘ సభ్యులుగా కాగోరేవారు విధిగా కవులు, రచయితలై ఉండనవసరం లేదు. కవిత్వం పట్ల కుతూహలం, స్పందనా హృదయం వుంటేచాలు. వారు సంఘ వాతావరణంలో గారెంటీగా రచయితలయిపోతారు. వారిని కవులుగా - రచయితలుగా తీర్చి దిద్దే బాధ్యతమాది - అంటే సంఘానిది"

"ఓహ్! ఓహ్! అద్భుతం! ఎంత చక్కటి అధికరణమండీ అది. ఇది నాలో కొత్త ఊపిరిపోసిందనుకోండి" అన్నాను నేను ఉత్సాహంగా, అంతకు ముందు ఏం రాయక పోయినా ఇంక రచయితనో, కవినో చచ్చినట్టు అవాల్సిందే అన్న నమ్మకం కలిగి.

బన్నూ చిద్విలాసంగా ఓ చిరునవ్వు చిందించాడు. "అదే బ్రదర్! మన సంఘానికీ, ఇతర సంఘాలకూ ఉన్న తేడా" అన్నాడు.

"నాలుగు: సంఘం పేరులో 'రచయితలు' అన్న పదం విస్తృతార్థంలో వ్యవహృత మైంది. కవులు, నాటకకర్తలు, విమర్శకులు - ఇంకా సాహిత్య రమ్య హర్మ్యాన్ని నిర్మించే తాపీదార్లు (మాసన్లు) అందరూ ఇందులో సభ్యులు కావచ్చు. సభ్యుల రచనలను సమావేశం ఆమోదించిన తదుపరే ప్రచురణకు పంపవలసి ఉంటుంది. ప్రచురణ విషయంలో సభ్యులకు సిఫారసులు చేయబడ్తాయి."

"ఇదెంత వరకు మంచిదంటారు? 'రచన' విలువను బట్టి ప్రచురణార్హత పొందాలి గానీ, సిఫారసుల వల్ల జనానికి చెత్త సాహిత్యం అందించటం కాదూ?" అన్నాను ఉండ బట్టలేక.

"అలా మాట్లాడకు. ఇది సిఫార్సుల యుగం. 'ఉత్తర' 'దక్షిణ' ల్లేకుండా పని జరిగే కాలం కాదు. రచన చదవకుండా, రచయిత పేరు మాత్రమే చూసి ప్రచురణార్హమా, కాదా అని నిర్ణయించేకాలం. కనుక సిఫార్సులవసరమే" అన్నాడు జున్నూ.

"మీరింకో చచ్చు మాట కూడా వాడారు 'జనం' అని. మనం రాసింది కాదనే ఆ 'జనం' ఎవరండీ? మనమేది రాస్తే అదివాళ్ళు చచ్చినట్టు అంగీకరించి తీరాల్సిందే. పొద్దు పోయేందుకు సాహిత్యం. అంతకంటే సాహిత్య విలువలు వాళ్ళకేం తెల్సు?" అన్నాడు బన్నూ.

నాకామాట అంగీకారం కాలేదు. నేనేదో చెప్పబోతూ వుంటే "నువ్వుండు" అన్నాడు జున్నూ, నన్ను మాట్లాడవద్దని సంజ్ఞచేస్తూ.

"సభ్యులకు సంఘం ప్రొటెక్టివ్ షీల్డ్‌లాంటిది. సభ్యుల రచనలకు సిఫార్సులనే దోహద క్రియలు నెరపటం, ప్రచురణానంతరం మన సభ్యుల రచనలు శ్లాఘిస్తూ, పత్రికలకు ఉత్తరాలు రాసి ప్రోత్సహించటం సభ్యులందరి కర్తవ్యం" అన్నాడు హన్నూ.

"రచన బాగోగుల పరామర్శ లేకుండా మనవాడు రాశాడు కదా అని ఆకాశానికి ఎత్తెయ్యటం ఏం బాగోదు" అన్నాను నేను, జున్ను తొడ గిల్లినా పట్టించుకోకుండా.

"భజన సంఘాల యుగమండీ ఇది. నలుగురు నోరున్న వాళ్ళు, పార్టీ సభ్యులు రచయిత, కవి చుట్టూ చేరి ఎలుగెత్తి అరుస్తూ ఉంటే వాడే మహా రచయిత, కవి అయి పోతాడు. మన సభ్యులకే ఈ సౌకర్యం అందించటం మన కనీస కర్తవ్యం" అన్నాడు హన్నూ.

నేనింకేం మాట్లాడలేదు.

హన్నూ చదవసాగాడు. "అధికరణం ఐదు. చాల ముఖ్యమైంది ఇది. అన్ని విష యాల్లో, ముఖ్యంగా వివాదం వచ్చినప్పుడు సంఘస్థాపక సభ్యులదే తుది నిర్ణయం. ఆ నిర్ణయానికి కట్టుబడని సభ్యులు సంఘ బహిష్కారానికి గురవుతారు"

"సంఘ స్థాపక సభ్యులంటే మేం ముగ్గురమన్నమాట. మన అధ్యక్షుడు జున్ను, కార్యదర్శి హన్నూ, ఏ పదవీ వ్యామోహం లేని నేను" అని వివరించాడు ఆ క్లాజును బన్నూ.

"ఆల్‌రైట్, ఆల్‌రైట్... బావుంది" అన్నాను నేను గొర్రెలా తలూపుతూ.

"ఆరు: 'వరసం' సమావేశాల్లో ఉపన్యాసాలకంటే చర్చలకే ప్రాధాన్యం"

"ప్రముఖులైన సాహిత్యవేత్తల్ని పిల్చి ఉపన్యాసాలిప్పిస్తే బాగుంటుంది కదా!" అన్నాను.

"ఎవరయ్యా ప్రముఖులు మనకంటే? మనం అందరం సాహిత్య వ్యాసంగం చేసే వాళ్ళమే. మన కంటే వాళ్ళకేం ఎక్కువ తెలిసేడ్చును? సభ్యులు కాని పరాయి వాళ్ళను పిలవటం, వాళ్ళను ఉపన్యాసాలిమ్మనటం నా కిష్టం లేదు" అన్నాడు బన్నూ అసహనంగా. నేను ప్రతి అధికరణానికీ ప్రతిగా ఏదో ఒకటి మాట్లాడటం అతని కిష్టం లేదు.

"పిల్చినా ఏం ప్రయోజనం? ఏదో సబ్జెక్ట్ ఇస్తాం, దీని మీద మాట్లాడవయ్యా అని. ఆ పెద్ద మనిషి ఫ్రీ పేరయిరాడు. వచ్చి, నోటి కొచ్చిన అవాకులు చెవాకులు పేల్తాడు" అన్నాడు జున్ను సామరస్య ధోరణిలో

"ఆ బోరు భరించలేం" అన్నాడు హన్నూ.

"అవును. ఆ మాట నిజమే. పరాయి బోరు భరించటం కష్టమే" అన్నాను.

బన్నూ నా వంక ఎర్రగా చూశాడు. నేను పట్టించుకోలేదు. ఆ తర్వాత హన్నూ వరసగా చదివాడు మిగతా అధికరణాలను. అవి ఎన్నికలు, కార్యకర్తల బాధ్యతలు, నియమావళి సవరణ గురించీ. ఆ క్లాజులతో నాకు తకరారు లేదు. కనుక నేనేం

వ్యాఖ్యానం చెయ్యలేదు. చివరగా చదివాడు హన్ను: "మనం నెలకోసారి మూడో ఆదివారం కలుసుకుంటాం. వెన్యూ, టైం అంతకు ముందు సమావేశంలో నిర్ణయిస్తాం. మన నెలవారీ సమావేశాన్ని విప్లవాత్మకంగా 'మాసికం' అని పిలుస్తాం" అని.

"ఛీ ఛీ! అదేంటి? ఆ మాటేదో చావు కంపు కొడ్తోంది" అన్నాను.

"నోర్ముయ్యరా. 'మాసికం' అంటే ఏమిటి? నెలకోసారి జరిగేది అని. రూఢిలో నువ్వన్న అర్థం సంతరించుకున్నదనుకో. భాషలో పదాలకలా ఏర్పడ్డ తప్పుడర్థాన్ని తొలగించి, భాషను స్వచ్ఛమైందిగా రూపొందించటమే సంఘం తలపెట్టిన విప్లవాత్మకమైన మార్పు" అన్నాడు జున్ను.

భాషలో పదాల రూఢ్యర్థాన్ని తొలగించటం సాధ్యమా? ఏది స్వచ్ఛమైన భాష? - లాంటి విషయాల్లో నాకున్న సందేహాన్ని వాళ్ళముందుంచి వాళ్ళ ఓర్పును హరించే సాహసం చేయలేదు నేను.

సంఘ కాన్స్టిట్యూషన్ని చదివి విన్పించిన తర్వాత జున్ను నా చేత, "సంఘ నియమాన్ని తుచ తప్పకుండా పాటిస్తాన"ని ప్రమాణం చేయించాడు. "జలనిధులు ఇంకిపోనీ, కులగిరులు కుంగిపోనీ నేను సంఘ నియమావళి తప్పను" అన్నాను. స్థాపక సభ్యుల తర్వాత సంఘంలో చేరిన మొదటి సభ్యుణ్ణి కనుక నియమావళినంతా నాకు చదివి విన్పించారు. కానీ, ఆ తరువాత చేరిన వాళ్ళకెవరికీ అలాంటి అదృష్టం కలుగలేదు.

సభ్యుడనయ్యాను కనుక ఒక్కొక్కరూ నాకు సృజనాత్మక ప్రక్రియలోగల అతి నిగూఢ రహస్యాల్ని నాకు వివరించసాగారు.

"నువ్వు కథలు రాస్తావు కనుక, నాకు తోచిన మాట ఓటి చెప్పక తప్పదు. సృజనాత్మక ప్రక్రియ ఏదైనా మూడ్లోకి వెళ్తేగానీ సాధ్యంకాదు..." అన్నాడు జున్ను. వాడి కసలు కథలు, నవలలు అంటే సదభిప్రాయంలేదు. కవిత్వమే సాహిత్యమనే భావన వాడిది. కథా నవలా రచయితల పట్ల చిన్నచూపున్నా బయటపడదు.అందుకే నాకు లేని 'దురద' నంటించాడు వాడు. కవిత్వమంటే కష్టంగానీ, తక్కువ రకం ప్రక్రియలైన కథలు, నవలలు ఎవరయినా గిలికెయ్య వచ్చునని వాడి అభిప్రాయం.

"అవును. మూడకపోతే మనమేం రాయలేం..." అన్నాడు హన్ను.

"మరి మూడాలంటే మనమేం చెయ్యాలంటారు?" అనడిగాను నేను.

"అదే చెప్పొచ్చా. మూడటానికి మనం దోహదక్రియలు చేయాలి. సిగరెట్టు తాగటం మంచిదే. వక్కపొడి వేసుకోవచ్చు, పాన్ సేవించవచ్చు. తోచనప్పుడు కాఫీ, టీ పుచ్చుకోవచ్చు. బ్లాక్ కాఫీ శ్రేష్ఠం..." వివరిస్తున్నాడు జున్ను.

"వీలయితే ఓ చుక్క వేసుకున్నా బాగానే ఉంటుంది" అని సలహా ఇచ్చాడు బన్ను.

"పూర్వ కాలంలోనూ ఉండేవి దోహదక్రియలు. ఆ కాలంలో కవులు నశ్యం ఎందుకు పీల్చే వారంటారు? మూడ్ కోసమే" అన్నాడు జున్ను.

"మూడ్‌లోకి వెళ్ళటమనేది కొంత కష్టమైన విషయం. అదో సమాధ్యవస్థ. అప్పుడు మనకు ప్రపంచం టాప్సీటర్వీగా - ఉల్టాగా కన్పించాలి. అప్పుడు మీరు రచన మొదలెట్టండి" అన్నాడు జన్ను.

నేను తెల్ల ముఖం వేశాను. బన్నూనవ్వాడు.

"అంటే కథ అంతంతో ప్రారంభమవుతుందన్న మాట. ఇంటి గోడలు కట్టి రూఫ్ వేస్తాం చూశారూ, ఇక్కడ పూర్తిగా వ్యతిరేకం, కప్పునుండి కిందకి కట్టడం ప్రారంభించాలి. ఉదాహరణకు మీరు ఓ కథను ఓ మనిషికి పిచ్చెక్కించటంతో అంతం చేయాలనుకున్నారనుకోండి. అది పతాక స్థాయి. ఒక దుర్భరమైన సంఘటన జరుగుతుంది. ద లాస్ట్ స్ట్రా టు బ్రేక్ ద నెక్ ఆఫె కామెల్ - వాడికి పిచ్చెక్కేస్తుంది. ఇహ అక్కడ నుండి కిందకు మెట్లేసుకు రావాలి. కష్టాలు, ఘటనలు చివరి ఘట్టం కంటే తక్కువ స్థాయిలో ఉండాలి" అన్నాడు బన్నూ ఓపిగ్గా వివరిస్తూ.

"అర్థమైంది లేండి. ఎడ్గార్ ఎల్లెన్ పో తన 'ఫిలాసఫీ ఆఫ్ కంపోజిషన్'లో వివరించినట్టుగానేగా..." అన్నాను.

"అది సామాన్య కథకుల పంథా. ఓ హాస్యరచయిత ఉన్నాడనుకోండి. చివరి సీనులో తెలుగు సినిమానో, టి.వి.నో చూపించి..."

"లేకపోతే తెలుగు నవలో, కథో వినిపించి..." మధ్యలో అడ్డొస్తూ అన్నాడు జున్ను.

"ఆఁ అదే.... తెలుగు కవిత్వమో విన్పించి, వాడికి పిచ్చెక్కించేట్టు చేస్తాడు. అంటే వాడు అంతకు ముందు పడిన కష్టాలన్నీ వీటి ముందు దిగదుడుపన్నమాట. మా లాంటి సంచలన రచయితలు రాసే కథల కంతం లేదు. మేమెక్కడ ఆపితే అదే అంతం..."

"నాకర్థం కాలేదు..." అన్నాను.

"గాబరాపడకండి. అన్ని రహస్యాలూ ఒకేసారిగా తెలుస్తాయా. మెల్ల మెల్లగా నేర్చుకుందురుగాని" అన్నాడు హన్ను భుజంతట్టి ధైర్యం చెప్తూ.

సృజనాత్మక ప్రక్రియా రహస్యాలు తెలుసుకున్న వీళ్ళు నాకు మహానుభావుల్లా కన్పించారు. నా పురాకృత సుకృతం వల్ల నాకు ఈ సంఘ ప్రవేశం లభించినట్లనిపించింది.

"ఎలాగో కథా రచనతో పరిచయముంది కనుక ఓ చిన్న ఎక్స్‌పెరిమెంట్ చేయండి. వారపత్రికల్లోని కథలు నాలుగు తీసుకోండి. ఒక్కొక్కటి నాలుగు సమభాగాలుగా చింపండి. మళ్ళీ అంటించేటప్పుడు నాలుగు కథలకు సంబంధించని నాలుగు వేరువేరు ముక్కలను కలిపి ఒకటి చేయండి. అలా మీకు నాలుగు కొత్త కథలొచ్చేస్తాయి. ఆఁ, పేర్లు మార్చుకోటం వగైరా చిన్న చిన్న మార్పులు చేసుకోవాలనుకోండి" అన్నాడు బన్నూ - సంచలన కథారచయిత, కథా కథన చక్రవర్తి.

"ఇది వరకు బన్ను కథలు విరివిగా రాసేవాడు. ఆ మధ్య 'తెలుగు వెలుగు' వార పత్రిక సంపాదకుడు ఫోన్ చేసి అర్జెంటుగా ఓ కథ కావాలన్నాడట. ఆఫీసులో కూర్చుని

అరగంటలో రాసి పారేశాడు. ఇప్పుడు నవలలు విరివిగా రాయటంతో, కథలు రాసే తీరిక లేదు ఆయనకు" అన్నాడు హన్నూ.

"కథల్దేముందండీ, ఎడంచేతి పని! అఁ నవలలన్నారు, కొంచెం శ్రమించాల్సి ఉంటుంది" అన్నాడు బన్ను.

"మరి మీరేం రాస్తున్నారిప్పుడు?" అడిగాను హన్నూను.

"ఏదో ఛస్తున్నా మండీ... కథలు రాయటం కష్టం కాదుగానీ వాటికో మంచి పేరుపెట్టటం కష్టంగా ఉంది" అన్నాడు హన్ను.

"కథ రాయగా లేంది, పేరుదేముంది...? ఆ పేరు కథలో నుండే పుట్టుకొస్తుంది కదా!" అన్నాను ఆశ్చర్యపోతూ.

"అమ్మమ్మ. అట్లా అనకండి. కథదేముంది. ఏదో నాలుగక్షరాలు గిలికేస్తే సరి పోతుంది. ఉన్న మాహాత్మ్యమల్లా పేరు పెట్టటంలోనే ఉంది. పేరు జనాకర్షకంగా ఉండాలి. క్రిస్ప్‌గా ఉండాలి. దానికో ఉపాయం కనిపెట్టానులేండి. కథ రాసేసింతర్వాత శ్రీశ్రీనో, ఆరుద్రో, మన జున్నూనో రాసిన కవితల్ని చదివేస్తాను. ఏదో మంచిపేరు దొరికిపోతుంది" అన్నాడాయన సంబరంగా.

"అంటే కథకు సంబంధించిన ఓ చిన్నమాటో, సమాసమో సెలక్ట్ చేసుకుంటారన్న మాట" సందేహ నివృత్తికోసం అడిగాను.

ఆయన నవ్వాడు. 'రచనా సమరాంగణంలో నువ్వు నేర్చుకోవాల్సినవి చాలా ఉన్నాయి కుంకా!' అన్నట్లుంది ఆనవ్వు. ఆపైన "పేరుకు, కథకు సంబంధం ఉండనక్కర లేదు. కాగా, ముఖ్యమైంది పేరు ఆకర్షణీయంగా ఉండాలి. సంబంధాందేవుంది లెండి. చివర్లో ఓ రెండు మూడు మాటల్లో ఆ పేరు కలిసేటట్లు, రాసేస్తే సరిపోతుంది" అన్నాడు హన్ను.

"హమ్మయ్య! మెనీ మెనీ థాంక్స్ హన్నూ...! ఓ సమస్య పరిష్కారమైంది." పేరు పెట్టటం ఎంత సులువో నా కర్థమైంది. అసలు గడ్డు సమస్య అదేగా! కథదేముంది, ఎడంచేతి పని, ఏదో నాలుగక్షరాలు గిలికేస్తే సరిపోతుంది. బన్నూ, హన్నూలు విషయాన్ని అంత సరళంగా వివరించటంతో నాకెంతో సంతోషమేసింది.

"ఇంకో విషయం. మీరొకసారి ఆ పని చేశారు కనుక చెప్తున్నా. రచనలు చేయటం మొదలెడ్తే ఆపకూడదు. నెలకు రెండు కథలనో, నాలుగు కథలనో టార్జెట్ పెట్టుకోవాలి. ఆ లక్ష్యాన్ని పూర్తి చేసేవరకూ నిద్రపోరాదు. రచనా వ్యాసంగం ఓ చిన్న కుటీర పరిశ్రమ లాంటిది. వడియాలు, అప్పడాలు పెట్టినట్లు రచనలు చెయ్యాలి, అమ్మెయ్యాలి" అన్నాడు హన్ను.

"అదయితే నిజమే. మన పేరు అడపాదడపా పత్రికల్లో కనపడకపోతే జనం మన్ని మర్చిపోతారు" అన్నాడు జున్ను.

అలా నేనూ 'వరసం' సభ్యుడనయ్యాను. ఇహ అప్పటి నుండీ జున్ను నా ప్రాణం తీస్తున్నాడు. ఏదో ఒకటి రాయమని. ఇవాళ తప్పదు. ఏదో ఒకటి గిలకాల్సిందే.

## -2-

ఎవరికి దురదపుడ్తే వాళ్ళు గోక్కోటం సహజం. కానీ, సాహిత్యపరమైన దురదపుడ్తే ఇతరులను గోకేస్తుంటారు జనం. మా ఇంటి యజమాని కూతురు విన్నీఫ్రెడ్ జోషువా ఈ మధ్య నా ప్రాణం తోడేస్తోంది, తన్నూ ఎలాగయినా మా 'వర్ధమాన రచయితల సంఘం' (వరసం)లో సభ్యురాల్ని చెయ్యమని. 'వరసం' సభ్యత్వం అంటే మాటలా? సంఘ నియమావళి ప్రథమ అధికరణం ప్రకారం సభ్యత్వ హక్కు పరిమితం. సాహిత్య కసరత్తులు చేస్తున్నంత మాత్రాన అందరికీ ప్రవేశం లభించదు. సంఘ సభ్యుల సిఫారసులేనిదే కొత్త వారికి ప్రవేశం లభించదు. "అలగా జనం అందర్నీ చేర్చుకోలేం కదండీ, అందుకే ఈ నియమం" అన్నాడామధ్య నాతో బన్ను.

పైగా, ఆమె తన పేరు మార్చుకోటానికి ససేమిరా వీల్లేదంది. చూశారా, ఇదే ఈ ఆడవాళ్ళతో తంటా! మా సంఘ రెండో అధికరణం ప్రకారం ప్రవేశం పొందిన అభ్యర్థులకు పునర్నామకరణం చేయటం మా విధి. వాళ్ళా కలం పేరుతోనే రచనలు చేయాల్సి ఉంటుంది. పేరు రెండక్షరాలదై ఉంటుంది. రెండో అక్షరం విధిగా 'న్ను' అయి ఉండాలి. ఈ 'న్ను'తో కలిసేందుకై శ్రావ్య సుభగత్వం కోసం వ్యక్తి పేరులోని మొదటి అక్షరాన్ని మార్చే హక్కు సంఘానికి ఉంటుంది.

అంతా విని, "ఇంతకీ నా పేరేమవుతుంది?" అనడిగిందామె అమాయకంగా

"విన్నూ" అన్నాను.

"విన్నూనా, అదేం పేరండీ... నా పేరు 'విన్నీ'నే బావుంది. నేను పేరు మార్చుకోను" అందామె.

"మహా కార్యాలు సాధించేటప్పుడు చిన్న చిన్న వాటికి పంతం పట్టకూడదు. పేరు మార్చుకోనంటే మీకు సంఘంలో స్థానం లేదు."

ఆమె మొహం చిన్నబోయింది.

"ది సీజ్ టూ మచ్... డిక్టొటోరియల్."

"దేర్... దేర్, యువార్రాంగ్ మై డియర్ గాళ్! 'విన్ను'లో మొదటి అక్షరం మీ సొంతమేనా. సంఘ నియమావళి ప్రకారం రెండో అక్షరం విధిగా 'న్ను' ఉండాల్సిందే. సమతా సాధన మా గమ్యం. ఇదే గమ్యం అందరికీ. నా పేరు 'పాణిని' - 'పొన్ను' అయ్యాను. మా ఫ్రెండ్ 'జున్ను' - జనార్దనరావు తెల్సుకదా! మహాకథక చక్రవర్తి బ్రహ్మా నందం 'బన్ను' అయ్యాడు. హనుమంతు 'హన్ను' అయాడు. ఇంక మీరు విన్నీఫ్రెడ్ 'విన్నూ' అయిపోతారు" అన్నాను. సంఘ నియమావళి రెండో అధికరణంలోని అంతః సూత్రాన్ని వివరిస్తూ.

ఈ మహోన్నతాదర్శాన్ని ఆమె ముందుంచినప్పుడు, ఆ ఔన్నత్యంపై ఆదరంతో ఆమె శిరస్సు అవనతమవుతుందనుకున్నాను. ఊహూం, ఏదో ఆలోచిస్తోంది. 'ఈ ఆడవాళ్ళ నర్థం చేసుకోటం బ్రహ్మతరం కూడా కాదు గదా?' అనుకున్నాను.

"మీ సంఘంలో కుల, మత, వర్ణ విపక్షతలు లేవు కదా?" అడిగిందామె.

"కరెక్ట్."

"కాని, లింగభేదం తప్పక ఉండాలి. పురుషులు పురుషులే, స్త్రీలు స్త్రీలే."

నేను తలూపాను, ఆమె వాదనేమిటో అర్థంకాక.

"అవునా? మీ సంఘంలో పురుషుల రెండో అక్షరం 'న్ను' ఉంటే, స్త్రీల రెండో అక్షరం 'న్నీ' ఉండాలి విధిగా. ఉదాహరణకు మీ హిందూ దేవతల పేర్లు కూడా 'శంభు', 'విష్ణు' అని ఉకారాంతరాలుగా, 'పార్వతి', 'లక్ష్మి', 'సరస్వతి' అని ఇకారాంతాలుగా ఉన్నాయి కదా - అంటే? ఉకారాంతం పురుషులకు, ఇకారాంతం స్త్రీలకు సహజం."

నన్ను తప్పుదోవ పట్టిస్తుందని అనుమానం కలిగినా ఆమె వాదన నాకు వచ్చింది. మా సంఘం కూడా చీరెల రెపరెపల్లేక మరుభూమిలా ఉంది. ఆమెకు సంఘంలో ప్రవేశం కల్పించాల్సిందే!

"మీ వాదన కరెక్టే. కానీ సంఘ కాన్స్టిట్యూషన్..."

"ఎమెండిట్. కాన్స్టిట్యూషన్స్ ఆర్ దేర్ టు బి ఎమెండెడ్. నేను మీ సంఘ సభ్యురాల్నికాక ముందే నా పేరు మీ సంఘ సభ్యత్వానికి అనువుగా ఉంది. అయామె నాచురల్ మెంబరాఫ్ యువర్ ఆసోసియేషన్. యు మస్ట్ ఇంప్రెస్ అపానిట్."

ఈ పిల్ల బుర్ర మరీ షార్ప్‌గా ఉందే అనుకున్నాను.

ఆ నెల 'వరసం' 'మాసికం' మా ఇంట్లో జరిగినప్పుడు, విన్నీని సంఘ సభ్యురాల్ని చేసుకోవాలన్న ప్రతిపాదనను సభ్యుల ముందుంచాను. ఆమె పేరు కూడా మార్చుకోవాల్సిన అవసరం లేదని వాదించాను. స్త్రీలకు కూడా ప్రవేశార్హత కల్పించటానికి నియమావళి రెండో అధికరణాన్ని మార్చాలని సూచించాను.

నేనేం చెప్పినా వ్యతిరేకించాలనే సింగిల్ పాయింట్ ప్రోగ్రాంతో ఉండే బన్నూ రెండు కారణాలు చూపుతూ నా ప్రతిపాదనను వ్యతిరేకించాడు.

"ఉమెన్ ఆర్ డిజ్‌రప్టివ్. స్త్రీల కారణంగా ఎన్నో వ్యవస్థలే తారుమారయ్యాయి. బౌద్ధమతం భారతదేశంలో మనలేకపోవటానికి కారణమేమిటి? స్త్రీలకందులో ప్రవేశం కల్పించటం! ఆమె పెట్టుబడి దారీ వర్గానికి చెందిన వ్యక్తవటం వల్లా కూడా ఆమె అభ్యర్థిత్వాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. వాళ్ళకు ఫాక్టరీలు, కంపెనీలు, వ్యాపారం లేవని నువ్వు వాదించవచ్చు. వాళ్ళ నాయన పదిపన్నెండు భాగాల ఇల్లు కట్టి, అద్దెలకిచ్చి లాభాలు గడించటం పెట్టుబడి దారీతనంకిందే వస్తుంది" అన్నాడు.

సంఘ అధ్యక్షుడు జున్నూ కూడా సంఘ నియమావళిని సవరించి, ఆమెకు ప్రవేశార్హత కల్గించటానికి ఒప్పుకోలేదు. నేనిప్పుడేం చేయాలా అని దిక్కుతోచకుండా ఉన్న పరిస్థితిలో ఆమె వచ్చింది.

ఆదివారం కనుక చర్చికి వెళ్ళి, సీదా మా ఇంటికే వచ్చిందామె. నల్లంచు పట్టుచీర కట్టుకుని, నల్లబ్లవుజు తొడిగింది. పచ్చటి శరీరంమీద ఆ డ్రస్సు బాగా నప్పింది ఆమెకి.

'ద ఫెయిర్ ఈచ్ మోమెంట్ ఇన్వర్ ఛార్మ్స్

రిపెయిర్స్ హర్ స్మైల్స్, అవేకెన్స్ ఎవ్విరి గ్రేస్

అండ్ కాల్స్ ఫోర్త్ అల్ల వండర్స్ ఆఫ్ హర్ ఫేస్'-

అన్నట్టుగా వచ్చింది. మా వాళ్ళంతా నోరు తెర్చుకుని ఆమె వంక చూస్తున్నారు, అబగా.

పరిచయాల అనంతరం మా వాదనలన్నీ విన్పించాను ఆమెకు.

"ఇహ మీరు మా సంఘ సభ్యులెలా అవుతారో, మీ అర్హతలేమిటో సభకు నివేదించండి" అన్నాను.

ఆమె ఉపన్యసించటం మొదలెట్టింది: "మొదటి పాయింటు, స్త్రీ సంఘ విధ్వంసకురాలన్న అంశం నేనంగీకరించను. యునో, ఫర్ద సక్సెస్ ఆఫ్ ఎవ్విరి మాన్, దేర్ లైస్ ఎ మార్టైర్ ఆఫ్ ఎ ఉమన్ బిహైండ్ హిం. ఈ సత్యాన్ని మనసుతో అంగీకరించినా, పైకి చెప్పటానికి మగ అహంకారం అడ్డొస్తుంది. మన సంఘ సభ్యులు అంత సంకుచిత మనస్కులనుకోను" అంది.

"యువార్‌రైట్" అన్నాడు బన్నూ ఉత్సాహంగా.

"అమ్మ తల్లీ! నువ్వింకా సభ్యురాలివి కాందే 'మన' అంటున్నావు" అని అనుకున్నాను మనసులో.

"స్త్రీ జాతిని అణచివేయటం అనాదికాలంనుండి సాగుతోంది. మీరు అవతార పురుషుడని కీర్తించే శ్రీరామచంద్రమూర్తేం చేశాడు? సీతను అగ్ని ప్రవేశం చేయించాడు, అడవికితోలేశాడు. ఓ అహల్య రాయైంది, ఓ దుర్యోధనుడు ద్రౌపదిని నిండుసభలో అవమానించాడు. ఓ గాంధారి గుడ్డిదైంది. ఎన్ని ఉదాహరణలు! స్త్రీని సమాజంలో భాగస్వామినిగా మీరెప్పుడు అంగీకరించారు? సత్యభామ కాలితాపు తిన్న ఆ కృష్ణ పరమాత్ముడే నాకిష్టదైవం. 'పద్మావతీ చరణ చారణ చక్రవర్తి'నని ధైర్యంగా చెప్పుకున్న ఆ జయదేవుడే అసలుసిసలు అయిన కవి, భక్తుడు. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అన్న మనువును పట్టుకు ఉరితీయాలి" అంది ఆవేశంగా విన్నీ.

"హిప్‌హిప్ హుర్రే... హిప్‌హిప్ హుర్రే... ప్రొసీడ్..." అని భజన మొదలెట్టాడు బన్నూ.

"ఇహ మధ్యయుగం. చీకటియుగం. స్త్రీలపట్ల కాళరాత్రే అయింది. స్త్రీ విద్య నశించింది. ఘోషా పద్ధతి ప్రవేశపెట్టారు; అసూర్యంపశ్యలై బతకమన్నారు. బాల్య వివాహాలు మొదలయాయి. భర్త చనిపోతే 'సతీ సహగమనం' చేయించారు. ఏం, మీ మగవారెందుకు 'పతీ సహగమనం' చెయ్యరాదు? బైగామీ, పాలీగామీ వాట్ నాట్ -ఎవ్విరి కైండ్ ఆఫ్ అట్రాసిటీ వాజ్ పెర్పెట్రేటెడ్ ఆన్ విమెన్. పైన స్త్రీ సంఘ విధ్వంసురాలన్న పేరు!" అని ఒక్క క్షణమాగి మళ్ళీ మొదలెట్టింది మిద్దె దొరసాని. మా లోగిల్లోఆమెను 'మిద్దె దొరసాని' అని పిల్చేవాళ్ళం లెండి.

"ఇహ ఆధునిక కాలానికి వస్తే - కస్తూరిబాయి లేకపోతే మహాత్మాగాంధి ఏం చేసే వాడు? కమలా నెహ్రూ అండదండలు లేకపోతే జవహర్‌లాల్ ఏమి సాధించేవాడు? ఎంతమంది స్త్రీలు త్యాగనిరతులై భారతదేశ స్వాతంత్ర్యాన్ని సముపార్జించి పెట్టారు. ఒక సరోజినీనాయుడు, ఒక అరుణా అసఫ్ అలీ, ఒక ఇందిరాగాంధి - ఎన్ని పేర్లని చెప్పను? ఒక సిరిమావో బండారు నాయకే, ఒక మార్గరేట్ థాచర్ సమున్నత స్థానాన్ని అలంక రించలేదా? స్త్రీ సంఘ విధ్వంసకురాలని నేను నమ్మను. అసలు స్త్రీలే సంఘం ముక్కలు కాకుండా కాపాడింది. సంప్రదాయాన్ని పరిరక్షించిందీ. భారతదేశ సంస్కృతిని నిలుపుకున్నదీ ఎవరు? స్త్రీలు! ఒక్క చిన్న ఉదాహరణ చాలు మీరందరు నేను చెప్పిన సత్యాన్ని అంగీకరించటానికి" అని ఓ క్షణం ఆగింది అలుపు తీర్చుకోవటానికి.

"ఏమిటది?" అడిగాడు బన్ను ఆతృతగా.

"పురుషులు సమాజం మారినప్పుడల్లా, అధికార వర్గానికి దాసోహమని భావాలలో పరివర్తన చెందటమే కాదు, చివరకు వేషంలో కూడా మార్పులు తెచ్చుకున్నారు. మహమ్మ దీయుల రాజ్యపాలన కాలంలో షేర్వాణీలు, చుడీదార్లు తొడుక్కున్నారు. ఆంగ్లేయులు ప్రభువులైన తర్వాత పాంట్లు, షర్ట్‌లు, కోట్లూ, నెక్‌టైలు - ఒకటేమిటి? బానిసత్వానికి కావలసిన బరువంతా గాడిదల్లా మోశారు. మన భారతదేశ వాతావరణానికి సరిపోయే దుస్తులు ధోవతీ, పైన కప్పుకునేందుకు ఓ ఉత్తరీయం చాలునని మీరు గమనించారా? స్త్రీలు ఇలా పిల్లిగంతులు వేయలేదు. అనాదికాలంనుండి చీరలే కట్టుకుంటూ ఉన్నారు. ఇప్పుడూ చీరెలే కట్టుకుంటూ ఉన్నారు. అంటే - దేశ సంప్రదాయాన్ని కాపాడింది స్త్రీలే కాని, పురుషులు కాదు. మొదటిగా ఈ విషయాన్ని మీరంగీకరించాలి" అని ఉత్తేజంతో ఉపన్యసించింది మిద్దె దొరసాని.

'ఇంకా నయం. సంప్రదాయం కాపాడటానికి ఇప్పుడు సంఘ సభ్యులందరూ ధోవ తులు, ఉత్తరీయాలు మాత్రమే ధరించాలని పట్టుబట్టలేదు ఆమె' అనుకున్నాను నాలో.

"అంగీకరించాం, అంగీకరించాం" అన్నాడు బన్ను.

"సోషల్ ఇంటర్ కోర్స్‌లో ఉపరితలాని కొచ్చింది పురుషులేకాని, స్త్రీలుకాదు. విదేశీ సంస్కృతి, భాష, సంప్రదాయం, ప్రభుత్వాల సంపర్కంలోకి వచ్చింది పురుషులే. అందువల్ల పురుషులు మారారు. భావాల్లో మార్పులు తెచ్చుకున్నారు. వేషంలో మార్పు తెచ్చుకున్నారు. నేపథ్యంలో ఉండే స్త్రీలకు అది సాధ్యపడలేదు. వారూ ఉపరితలానికొచ్చినట్లయితే కనీసం వేషంలోనయినా మార్పు తెచ్చుకునేవారని నా అభిప్రాయం" అన్నాను నేను.

"అసలు స్త్రీలను నేపథ్యంలో ఉంచింది ఎవరు? ఉపరితలానికెందుకు రానివ్వలేదు? పురుషస్వార్థం, పురుషాహంకారం. అయితే, ఇంత బలమైన మొగజాతీ మమ్మల్ని ఎక్కువకాలం అణచలేకపోయింది. మేమూ చదువుకుంటున్నాం. భావాలలో మార్పులు తెచ్చుకున్నాం. కాలానుగుణంగా, ప్రగతికి ఉన్ముఖంగా ఆలోచిస్తున్నాం. అయినా గమ నించండి. చీరెలే కట్టుకుంటున్నాం? 'మంచి' అన్నది ఆచరించేది ఎవరు? స్త్రీలా-

పురుషులా? సమాజాన్ని సంఘటితపరిచిందీ, సంప్రదాయాన్ని కాపాడిందీ ఎవరు? స్త్రీలు – ముమ్మాటికీ స్త్రీలే. స్త్రీలు సంఘవిచ్ఛేదకులనటం దుర్మార్గం, అన్యాయం. ఘోరం" అన్నది ఆవేశంగా మిద్దెదొరసాని.

"కానీ విషయాన్ని మీరు తప్పుదోవ పట్టిస్తున్నారు..." అని ఆమె వాదనలో ఉన్న వన్‌సైడెడ్ డిఫెన్సులోని లోపాన్ని ఎత్తిచూపాలనుకున్నాను. కానీ, బన్ను పడనివ్వలేదు.

"సరే, ఊర్కోవయ్యా... ఆమెని చెప్పనీ" అన్నాడు.

"సరే, నాదేంబోయింది. నీ గొయ్యి నువ్వే తవ్వుకో" అని ఊర్కొన్నాను.

"కనుక స్త్రీలు సంఘ సంఘటితశక్తులు, దుర్గలు, ఝాన్సీలక్ష్ములు, మేరీమాతలు, నివేదితలు, మదర్‌థెరిస్సాలు" అన్నది మిద్దెదొరసాని.

బన్ను, హన్ను, జున్ను చప్పట్లు చరిచారు. వీళ్ళ భజన సంఘపువరస నాకేం నచ్చలేదు. అయినా నేనేం మాట్లాడలేదు.

"ఇంక రెండో పాయింటు. మా నాన్న అన్ని భాగాల ఇల్లు కట్టటం కాపిటలిజం అనీ, పెట్టుబడి పెట్టి అద్దెల లాభాలు గడించిన పెట్టుబడిదారీ – అన్నది ఆరోపణ. దీనికంటే సత్యదూరమయిన ఆరోపణ ఇంకోటి లేదు. మా నాన్న ఎంత వెచ్చించి ఇల్లుకట్టాడు? దానిమీద వచ్చే బాడుగ, అసలుమీద వచ్చే వడ్డీకయినా సమానమా అని మీరెవరూ ఆలోచించలేదు. పైగా, మా నాన్నకు ఇన్ని భాగాల ఇల్లుకట్టడంలో ఇసుమంతైనా స్వార్థంలేదనీ, అంతా పరార్థంకోసమేననీ నేను ఘంటాపథంగా చెప్పగలను. ఇళ్ళు దొరకని ఈ హైదరాబాదు నగరంలో ఇన్ని భాగాల ఇల్లు ఎవరికోసం కట్టాడు? తనకోసమా? అద్దెకోసమా? ఉండటాని కిల్లు దొరక్క బాధపడే జనంకోసం. ఇది సంఘసేవ. తనకు ఓపినంతలో సంఘ సేవ చేస్తున్న మనిషిని 'నువ్వు పెట్టుబడిదారువు, సమాజాన్ని దోపిడీ చేస్తున్నావు' అనటం మతిలేని మాట. బుద్ధిమంతులైన మీరందరూ నా వాదన నంగీకరిస్తారనుకుంటాను" అన్నది మిద్దెదొరసాని.

'ఓయమ్మ తల్లో విషయాన్ని ఇంతగా తప్పు దోవపట్టించే నేర్పు నీకుందని నాకు తెలీదే! నీ వాదన అంగీకరించకపోతే మేం అందరం బుద్ధిలేనివాళ్ళమేనా?' అనుకున్నాను మనసులో.

మా వాళ్ళు ఆమె వేషాన్ని, హావభావాల్ని, మృదుమధురమైన కంఠధ్వనినీ పరికించటమే, వినటమే కాని, ఆమె వాదనలోని బోలుతనాన్ని గమనించే స్థితిలో లేరు. జగన్మోహిని అమృతం పంచుతుంటే ఆబగా నోరు తెరుచుకు చూస్తోంది అసురబృందం.

"మా నాన్న చేసేది సంఘ సేవ ముమ్మాటికీ! అదలా ఉంచండి, మా నాన్న అద్దెలు వసూలు చేసి డబ్బేమయినా కూడబెడుతున్నాడనుకున్నారా? వచ్చే డబ్బు ఆయన తినటానికీ, తాగటానికి సరిపోవటం లేదు. ఏదో నా జీతం ఉంది కాబట్టి నెట్టుకొస్తున్నాం, ఒకోసారి అన్పిస్తుంది – ఈ ఇల్లు అమ్మేస్తే బావుంటుందని. కానీ, మా నాన్న ఒప్పుకోడు. 'పది కాకులు వచ్చి నివసించే చెట్టును కొట్టేయటం ఎంత దుర్మార్గం?' అంటాడు.

అందువల్ల మా నాన్న గాని, నేను గాని, సగటు మధ్యతరగతి మనుషులం. పెట్టుబడి దారులం కాదు. కనుక వర్గ శత్రుత్వం వహించడం మీకు న్యాయంకాదు" అన్నది చేతులు జోడించి ఆమె.

'నువ్వు పాలిటిక్స్‌లో చేరాల్సింది తల్లీ!' అనుకున్నాను మనసులో, 'పాలిటిక్స్ ఈజ్ ద లాస్ట్ రిజార్ట్ ఫర్ ఎ స్కౌండ్రల్' అన్న సూక్తి గుర్తుకు వచ్చి.

"ఇక మూడో అంశంమీద మీ వాదనేదో స్పష్టపరచండి" అన్నాడు జున్ను.

"నా పేరు మీ సంఘ సూత్రాల కనుగుణంగా ఉంది. నేను మీ సంఘంలో సభ్యత్వా నికి ధరఖాస్తు పెట్టకముందే 'ఐ యామ్ ఎ నాచురల్ మెంబర్ ఆఫ్ యువర్ అసోసియేషన్' అని పాణిని బాబుగారికి చెప్పాను" అంది మిద్దె దొరసాని.

"క్షమించాలి. ఇక్కడ వారి పేరు 'పొన్ను', ఆ పేరుతోనే వారిని సంబోధించాలి. 'గారు' అన్న కృతకమైన మాటకూడా సంఘంలో నిషిద్ధం" అన్నాడు కార్యదర్శిగా సంఘ సూత్రాల పరిరక్షణాభారం తన భుజస్కంధాలమీద మోస్తూ కుంగిపోయిన హన్ను.

"సరే. 'పొన్ను'కు చెప్పాను. నా పేరెందుకు మార్చాల్సిన అవసరంలేదో నా వాదనను 'పొన్ను' మీకు స్పష్టం చేశారు. ఇక కాన్స్టిట్యూషన్ ఎమెండ్ చేసే విషయంలోనే మీకు సందేహాలున్నాయి. అంతే కదా?" అన్నది ఆమె.

"అంతే... అంతే" అన్నాడు జున్ను.

"ధర్మం, ఆపద్ధర్మం అని రెండు విషయాలున్నాయి. హిందూ ధర్మశాస్త్రంలో ఇంకొకటి 'వర్ణాశ్రమ ధర్మం' అన్న ధర్మ సూక్ష్మముంది. వర్ణమంటే కులాలు కాదు: లేక బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా విభజించి వారి వారి ప్రత్యేక విధులను పేర్కొనటంకాదు. 'వర్ణం' అంటే స్త్రీలు, పురుషులు. 'ఆశ్రమం' అంటే ఆయా వయస్సుల్లో ఉన్న స్త్రీలు, పురుషులు. అంతేగానీ బ్రహ్మచర్యం, గార్హస్థం, వానప్రస్థం, సన్యాసం కావు. వాటినే చైల్డ్‌హుడ్, యూత్, మిడిల్‌ఏజ్, రిటైర్డ్ లైఫ్ అని చెప్పకోవచ్చు. కాబట్టి స్త్రీలు, పురుషులు ఆయా వయస్సులో అంటే ఆశ్రమంలో - పాటించవలసిన ధర్మాన్ని వర్ణాశ్రమ ధర్మ మంటాము. అయితే, వ్యక్తికి ఎలా ధర్మముందో, సమాజానికీ ఒక ధర్మముంది. మీ సమాజంలో కొన్ని ధర్మాలేర్పరచుకున్నారు. ఐతే, ఇంతవరకూ ఏకవర్ణ సంఘం. అంటే పురుషులతో మాత్రమే కూడినది అవటంవల్ల మీకు తగిన ధర్మాలేర్పరుచుకున్నారు. ఆధునికమైన ఆలోచనతో రెండో వర్ణానికి - అంటే స్త్రీలకు కూడా ప్రాతినిధ్యం ఇవ్వ సంక ల్పించారు కాబట్టి 'ఆపద్ధర్మాన్ని' అవలంబించాల్సి ఉంటుంది. వర్ణ ధర్మాన్ని అంగీకరించే మనం, రెండో వర్ణానికి కూడ ప్రాతినిధ్యం కల్గించేటట్లుగా మీ సంఘ రెండవ అధికరణానికి ఆపద్ధర్మంగా సవరణ చేయాలని నేను కోరుతున్నాను" అంది అమె.

ఆమె మాటలు వాళ్ళ కేమర్థమయ్యాయో, అసలు ఆమెకే ఎంతవరకు అర్థమయ్యాయో నాకు తెలీదుకాని, వాళ్ళేం మాట్లాడలేదు. ఆపద్ధర్మానికీ, సంఘ నియమావళి సవరణకూ సంబంధమేమిటో నాకర్థం కాలేదు. జున్ను కూడ సుముఖుడైనాడు.

'ఓరి శలభాల్లారా! మాయలో పడబోకండి. జగన్మోహిని మాయలో పడ్డ అసురులు, మేనక మోహంలో పడ్డ విశ్వామిత్రుడు ఏమయిపోయాడో గుర్తుకు తెచ్చుకోండి' అని మనసులో అనుకున్నాను.

"ఆ ఆపద్ధర్మాన్ననుసరించే మన భారత రాజ్యాంగ చట్టాన్ని ఇన్ని సార్లు సవరణలు చేశారు. కనుక మీ చట్టంలోని రెండవ అధికరణంలో స్త్రీల పేర్లకు రెండవ అక్షరం 'న్నీ'గా ఉంటుందని చిన్న సవరణ చేస్తే సరిపోతుంది" అన్నది మిద్దె దొరసాని.

అందరి నోళ్ళు కట్టుబడ్డాయి, కళ్ళు మూసుకుపోయాయి.

"అంగీకరించాం. హన్నూ, చట్టంలో ఆ సవరణ చేయవయ్యా!" అన్నాడు బన్నూ.

"మీ అందరి అంగీకారంతో విన్నీఫ్రెడ్ జోషువా ఇవాల్టినుండి "విన్నీ" అన్న కలం పేరుతో మన సంఘ సభ్యురాలవుతుంది" అని జున్ను ప్రకటించాడు.

"థాంక్యూ, థాంక్యూ వెరీమచ్. ఓ పది నిముషాల్లో వస్తాను, క్షమించాలి" అని తుర్రుమని వెళ్ళిపోయింది విన్నీ.

"షి ఈజ్ వెరీ ఇంటిలిజెంట్" అన్నాడు జున్ను.

"అసలు అనవసరమైన అభ్యంతరాలు పెట్టాము. ఆమెను సీదాగా సభ్యురాలుగా అంగీకరించవల్సింది" అన్నాడు బన్ను.

"ఎవరయ్యా అభ్యంతరాలు లేవదీసింది? నువ్వేగా" అన్నాడు జున్ను.

"ఒక విషయాన్ని ఒకరు సమర్థిస్తూ, మరొకరు వ్యతిరేకిస్తూ విషయ విశ్లేషణ చేస్తే, మనకు దానిపై సమగ్రమైన అవగాహన ఏర్పడుతుంది. అందువల్లే నేను అభ్యంతరం చెప్పాను. చట్టాన్ని సవరించ నిరాకరించి మొండిపట్టు పట్టుకు కూర్చుంది నువ్వే" అన్నాడు బన్నూ జున్నూతో.

"నా కిప్పటికీకూడా ఆ విషయంలో మనసులో ఎక్కడో సంకోచం లేకపోలేదు. అయితే, మీరందరు రాజీపడ్తిరి. నేనుమాత్ర మేంచేస్తాను?" అన్నాడు జున్ను. వీడి కిప్పుడిప్పుడే కళ్ళు తెరిపిళ్ళుపడుతున్నాయి.

మిద్దె దొరసాని స్వీట్లూ, కేకులూ రెండు పెద్ద పళ్ళాలతో నింపి తీసుకవచ్చింది. చంకలో ఒక నోటు బుక్కు.

"నేను సంఘ సభ్యురాలనయిన సందర్భంలో ఏదో నా ఓపిన విందు" అంటూ వాటిని టీపాయ్‌మీద పెట్టింది. "కానివ్వండి, పనికుర్రాడు టీ పట్టుకొస్తాడు" అంటూ పుస్తకాన్ని తెరిచింది.

"నేనో కవిత వినిపిస్తాను, వింటారా?" అంది.

"తప్పకుండా" అన్నాడు బన్నూ.

ఆమె పుస్తకంలోనుండి చూసి చదవసాగింది.

"నా కళ్ళు మూసుక పోయాయి
చెవులు విననంటున్నాయి
నాలిక గొంతులో కొట్టాడుతోంది
నాసిక శ్వాసపీల్చడం మానేసింది
చర్మం మొద్దుబారింది
నేను సమాధిస్థనయాను
అప్పుడో కవితా దీపం వెలిగింది
మనో నందనం విరిసింది
పంచేంద్రియాలు పనిచేయసాగాయి
కనుగవలు దివ్యసౌందర్యాన్ని కనుగొన్నాయి
వీనులు విందైన స్వర్గవీణను మీటాయి
జిహ్వాచాపల్యం పోగొట్టుకొంది
నాసిక నందనవన సౌరభాల్ని వీడనంటోంది
చర్మమెరు పెక్కింది. నేను కలం పట్టాను..."

ఇంకేం చదివేదో - నేను చప్పట్లు చరిచాను. మా వాళ్ళందరూ 'రాలేను రాలేను దివినుండి భువికి' అన్నట్లుగా బలవంతంగా ప్రపంచంలో పడ్డారు. నావంక కోపంగా చూశారు. 'వీడికి కవితా రసాస్వాదన తెలీదు. వట్టి జడుడు' అన్నట్టుగా నావంక చూశారు. ఆమె కవిత విని అప్పటికే సమాధిస్థుడనైన నన్ను పంచేంద్రియాలుపయోగించీ ఏంచేయ లేకపోయారు వాళ్ళు. 'ఆహా, కవిత్వ మహిమ ఎంతటిది!' అనుకొని తన్మయుడనై పోయాను.

"మీ కవిత విన్న తరువాత నాలోనూ కవి తన్నుకు ఛస్తున్నాడు. తరువాత మీరేం రాశారోగాని గాని మీ కవిత విన్న తరువాత నాలో కలిగిన భావన లివి-

"మీ కవితా దీపం నాలోను వెలిగింది
కళ్ళు పెరికేసుకున్నాను
చెవులు పీకేసుకున్నాను
నాలిక కత్తిరించుకున్నాను
నాసిక బిగబట్టి శ్వాస తీయటం
మానుకున్నాను
చర్మం చల్లబడింది
నా పంచేంద్రియాలు పంచత్వం పొందాయి
ఆహాహా మీ కవితాగానం
ఏంజెప్పను మీ కవిత్వం? స్నిగ్ధం, ముగ్ధం
చాలునిహ ఈ జన్మకు
వేరే కవిత లొద్దు నాకు-"

అని ఆశువుగా కొండనుండి బండరాళ్ళు దొర్లించినట్టుగా కవితాగానం చేశాను.

"వీడిది విప్లవ కవిత్వం. ఒక విధంగా అంతకంటే గొప్పదే. చంపు, కొట్టు, గిల్లు, రక్కు అనే విప్లవ కవిత్వం కంటే, 'పెరికేసుకున్నాను, పీకేసుకున్నాను, కత్తిరించుకున్నాను' అని అదే భావాన్ని ఎంత మృదువుగా చెప్పాడు? ఓరేయ్, నువ్వు రచయితగా కంటే కవిగా నీకు ముందు పెద్ద భావుంది" అని మెచ్చుకున్నాడు జున్ను.

'ఇన్నాళ్ళకు నా జన్మ తరించె' అని మురిసిపోయాను నేను. ఈ మహా రచయితలు, కవుల కళ్ళల్లో పడటమంటే మాటలామరి!

"ఇహిహి... ఏదో... మీ అందరి ఆశీర్వాదంతో చేసిన నా తొలి ప్రయత్నమిది. దీనికి స్ఫూర్తి నిచ్చిన 'విన్నీ' అభినందించాలి. నన్నో కవి ఋషభుణ్ణి చేసింది ఆమే" అన్నాను వినయంగా ఆమెకు కృతజ్ఞతలు తెలియబరుస్తూ.

"నేనూ కవితంతా రాశాను కాని. ఆ విరుపు నాకు తట్టలేదండీ. మెరుపులా ఉందది" అని ఆమె నన్ను ప్రశంసించింది.

బన్నూ "ఇంకేమయినా కవితలు చదువుతారా?" అనడిగాడు ఆమెను.

"ఉన్నాయి. కానీ, మొదటి రోజే మిమ్మల్ని ఇబ్బంది పెట్టటం బాగోలేదు" అంది ఆమె మొహమాటంగా.

స్వీట్లూ, కేకులూ, బిస్కట్లూ అయిపోతున్నాయి.

"అనుకుంటాం గాని ఒక్కోసారి కవిత్వం కంటే ఇవే బావుంటాయి" అన్నాను స్వీటు నోట్లో పెట్టుకుంటూ.

"అమ్మమ్మ... అపచారం. ఈ స్వీట్లకూ కవిత్వానికి పోలికా?" అన్నాడు హన్ను, హత్యచేసిన వాడివంక చూసినట్టు నన్ను చూస్తూ.

నేచెప్పా కవిత్వం-

**"అట్లా చూడకు నన్ను**
**వింటావా ఒకమాట హన్ను**
**కవిత్వం గట్టిపడితే జున్ను**
**అసలు సత్యం బన్ను."**

"అబ్బా! అబ్బా! ఉరే. మమ్మల్నట్టా చంపకురా, నీ కవిత్వంతో. ఆచ్ఛాదనలు తొలగించి, అసలు సత్యం ప్రదర్శించిన దిగంబర కవిత్వంరా నీది" అన్నాడు జున్ను.

చప్పట్లు చరిచి తన ఆనందం ప్రదర్శించింది విన్నీ. బన్ను, హన్నూలు కూడా ఏడవ లేక నవ్వు మొహం పెట్టారు. వాళ్ళకు నా కవిత్వం చూసి కన్ను కుట్టింది. అంతే గదండీ, ఈ ప్రపంచంలో ఒకడి ప్రాభవాన్ని మరొకడు సహించలేడు.

"ఇందాక 'పొన్ను' చెప్పినమాట నిజమే. ఒకోసారి కవిత్వం కంటే స్వీట్లే బాగుంటాయి! అందరూ మనలాగ కవిత్వం చెప్పలేరు కదండీ. కొందరి కవిత్వం వింటూ ఉంటే,

అలా వింటూ ఉండిపోవాలనే అన్పిస్తుంది. కొందరి కవిత్వం వింటూ ఉంటే, వాడి కవిత్వం కంటే కవిత్వం వినటానికి లంచంగా వాడు ఆఫర్ చేసిన స్వీట్లే బావుంటాయి. కానీ, కవిత్వంలాగకాక స్వీట్లు ఎప్పుడూ బావుంటాయి. 'రామ్‌లాల్, రాజీవ్‌లాల్ స్వీట్ భండార్'లో కొన్నా బావుంటాయి. 'చంద్ర మల్లారెడ్డి స్వీట్ హోమ్'లో కొన్నా బావుం టాయి. కానీ, జున్నూ, హన్నూ, బన్నూ, పొన్నూ, విన్నీల కవిత్వంలా చాలమంది కవిత్వం బాగుండదు కదండీ!" అంది విన్నీ.

"హియర్! హియర్! సుపర్బ్ స్పీచ్... గ్రీకులు వక్తృత్వాన్ని కళగా ఆరాధించారు. మీరూ అలా కళాత్మంగా ఉపన్యసిస్తున్నారు. దొ అర్ట్ గ్రీక్..." అన్నాడు బన్నూ.

ఇంతలో 'రమ్మో' (విన్నీ ఇంటి నౌకరు) కెటెల్‌తో టీ పట్టుకొచ్చాడు. నేను ఇంట్లో నుండి కప్పులు తెప్పించాను. అందరం టీ తాగుతూ కవిత్వం, రచనా పద్ధతి వగైరా మాట్లాడుకోసాగాము.

"కవిత్వం ఆశువులా దొర్లుకుంటూ వచ్చి నన్నూ పేసినప్పుడు కవిత్వం చెప్పాను. అసలు కవిత్వం రాయాలంటే సులువైన మార్గాలేమయినా ఉన్నయ్యా?" అని అడిగాను మా సంఘ సభ్యుల నుద్దేశించి.

"కవిత్వాన్ని ఛందోబంధనాల కౌగిలి నుండి సడలించిన రొమాంటిక్స్‌ని అభినందిం చాలి. అసలు కవిత్వం ఛందస్సుకాదుగదా? ఎంతయినా కవిత్వానికి కొన్ని బంధనాలు తప్పవని నాకనిపిస్తుంది" అన్నాడు జున్నూ.

"ఎందువల్ల?" అని అడిగింది విన్నీ.

"మనం ఆధునిక కవులం - కవిత్వం ఎలా రాస్తున్నాం? కాగితానికి నిలువుగా మధ్యన అంగుళం, రెండంగుళాల వెడల్పున సమాంతరంగా రెండు గీతలు కొట్టి, ఆ రెంటి మధ్య కవిత్వం రాసుకుపోవాలి. ఈ గీత నుండి రాయటం మొదలెట్టి, ఆ గీత వరకు రాసి ఆపెయ్యాలి. ఆ తరువాత రెండోలైను, మూడోలైను - ఇలా సాగిపోవాలి. కుడివైపు గీత దాటిన కవిత మంచి కవిత కాదని నా ఉద్దేశం. ఉదాహరణ కిలా చూడండి..." అని కాగితం, కలం తీసుకుని నిలువుగా గీతలు కొట్టి అప్పటికప్పుడు కవిత్వపు పేకమేడ కట్టేశాడు జున్నూ.

"ఏం చేశాను నేను?
ఏం చేయలేదు నేను?
కవిత్వమంటే ఇదేనోయ్
రెండు గీతల మధ్య నాట్యమోయ్
పరుగు పందెంలో లక్ష్మణరేఖల
మధ్య పరిగెత్తే జవ్వని నా కవిత్వం."

"ఇంత స్పష్టంగా కవిత్వమంటే ఇదీ అని స్పష్టంగా విప్పి చెప్పినవారు ఎవరూ లేర్రా నీవు తప్ప!" అన్నాను ఆనందంతో.

విన్నీ విషయాన్ని తొందరగా అర్థం చేసుకో లేదు. కుశంకలు చేస్తుంది.

"మరి మీరు ఇందాక చూపిన ఉదాహరణలో మొదటి రెండు పంక్తులు, కుడివైపు గీతదాకా కూడా రాలేదుకదా?" అని అడిగింది.

ఇలాంటి విషయాలు మనకు కొట్టినపిండేకదా! నేనన్నాను:

"అలా రాయటాన్నే ఇంగ్లీషులో వేరియేషన్ ఆర్ సబ్‌స్టిట్యూషన్ అంటారు. మొనాటనీ తప్పించుకోవటానికి ఆంగ్లంలో కవులు వీటిని ప్రవేశపెట్టారు. ఇనె పోయమ్ వేర్ ద బేసిక్ ఫుట్ ఈజ్ ఎన్ అయాంబ్, ద పాయిట్ సమ్‌టైమ్స్ బిగిన్స్ విత్ ట్రాకీ. ఒకోసారి ఈ వేరియేషన్ని డైమీటర్‌కు బదులు ట్రైమీటర్‌తోనో, టెట్రామీటర్‌తోనో సాధిస్తారు. మనం ఇప్పుడు ఛందోబంధనాలు తొలగించుకున్నాం కాబట్టి అలాంటిదే మరో వేరియేషన్ సాధించుకున్నాం ఆధునిక కవిత్వంలో. అందుకనే కవిత్వంలో పంక్తులు కొన్ని కుడివైపు గీతను తాకవు, మరికొన్ని తాకుతాయి. ఒకోసారి ఆ కుడివైపులక్ష్మణరేఖను దాటినా తప్పులేదని నా ఉద్దేశం. ఏమంటావు జున్నూ?" అని అడిగాను.

"తప్పులేదనుకో. కాని, అలా ఎప్పుడూ గీత దాటటం, కవి అపరిపక్వతకు నిదర్శనం" అన్నాడు జున్నూ.

"సరే రూపాన్ని గూర్చి చెప్పారు. భావం ఎలా ఉండాలి?" అని అడిగింది విన్నీ.

"కంటెంట్‌దేముందండీ? ఏదయినా రాసెయ్యొచ్చు. ముందుగా పేరు పొందిన వారి కవితలు చదవాలి. వారి కవితల్లోని మంచి పంక్తులు కొన్ని అక్కడక్కడా, వీలైతే మెరుగు పెట్టి మన కవితల్లో ఉపయోగించుకోవాలి" అన్నాడు జున్నూ.

"నో. ఐ డోంట్ ఎగ్రీ. దట్ అమౌంట్స్ టు ప్లేజియరిజమ్" అన్నాను నేను.

ఆ మాట అనేటప్పటికి బన్నూకు కోపం వచ్చింది.

"అది అనుభవం లేని మాట. ఆ మాటకొస్తే నువ్వన్న 'ప్లేజియరిజం'కు గురికాని కవి గాని, రచయితగాని ఉన్నాడా? మహా రచయితైన ఆస్కార్ వైల్డ్‌కే తప్పలేదు ఆ నింద. షేక్స్‌పియరేం చేశాడు? సొంత కథ ఒక్కటైనా ఉందా ఆయన్ది? మన ప్రబంధ కవుల్లో శ్రీనాథుడు, పెద్దన, తిమ్మన అసలు కథావస్తువును వేరే మాతృకనుండి గ్రహించని వాడున్నాడా? మన కవులు కొంతమంది ఇతర కవుల పద్యాలకు పద్యాల్నే తమ కావ్యాల్లో వాడు కున్నారు కదా? వాళ్ళకి గ్రంథచౌర్యం అంటగట్టడం దుర్మార్గం. ఇఫ్ ఎనీబడి డజ్ ఇట్ ఐ ఫీల్ ఇట్స్ ఇనెప్రిసియేషన్ ఆఫ్ ద పొయిట్ హూమ్ హి బారోడ్ ఫ్రం" అన్నాడు బన్నూ.

హన్నూ కూడా ఆ మాటకు వత్తాసు పలికాడు.

"బన్నూ చెప్పింది అక్షరసత్యం. ఒక ఇంగ్లీషు నవల ఉంది. దాన్ని శుభ్రంగా పేర్లు మార్చేసి తెలుగులో రాసేసినంత మాత్రాన, రచయిత ఒరిజినాలిటీని కాదనగలమా? ఎంత ఇతరుల్ని అనుకరించినా తనదైన సొంత శైలి ఉంటుందికదా రచయితకు? అలా రాసిన

రచయితలు ఎందరు మన తెలుగు సాహిత్యాకాశంలో ధృవతారల్లా వెలుగొందటంలేదు?" అన్నాడు ఆయన.

వాళ్ళ మాటలు వింటూ ఉంటే వారు చేప్పేది నాకూ నిజమేననిపించింది. మరోసారి ఆ కథలో - బ్రాహ్మడూ, నల్లమేక కథలో నల్గురు దొంగలు అతణ్ణి ఎలా మోసం చేస్తారో గుర్తుకొచ్చి, వాళ్ళ మాటలు నమ్మబుద్ధికాలేదు. బన్నూ నావంక అనుమానంగా చూశాడు.

"నువ్వు వట్టి నిత్య శంకితుడివి. అనుభవం ఉన్న మేం చెప్తున్నాం. వినుకో. తెలియక పోతే తెలుసుకో. మన సంఘ నియమావళిలో ఐదో అధికరణం గుర్తుకు తెచ్చుకో" అన్నాడు బన్ను.

ఇది నాకు వార్నింగ్. ఐదో అధికరణం ప్రకారం సంఘస్థాపన సభ్యులదే అన్ని విషయాల్లో తుది నిర్ణయం - ముఖ్యంగా వివాదం వచ్చినపుడు. సంఘస్థాపన సభ్యులు జున్ను, హన్ను, బన్నూలే తప్ప నేనుకాదు. కాని, ఇలా నాకు హెచ్చరిక చేయటం మా జున్నుకు నచ్చలేదు.

"నో...నో... అంత తీవ్రంగా మాట్లాడాల్సిన పనిలేదు. సభ్యులకు వాక్ స్వాతంత్ర్యం లేకపోతే ఎట్లా? మనం సీనియర్ సభ్యులం. కొత్త సభ్యులకు తెలియచెప్పాలి, విషయ వివరణ చెయ్యాలి" అన్నాడు.

"అవును, అదీ నిజమే. సంఘ మూడవ అధికరణం ప్రకారం కొత్త సభ్యులను రచ యితలుగా కవులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనదికదా?" అన్నాడు హన్ను. అతడు సంఘ నిబంధనల విషయంలో చాల పట్టుదలవున్న మనిషి. అందుకనే అతడు సంఘ కార్యదర్శి కాగలిగాడు.

వాళ్ళిద్దరూ అలా నాకు మద్దతు పలికేటప్పటికి బన్ను కూడ నామీద కాస్తంత కనికరం వహించాడు - పిచ్చుకమీద బ్రహ్మాస్త్రమా - అన్న పద్ధతిలో.

"లేదు... లేదు. తీవ్రంగా మాట్లాడటం కాదు. ఇంతకుముందు పొన్ను కథలెలా రాయాలని అడిగాడు. అప్పుడితనికి ఇంగ్లీషు నవలలు, కథలు చదవమని సలహా ఇచ్చాను. 'వాటిల్లో మీకు నచ్చింది తెలుగు చేయండి' అని సలహా ఇద్దామనుకున్నాను. దీన్ని ఆయన గ్రంథచౌర్యం క్రింద పరిగణిస్తే, 'ఈయన ఎంత మన సంఘ వాతావరణంలో ఉన్నా ఎప్పటికైనా పెరిగేనా' అన్న బాధలో పలికిన మాటలు నావి' అన్నాడు బన్ను.

వీళ్ళ సహృదయతకు నాహృదయం కరిగి పోయింది. సందేహాలన్నీ పటాపంచ లయాయి.

నాలో ఆవేశం పొంగుకొచ్చింది.

**"చీకటి విడిపోయింది**
**జ్ఞానభాస్కరుడుదయించాడు**
**కుశంకల కూపంలో**
**అజ్ఞానపు ఊబిలో**

కూరుకుపోయిన నన్ను
తిరిగి లేవలేని నన్ను
ఉద్ధరించిన ఘనత నీదే బన్నూ!
ఏమని పొగడను నిన్ను?"

అని ఆశువుగా కవిత్వం చెప్పేశాను. బన్ను మనసు నిజంగానే ఆనంద తరంగిత మయింది. "యువారె గ్రేట్ పోయిట్. అలా రాస్తూండు బ్రదర్! ఇంకా ఇంకా ఎత్తులకు ఎదిగిపోతావు" అని నన్నాశీర్వదించాడు.

మళ్ళీ వాతావరణం నిర్మలమయింది. నా కవితా వాతానికి కమ్ముకుంటున్న ఉదాసీన మేఘాలు చెల్లా చెదరయ్యాయి.

మధ్యాహ్నం పన్నెండు గంటలయినా, భోజనాల వేళ అయినా మేము లేవకపోయే టప్పటికి వంటింట్లోనుండి గిన్నెల చప్పుళ్ళు అధికమయాయి. నాతో మాటలయుద్ధమేకాని, మా ఆవిడతో యుద్ధం - చెంబులు, తప్పేలాలు, మూతల ఫ్లయింగ్‌సాసర్లు, కత్తిపీటల్లాంటి రాకెట్లు, బిందెల టాంకులు మొదలైన అత్యాధునిక మారణాయుధాలతో యుద్ధం- అంత తేలిక కాదని గ్రహించిన మా మిత్రులు (విన్నీ వీటికి చిరపరిచితురాలే) ఆనాటి మాసికాన్ని ముగించి లేచారు.

వెళ్ళిపోయేముందు జున్ను నన్ను పక్కకు పిల్చి, "ఒరేయ్! ఏమోననుకున్నానుకానీ, నువ్వు కూడా కవివే, సందేహం లేదు. ఇంకా పైకెదగాలి. 'నవకవిత' రాయాలి. నీ కవి త్వంలో నా కొక్కటే లోపం కన్పించింది. కవిత అంత అర్థస్ఫోరకంగా ఉండరాదు. అస్పష్టత కవిత్వానికి ప్రాణం. అందరికీ అర్థమయేటట్టుంటే అది వచన మవుతుందికానీ, కవిత్వం కాదు. ఏమయినా నా పరువు కాపాడావు. కీపిటప్. నువ్వింక ఆ చచ్చుకథలు రాయాలనే ఆలోచన మానేసి, కవిత్వం మీద దృష్టి ఉంచు - పైకి వస్తావు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

మనస్సానందడోలికల్లో విహరిస్తూండగా, నే వంటింట్లోకి వెళ్ళాను:

"ప్రేయసీ! ప్రియా! జవరాలా!

(మీకేమన్నా పాత పాట గుర్తుకు వస్తే నన్ను తప్పుపట్టకండి. మా వాళ్ళ మాటలు గుర్తుకు తెచ్చుకోండి!)

అలుక ఎందుకే బాలా?
కవితావాతాహతిలో
నవకవితా సృజనాఝరిలో
కొట్టుకుపోలేదు నేను
శిలలా, బండలా నిలబడిన నేను
భయపడతానా వంటింటిచప్పుళ్ళకు
ఆగవు మన ధాటికి గరిటెల్,

చెంబులు, గిన్నెలు, స్పూనుల్, గీనుల్" -

అని కవిత్వం చెబుతూ వెళ్ళి డైనింగ్ టేబిల్ ముందు కుర్చీలో కూర్చున్నాను. వెంటనే పక్కనే ఉన్న బక్కెట నీళ్ళూ నా మీద గుమ్మరించింది మా ఆవిడ.

"ఏమిటిది?" అన్నాను నేను ఉక్కిరిబిక్కిరవుతూ.

"కవితాజ్వరం పట్టింది నిన్ను
వదలగొడతానా దయ్యాన్ని
ఇది కవితా? నా శ్రాద్ధం
వ్యర్థమైంది పొద్దస్తమానం."

అంటూ తనూ రాగ మాలాపించింది. 'వట్టి మూర్ఖపు మొహంది. మూర్ఖులతో వాదించి లాభంలే'దని, టవలు తీసుకుని స్నానానికి వెళ్ళిపోయాను. కాని, అదేం ఖర్మో, మళ్ళీ నా నోటెంట కవిత్వం రాలేదు. దయ్యమో, దేవతోగాని - కవిత్వం మా ఆవిడ దెబ్బకు భయపడి పారిపోయింది నానుండి.

'నెలవంక' సాహిత్య వార్షిక సంచిక, 1995-96

## -3-

ఆరోజు నాలుగో ఆదివారం 'వరసం' మాసికం, ఈ సారి విన్నీ ఇంట్లో జరిగింది. బన్నూవస్తూ తనతోపాటు ఇంకోకొత్త వ్యక్తిని, సంఘంలో సభ్యుడుగా చేరటానికి తీసుకు వచ్చాడు. ఆయనకు సంఘనియమాలను చదివి వినిపించాడు హన్నూ. ఆయన పేరు కోటేశ్వరరావు కాబట్టి "కొన్నూ" అని సంఘ రెండవ అధికరణం ప్రకారం నామకరణం చేయాలని సూచించాడు హన్నూ.

"కొన్నూ" నాకిష్టం లేదండి. "కన్నూ" చేస్తే బాగుంటుందని నా ఉద్దేశం అన్నాడాయన.

"ఏం ఎందుకు ఇష్టం లేదు. సకారణంగా చెప్పండి, అవసరమైతే మారుద్దాం" అన్నాడు హన్నూ.

"నేను సాహిత్య విమర్శకుణ్ణి. 'కన్నూ' అంటే సాహిత్యాన్ని విమర్శనాత్మకంగా అవ లోకనం చేసే 'నేత్రం'గా ఆపేరు నామ సార్థక్యాన్ని పొందుతుంది" అన్నాడు ఆయన. మేమందరమూ ఇక ఎలాంటి అడ్డంకులు చెప్పకుండా ఆయన మాటలకంగీకరించాము.

"సరే సాహిత్య విమర్శ మీద మీ అభిప్రాయాలేమిటో సెలవివ్వండి" అంది విన్నీ.

"సాహిత్యం అంటే ఏమిటి? సృజనాత్మక సాహిత్యం. విమర్శన సాహిత్యం. సృజ నాత్మక సాహిత్యం కంటే విమర్శే గొప్పదని నా భావన, నామతం. ఒక విధంగా విమర్శకూడా సృజనాత్మక సాహిత్యమే" అన్నాడు ఆయన.

"విమర్శ ఏ దృక్కోణం నుండి చేస్తారు మీరు?" అనడిగాను నేను.

"ఇది అర్థంలేని మాట. దృక్కోణం ఏమిటి? ఎవడి దృక్కోణం వాడిది" అన్నాడాయన.

"అది వైయక్తిక విమర్శ అవుతుంది. సబ్జెక్టివ్ ఆర్ ఇంప్రెషనిస్టిక్ క్రిటిసిజం - దానికి కూడ కొన్ని స్టాండర్డ్స్ ఉండాలికదా!" అన్నాను నేను.

"ఇదుగో మీపేరేమిటో-"

"పొన్ను"

"ఆఁ, పొన్నుగారు, మనకు నచ్చింది మంచిది, నచ్చనిది మంచిదికాదు. దీనికింకా స్టాండర్స్ ఎందుకండీ?" అని అడిగాడాయన.

"సాంప్రదాయక విమర్శ, మార్క్సిస్ట్ విమర్శ అని ఏవో రెండు మాటలు విన్నాను లెండి, అందుకని అడుగుతున్నాను" అన్నాను.

"అర్థంలేని మాటలు, నేను ఇంతకాలంగా విమర్శను చేపట్టి అప్రతిహతంగా, అదో వ్రతంగా, దీక్షగా సాగిస్తున్నాను. ఇన్నేళ్ళలో నేనెప్పుడూ వ్రాసినట్టులేదే మార్క్సిస్టు విమర్శ" అన్నాడు ఆయన.

"మీరు రాయటంకాదండీ, విమర్శనా పద్ధతుల గురించి మాట్లాడాను. మొదట్లో తెలుగులో విమర్శ సాధు, అసాధుపాఠ భేదాల మీద సాగింది. కట్టమంచి రామలింగారెడ్డి గారి 'కవిత్వతత్త్వ విచారం'తో అసలైన విమర్శ మొదలైందని వాడుక. సంప్రదాయక విమర్శ కళాత్మక విలువలకు ప్రాధాన్యం ఇచ్చే విమర్శ. మార్క్సిస్ట్ విమర్శ అంటే ఆర్థికపరంగా సామాజిక సంబంధాలపై సాగే సామాజిక స్పృహ కలిగిన విమర్శ అని అర్థం."

"ఈ కమ్యూనిష్టులకు ఎక్కడ బట్టినా మార్క్సు దర్శనమిస్తాడు. నాకు తెలియక అడుగుతాను - సాహిత్యానికీ, మార్క్సుకీ ఏం సంబంధమండీ? ఆఁ, కళాత్మక విలువలకు ప్రాధాన్యమిచ్చే సాంప్రదాయక విమర్శ అన్నారు. అమాట బావుంది."

"సాహిత్యం కళలు సూపర్ స్ట్రక్చర్ అనీ, ఆర్థిక సంబంధాలు బేస్ స్ట్రక్చరనీ మార్క్సిస్ట్ సిద్ధాంతం. బేస్‌లేకుండా సూపర్ స్ట్రక్చర్ ఉండదుకదా! అందువల్ల సూపర్ స్ట్రక్చర్‌ను గురించి చర్చించేటప్పుడు, బేస్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలంటారు మార్క్సిస్ట్ విమర్శకులు" అని వివరించాడు జున్ను.

"నాబొంద! బేస్ స్ట్రక్చరేమిటి? సూపర్‌స్ట్రక్చరేమిటి? నా ఉద్దేశంలో బేస్‌స్ట్రక్చర్ సృజనాత్మక సాహిత్యం, సూపర్ స్ట్రక్చర్ విమర్శ. అయితే పునాదికంటే భవనమే ఆహ్లాదంగా, హృద్యంగా ఉంటుంది కదా, అలాగే సృజనాత్మక ప్రక్రియ కంటే విమర్శే గొప్పదని నాభావం" అన్నాడాయన.

"అదేమిటండీ సృజనాత్మక ప్రక్రియ ఔన్నత్యాన్ని తగ్గించారు. సృజనాత్మక ప్రక్రియ మీద ఆధారపడేకదా విమర్శ ఉండాల్సింది" అన్నాడు జున్ను.

"కాదంటంలేదు. సృజనాత్మక ప్రక్రియ అల్పప్రయోజనాన్నే సాధిస్తుంది, అనల్ప ప్రయోజనాన్ని సాధించేది విమర్శ. సృజనాత్మక ప్రక్రియ స్త్రీ ఐతే, పౌరుషేయమైన విమర్శ ఆమెను రమించి, మధించి అమృతం వెలికితీస్తుంది" అన్నాడాయన.

"రంధ్రాన్వేషి" అన్నాను నేను జున్నుతో మెల్లగా.

"మరా అమృతాన్వేషమంటారండీ" అడిగింది విన్నీ.

"అదో నూతన సృజన. సృజనాత్మక లక్షణాన్నీ, వైమర్శిక లక్షణాన్నీ సంతరించుకుని ప్రభవించిన మనోహ్లాదిని సృజనాత్మక విమర్శ. కళామతల్లికి కర్పూర నీరాజనమిచ్చేది సృజనాత్మక విమర్శతోనే" అన్నాడు జున్ను.

"వైమర్శిక లక్షణమా...?"

"మీరు విన్లేదు. ఆమాట నేను సృజించిందే, కవులు నియంతలైతే విమర్శకులుకారా?" అని ఎదురు ప్రశ్నవేశాడు. మారు మాట్లాడకుండా ఆయన కొత్త పారిభాషికపదాన్ని అంగీకరించసిద్ధమయ్యాం మేం.

"అయ్యా! కన్నూ! నాకు తెలియటంలేదుగాని విమర్శకు రెండు మాటలు వాడారు మీరు – విమర్శ, సృజనాత్మక విమర్శ అని, ఏదేదో నా అల్పబుద్ధికి తోచటంలేదు" అన్నాను.

కన్ను ఓ చిరునవ్వు చిందించాడు.

"విమర్శ అంటే సర్వసాధారణ పద్ధతి – బాగోగుల పరామర్శ. సృజనాత్మక విమర్శ అంటే అదే ఓకావ్యం. ఇప్పుడీ విమర్శ, సాహిత్యనందనోద్యానవనంలో విహరించే వన లక్ష్మి, సాహిత్యసరస్వతి, ఆమె నూపుర నిక్వాణం, హస్తాభినయం, ముఖభావ ప్రకటనలు. అంగాంగపు హొయలు వైమర్శిక హేలలు."

"అత్తనీ కోడల్నీ ఓగాట కట్టేశారు. మరి మనకా ఉద్యానవనంలో ప్రవేశం ఉంటుందా?" అని అడిగాను.

"నాతో రండి నేను తీసుకవెళ్తాను" అన్నారాయన జోకేస్తూ.

"అంటే మాబోటి అల్పజీవులకు మా అంత మాకుగా ప్రవేశం లభించదన్నమాట" అడిగాను నేను.

ఆయన తీక్షణంగా నావంక చూశాడు.

"వైమర్శిక శారదాపాదోధి అందరికీ లభించదు. నాలాంటి గురుకుల క్లిష్టులకే లభ్యం కాని వరమా పెన్నిధి. ఎన్నిజన్మల తపస్సో, పురాకృతసుకృతమో ఉంటేగాని వైమర్శికాంబ కడగంటి చూపైనా మనపైబడదు."

"మరి మాకు ఆ పురాకృత సుకృతమో పాడో ఉన్నదో లేదో తెలిసిచావటం లేదు. మాబోటి పురాకృత సుకృత నష్టులు విమర్శజోలికి పోరాదంటారా?" అని అడిగాను.

ఆయన నన్ను చీమను చూసినట్టు చూశాడు.

"విమర్శజోలికి పోవద్దనలేదు. విమర్శించండి. కాని సృజనాత్మక విమర్శజోలికి పోవద్దు."

"అంటే అర్థమయిందిలేండి. ఈ మధ్య నేను కొన్ని సాహిత్య విమర్శలు చూశాను. విమర్శకుడు కవి అయిపోతాడు. మాటల సంరంభంలోపడి మాతృకనలా ఉంచి, తన కల్పనా లోకంలోకి మనల్ని తీసుకపోయి, తిప్పి తిప్పి తీసుకొచ్చి నేలకేసి కొడ్తాడు. ఇంతా

చదివింతరువాత ఆయనేం చెప్పాడో, మనకేం అర్థమయిందో తెలియక మూత తీయంగానే నివారణ మొదలెట్టే శిరోభార దూరాంజనాన్ని నుదుట పట్టించాల్సిన అవసరం ఏర్పడు తుంది. అంతా వట్టిగాలి" అన్నాను.

"అదేనండీ పొన్నూగారు! నేను చెప్పేది...

హన్నూ సంఘనియమావళిని గుర్తుచేయటానికై ఆయన మాటల కడ్డం వచ్చాడు.

"ఆ గారెలు తగిలించకండి సభ్యులపేర్లతో, అది సంఘ నియమావళికి విరుద్ధం" అన్నాడు.

"సరే, సరే పొన్నూ! మీకిందాకే హెచ్చరిక చేశాను. సృజనాత్మక విమర్శ రచన సంగతి వదిలేయండి. నాబోటి వాళ్ళు కష్టించి, శ్రమించి వ్రాసిన దాన్ని అర్థం చేసుకోవా లన్నా కొంత శిక్షణ అవసరం, పరిశ్రమ అవసరం, దీక్ష అవసరం" అన్నాడు ఆయన.

"సరేలెండి రేపటినుండి దండాలు బస్కీలు తీస్తాడు మావాడు" అన్నాడు జున్ను.

కన్ను, జున్నువంక కోపంగా చూశాడు.

బన్నూ అన్నాడు. "మన విన్నీ కవితనొకటి చదివి వినిపిస్తారు. మీరు విమర్శించి, మచ్చుకు విమర్శ ఎలావుండాలో, సృజనాత్మక విమర్శ ఎలావుండాలో చూపండి".

విన్నీ తన ఉద్గ్రంథం తెరిచింది, కవిత ఇలా చదవసాగింది.

## గిజిగాడు

"ఎన్నాళ్ళైదో బొక్కలగూడు
నీడలో దాక్కుందో గిజిగాడు
రక్తనాళపు వాసాలు ఎండిపోయాయి
ఎప్పుడో టపటపమని పగిలిపోతాయి
చర్మపు పైకప్పు గాలికి కొట్టుకు పోతానంటోంది
కాలం కలిసి రాలేదు, గాలి వీచలేదు
కొత్త కప్పు, వాసాలు వేద్దామంటే
కలిగిన లోగిళ్ళన్నీ మూతపడ్డాయి.
గిజిగాడు ఊరికి ఛిద్రం
తొలగించెయ్యండా ఉపద్రవం
అన్నారు ఉన్నవాళ్ళు
వాళ్ళు ఉంచుకున్నవాళ్ళు
అవునన్నారు.
అందరూ కలిసిగూటిలో జొరబడ్డారు
ఎండిన వాసాలు ఫెళఫెళా విరిగిపడ్డాయి
కప్పు నేల కొరిగింది, గోడలు కూలాయి

అందరూ వాటికింద ఒరిగి పోయారు
గిజిగాడెగిరి పోయింది
తన జాతిని మేల్కొల్పటానికి ఎగిరిపోయింది."

విన్నీ తన ఉద్గ్రంథం మూసేసింది. ఆమెవంక అయోమయంగా చూశాడు కన్ను. "ఏమిటండి ఇదంతా, బొక్కలగూడు, గిజిగాడు, కొంప ఎందుకు కూలిందో, ఎందుకు జనం చచ్చారో - ఇంత అయోమయపు కవిత్వమా?" అన్నాడు కన్ను.

విన్నీ తన్నేమయినా అన్నా భరిస్తుందిగానీ, తన కవిత్వాన్నేమన్నా అంటే పిల్లి దగ్గరికెళ్తే కరిచేసినట్టు, కరిచేస్తుంది.

"పోన్లెండి నా అయోమయపు కవిత్వం పై మీ అయోమయపు విమర్శ విన్పించండి" అంది కోపంగా.

"అయ్యా పొన్నూ! మీకేమయినా అర్థమయిందా ఈ కవిత్వం" అనడిగాడు కన్ను.

"అర్థమయినట్లే ఉందండి, మీ విమర్శకులంత నాకర్థం కాదుగానీ ఏదో కొంచెం అర్థమయినట్లే ఉందండీ" అన్నాను.

"మీకేమర్థమయిందో చెప్పండి."

"ఏముందండీ 'బొక్కలగూడ'ంటే ఎండి వరుగై పోయిన ఏ బిచ్చగత్తో అనుకుందాం. బిచ్చగాడు కంటే బిచ్చగత్తెయితేనే బావుంటుందిలేండి. ఎండివరుగైనా, రక్తమాంసాలు లేక పోయినా, మాసిన పేలికలు కుట్టుకున్నా ఆడది ఆడదేకదండీ. కనుక బిచ్చగత్తె. 'ఎన్నాల్టిదో' అని అన్నదికదా ఆమె. అంటే ముసలి బిచ్చగత్తె. 'గిజిగాడు' అంటే ప్రాణం. ప్రాణాన్ని ఉద్దేశించేగా మనం 'పక్షి ఎగిరిపోయింది' అంటాము. ఆమె శరీరం ఎండి రక్త ప్రసారం అంతంత మాత్రంగా ఉంది. సంస్కారంలేక చర్మం అట్టుకట్టుకుపోయింది. ఎప్పుడో పోయేది. కాని కాలం కలసిరాక ఆగింది. 'కొత్త కప్పువాసాలు' వేయటమంటే ఆకలి నణుచుకోవటానికి బిచ్చమెత్తుకోవటం. అయితే కలిగిన వాళ్ళెవరూ ఆమెకు బిచ్చం పెట్టలేదు. ఈ ముసలిది 'ఊరికి ఛిద్రం, ఉపద్రవం' అన్నారు కలిగిన వాళ్ళు. ఇక్కడ ముసల్ది ఒక వ్యక్తిగాకాక ఆ వర్గానికీ, ఆ వర్గంలోని జనానికీ ప్రతీక. 'కలిగిన వాళ్ళు' అంటే ధనికులు, పెట్టుబడిదారులు. 'ఉంచుకున్న వాళ్ళు' అంటే వాళ్ళను కొమ్ముకాసే వాళ్ళు, పెటీబూర్జువాలు. అందరూ కల్సి ఆ పేద వర్గాన్ని మట్టుబెట్టాలని వెళ్తే, ఆ వర్గం వెల్లువై దూకింది. ఆ ప్రవాహంలో వాళ్ళంతా నాశనమయ్యారు. 'గిజిగాడు' ఎగిరి పోయింది. ఇక్కడ 'గిజిగాడు' అట్టడుగువర్గం వాడు. తన వర్గం వారికి విప్లవ సందేశం ఇవ్వటానికి ఎగిరిపోయింది గిజిగాడు. ఇది నాకర్థమయింది" అని చెప్పాను.

"చూశారుగా అది విమర్శ. ఇక సృజనాత్మక విమర్శ ఎలా ఉండాలో చూడండి. 'బిక్షుకురాలొకర్తు, ధనహీనయై...' "

" 'ధనహీన' అంటారేమిటండీ, 'ధనహీన' అని చెప్పాల్సిన అవసరం ఏముంది! 'బిక్షుకురాలొకర్తు' అని చెప్పారు కదా" అన్నాను.

"అబ్బబ్బా...మధ్య మీరడ్డం రాకండి. అలా మధ్యలో అడ్డంవస్తే సృజనాత్మక విమర్శనా ధార ఎండిపోతుంది" అన్నాడు కన్ను.

"సరేలేండి. కానివ్వండి..." అన్నాను.

"భిక్షుకురాలొకర్తు కృశించి శీర్ణమై, ఎండినకట్టై ప్రాణావశిష్టయై ఉంది. ఆమెకు కాలం తీరలేదు. వెళ్ళిపోలేదు. ఆమె జీవన విపంచి అపశృతుల ధ్వనింపజేస్తోంది. కరుణా సముద్రుడైన భగవంతుడామెపై తన కృపాదృష్టిని బరపలేదు. చేసుకున్న ప్రారబ్ధ కర్మ తప్పింపనెవరితరం? మనిషి తాచేసుకున్న పాపపుణ్యాల కర్మానుసారియై జీవితచక్రం పరిభ్రమిస్తుంది. 'బుద్ధి: కర్మానుసారిణి' అన్నారుకదా! అందువల్లే ఆమె బిచ్చగత్తయింది. అయితే మంచిపనులతో, భగవత్ చింతనలో ఈ కర్మ బంధాన్నుండి తప్పించుకోవచ్చు కదా? ఆహాఁ అలా జరగలేదు. ఆమెకు పరలోక చింతనకంటే ఇహలోక చింతన ఎక్కువైంది. భగవద్భక్తిలో మనసులగ్నంచేయక, ఏహ్యమయిన లౌకిక సుఖాలకు, తిండికి ప్రాముఖ్యత నిచ్చింది. అందుకే దరిద్రపు మరణాన్ని చూరగొంది. 'కలిగిన వా'ళ్ళెవరూ? భక్తులు, 'ఉంచుకున్నవాళ్ళు' ఎవరు? భక్తుల దాసానుదాసులు. వాళ్ళిద్దరూ ఆమెకు పరమాత్మ చింతన కలిగిద్దామని వెళ్లారు; పాపాన్నుండి 'ఛిద్రం' నుండి విముక్తి పొందిద్దామనీ వెళ్ళారు; ఆమె 'ఉపద్రవాన్ని' తొలగిద్దామనీ వెళ్ళారు. అయితే ఆమె అప్పటికే మరణించింది...

"ఈ భావాలన్నీ ఆ కవిత్వంలో ఉన్నట్టు లేవుకదండీ" అన్నాడు జున్ను.

"ఉండవు. ఉంటే అది సాధారణ విమర్శ అవుతుంది. సృజనాత్మక విమర్శ విషయపు పరిధినధిగమించి, వైమర్శికోహల జగత్తులో విహంగమై పయనించాలి. సృజనాత్మక ప్రక్రియ విషయమనే పరిధిలో గిరికీలుకొట్టి సంకుచితమవుతుంది. సృజనాత్మక విమర్శ అనంతాకాశమే తన పరిధిగా పయనిస్తుంది" అన్నాడు కన్ను మాబోటి మూర్ఖుల అజ్ఞాన పంకిల క్షాళనా కర్తవ్యపరాయణుడై, కరుణాళువై.

"సరే, కానివ్వండి" అన్నాడు హన్నూ

"నాకసలు కవిత నచ్చలేదు. 'బొక్కలగూడు'కు అంత్యప్రాసకోసం 'గిజిగాడు' అని వాడటం. ఏ పక్షీ దొరకనట్టు దానికేం ప్రాధాన్యత? ప్రాససౌలభ్యం కోసం కవయిత్రి 'గిజిగాడు' అనివాడటం కవయిత్రి ఊహాపరిధి సంకుచితమయిందనటానికి నిదర్శనం" అన్నాడు కన్ను.

"కాని అన్ని పక్షుల కంటే గిజిగాడు చక్కనిగూడు కట్టుకుంటుంది. అంతశ్రమించే పక్షికీ పుల్లాపుడకా దొరకలేదు. అవన్నీ కలిగిన లోగిళ్ళలో ఉండి పోయాయి. ఆమె బిచ్చగత్తెంది. కష్టించే పనివాడికి సమాజం న్యాయం చేకూర్చనట్లు గిజిగాడికీ న్యాయం లభించలేదు. అందమైన గూడుకట్టుకునే గిజిగాడి నేర్పరితనం, కష్టించి ఉత్పత్తిచేసే కార్మిక, కర్షకుల మధ్య సామ్యం చూపించటం కవయిత్రి ఉద్దేశం. అందువల్ల అంత్యప్రాసకోసమే "గిజిగాడు" వచ్చిందనుకోను నేను" అన్నాను నేను.

"సాధారణ విమర్శకులు అలానే అనుకుంటారు. సృజనాత్మక విమర్శకులు అలా భావించరు."

"నా అయోమయపు కవిత్వం లాగానే ఉంది, మీ అయోమయపు సృజనాత్మక విమర్శ" అంది కోపంగా విన్నీ.

"కవిత అయోమయంగా ఉండొచ్చుగాని, సృజనాత్మక విమర్శ అయోమయంగా ఉండదు. రవి కిరణాలకు మంచెలా కరిగిపోతుందో, అలా కవితలోని అజ్ఞానం సృజనాత్మక విమర్శా వాతాహతికి కొట్టుకుపోతుంది" అన్నాడు కన్ను.

"ఇంతకీ మీరు విన్పించలేదు పూర్తిగా, విన్నీ చదివిన కవితపై మీ సృజనాత్మక విమర్శ" అన్నాడు బన్ను.

"కవయిత్రి తన కవితలో ఆత్మతత్వాన్ని ప్రదర్శించినట్లుగా నాకనిపిస్తోంది. ఆత్మ భగవత్ప్రకృతియైనా, ప్రారబ్ధకర్మవల్ల జీవి నికృష్టమైన పరిస్థితుల్లో జననమొంది, జీవనం సాగించింది. జీవగత మాయననుసరించి ప్రారబ్ధకర్మను తొలగించుకోలేక కొట్టుమిట్టాడింది. తెలిసినవారి తెలివిడికి దూరమై ప్రాపంచిక సుఖాలకై పాటుబడింది. విధిశాసనంతో ప్రేరితులైన ఉదాత్త జన్ములు ప్రారబ్ధకర్మానుసారంగా మలచబడ్డ వికృత స్వరూపాన్ని కనుగొని, దుర్భర మానస సంవేదనా పీడితులయి, జీవికి వికార స్వరూపం తొలగించాలనీ, ఈ విధంగా ఆత్మకు ముక్తివ్వాలనీ ప్రయత్నించారు. 'ఇదే అసలు సత్యం - ఆత్మనిత్యం. వికృత జర్జరిత వాసాల నొదలి ఆత్మతత్వాన్ని తెలుసుకోండి' - అని తత్వాన్ని పాడుతూ, తనలా ప్రారబ్ధ కర్ములయిన జీవుల మేల్కొల్పుతూ, సౌందర్య సృజనకు పరాకాష్ఠయైన గిజిగాడు - ఆత్మ ఎగిరిపోయింది" అని ముగించాడు కన్ను.

"నాకేమర్థం కాలేదండీ" అన్నాను.

"మరి ఆ జీవికి ముక్తి లభిస్తుందా?" అని అడిగాడు జున్ను

"లభిస్తుంది. ప్రారబ్ధకర్మ అనుభవించంగానే, పుణ్యలేశంతో స్వర్గప్రాప్తి కలుగుతుంది. మళ్లీ జననం, మరణం - జీవిత చక్రం సాగుతుంది. క్రిందటి జన్మకంటే ఉన్నతంగా జీవించి నపుడు జీవి ముక్తి సోపానాన్నధిరోహించటం ప్రారంభిస్తాడు. ఎన్నో జన్మల అనంతరం ముక్తి పొందుతాడు" అన్నాడు కన్ను.

"మీది ఇంప్రెషనిస్టిక్ విమర్శలాగుంది" అన్నాడు జున్ను.

"అవును ఆబ్జెక్టివ్ విమర్శ అంటారు కొంతమంది బుద్ధిలేని వాళ్ళు. దాంట్లో ఏముందండీ? అసలు విమర్శకుడిని విడచిన విమర్శ ఎలా బతుకుతుంది?" అని ప్రశ్నించాడు కన్ను.

ఆయన మాటలతో మా జ్ఞాన నేత్రాలు తెరచుకోవటం ప్రారంభించాయి.

"అనుభూతి, రసహృదయం, సౌందర్యపిపాస, విచక్షణాశక్తి, ఆర్ధ్రత - వీటన్నిటినీ మించి జీవ సంపుటిలోని ఆత్మ చైతన్యం - ఇవన్నీ కావాలి సృజనాత్మక విమర్శకుడన్న వాడికి. అవిలేనివాడు జడుడు. మీరన్న ఆబ్జెక్టివ్ విమర్శకుడు వాడు" అని విపులీకరించాడు విమర్శక లక్షణాన్ని కన్ను.

మాకందరికీ చెప్పనలవి కాని ఆనందం కలిగింది. ఆయన పేర్కొన్న లక్షణాలన్నీ కలిగి ఉన్న మహానుభావుడు మా సంఘ సభ్యుడవటం మా సంఘానికే గర్వకారణం అని మేం భావించాం.

"కన్నులాటి ప్రతిభాధురీణులు, విమర్శక చండశాసనులు మన సంఘ సభ్యులవటం మన అందరికీ ముదావహమైన విషయం. మన సంఘ చరిత్రలో ఇదో మైలురాయి. ఓ అపూర్వఘట్టం. అందువల్ల వారిని 'సృజనాత్మక విమర్శక చండశాసన' అన్న బిరుదుతో సత్కరిస్తే బావుంటుందని నేను భావిస్తున్నాను" అని ప్రతిపాదించాడు బన్ను.

ఇప్పటిదాకా, కన్నుపట్ల, తన కవితను నిందించటంవల్ల కినుక వహించిన విన్నీకూడ, చివరగా కన్ను ఆమె కవితలో ఆత్మతత్త్వాన్ని ప్రతిపాదించిందనటంతో అతని పట్ల సుముఖ మైంది.

"సృ.వి. చండశాసనుల కూ జై..." అని అరిచింది.

"ఇలా బిరుదునివ్వటం మన నియమావళికి ఏమైనావిరుద్ధమా? ఒక్క క్షణం ఆలోచించండి" అన్నాడు హన్ను. ఆయన కార్యదర్శిగా తన గురుతర బాధ్యత నెప్పుడూ మరవడు.

"అలా ఏంలేదు కాని, ఇదో ప్రెసిడెంటయి అందరూ బిరుదులు కావాలని అడిగితే కష్టమే..." అన్నాడు జున్ను.

"నువ్వు చెప్పింది నిజమే, ఆలోచించాల్సిన విషయమే" అన్నాడు బన్ను బుర్ర గోక్కుంటూ.

"ప్రెసిడెంటయితే నష్టమేం జరుగుతుంది. మన నియమావళిలో ఇంకో అధికరణం కూడ ప్రవేశపెడదాం. అర్హులైనవారికి బిరుదు లివ్వబడతాయి. అయితే చివర, పురుషులకు 'చండశాసనుడు' అని, స్త్రీలకు 'చండశాసని' అని ఉంటే బాగుంటుంది. ఒకే పద్ధతిలో పేర్లుంటే సామ్యవాదాన్ని సమర్థించిన వాళ్ళమవుతాం" అన్నాను నేను.

"బాగానే ఉంది నువ్వు చెప్పింది. కానీ... "అని నసుగుతున్నాడు జున్ను.

"కానీ లేదు, గీనీలేదు. అసలు నేను మన విన్నీకి 'కవితాచండశాసని' అని బిరుదు ప్రదానం చేయాలని ఎప్పుడో అనుకున్నాను" అన్నాను నేను.

విన్నీ నావంక మెచ్చుకోలుగా చూసింది.

"కానీ సంఘస్థాపన సభ్యులకు కూడా బిరుదు ప్రదానం చేస్తే బావుంటుంది." అన్నాడు బన్నూ.

" 'సంఘ సంస్థాపక మార్తాండుడు' అంటే ఎలా ఉంటుంది" అంది విన్నీ.

"అలావీల్లేదు, 'చండశాసనుడు' చివర రావాలికదా. ఆఁ 'సంఘ సంస్థాపక మార్తాండ చండశాసనుడు' నెంబర్‌వన్, నెంబర్ టూ, నెంబర్ త్రీ – అని పెడ్దాము" అని సూచించాను నేను.

ఎవరు నెంబర్ వన్, ఎవరు నెంబర్ టూ, ఎవరు నెంబర్ త్రీ అన్న ప్రశ్న వచ్చింది.

"అధ్యక్షుడు నెంబర్ వన్, కార్యదర్శి నెంబర్ టూ, మిగిలిన సభ్యుడైన బన్నూ నెంబర్ త్రీ అయితే ఎలా ఉంటుంది." అన్నాడు కన్ను.

బన్నూ కన్నూవంక గుర్రుగా చూశాడు. 'నిన్ను సంఘంలోకి తీసుకవచ్చి సంఘ సభ్యుణ్ణిచేస్తే నాకింత ద్రోహం చేస్తావా?' అన్నట్టుంది అతని చూపు.

"ఇది నే నొప్పుకోను. మీ ఇద్దరికంటే నేనేం తక్కువ. నేనే నెంబర్ వన్ ఉండాలి," అన్నాడు బన్నూ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ.

"ఇది పద్ధతిగాదు. అధ్యక్ష స్థానమిచ్చి గౌరవించిన తరువాత జున్నుకు నెంబర్ వన్ బిరుదుకూడా ఇవ్వాల్సిందే" అన్నాడు కన్ను.

"అట్లా వీల్లేదు" అన్నాడు బన్ను.

"ఎందుకు వీల్లేదు, అదే సరైన పద్ధతి" అన్నాడు హన్ను.

"అసలు పొన్నూనే చేశాడు ఇదంతా. బిరుదు ఒకటే ఉంచి నెంబర్ వన్, టూ, త్రీలు తగిలించటమెందుకు? వేరే వేరే పేర్లు పెట్టుకుంటే పోలా" అన్నాడు బన్ను.

ఈ సూచన అందరికీ నచ్చింది.

"అయితే 'సంఘ సంస్థాపక మార్తాండ చండశాసనుడు' (సంసమాచం) 'సంఘ శత్రు విమర్శనా దోర్దండ చండశాసనుడు' (సంశవిచం), 'సంఘరచనా ప్రవీణోద్దండ చండశాసనుడు' (సంరప్రచం) అంటే ఎలా ఉంటుంది" అన్నాడు కన్ను సూచన చేస్తూ.

"మీ సృజనాశక్తి అద్భుతం. ఎలా అయినా మీకు మీరేసాటి. మీకు సాటెవరూ లేరు ఇలలో, ధరలో... చిన్న సవరణ. మీరందరూ అంగీకరిస్తే. 'దండ' అన్నపదం చివరి రెండు బిరుదాల్లోనూ ఉందికదా. మొదటి బిరుదానికి కూడా అది తగిలిస్తే పేచీ ఉండదు" అన్నాను నేను.

"ఇక్కడ పేచీపెట్టే వాళ్ళెవరయ్యా! అందరం సామరస్యంతో, సమభావంతో వ్యవహరించే వాళ్ళం, సర్దుకుపొయ్యేవాళ్ళం" అన్నాడు బన్ను.

"ఎంతమాట, మీరన్నది నిజమే. కానీ, ఆమాట కూడా తగిలిస్తే బావుంటుందని నా ఉద్దేశం."

" 'సంఘ సంస్థాపక మార్తాండోద్దండ చండశాసనుడు' (సంసమాచం) అందాం" అన్నాను నేను.

దానికి అందరూ అంగీకరించారు. అయితే ఎవరికి 'సంసమాచం' బిరుదు ఇవ్వాలో, ఎవరికి 'సంశవిచం', ఎవరికి 'సంరప్రచం', బిరుదులివ్వాలో తేలలేదు.

"అధ్యక్షుడికి 'సంసమాచం', కార్యదర్శికి 'సంరప్రచం' బన్నూకు 'సంశవిచం' ఇస్తే బావుంటుందని నా సూచన" అంది విన్నీ.

బన్నూ ఆమెవంక ప్రశంసా పూర్వకంగా చూశాడు.

“ ‘సంరప్రచం’ నాకక్కర్లేదు. ‘సంశవిచం’ నాకు బావుంటుంది” అన్నాడు హన్ను.

“నీకు బావుండేది ఏమిటయ్యా! సంఘ సభ్యులకు బావున్నవనిపించిన బిరుదాలు, అర్హతను చూసి ఇస్తారు” అన్నాడు బన్ను.

“అయితే ‘సంశవిచం’కు నాకు అర్హతలేదా? నీ బోడి అర్హతేమిటి? నాకులేని అర్హతేమిటి?” అన్నాడు హన్ను. అతనెప్పుడూ అంతకోపంగా దూకుడుగా మాట్లాడలేదు.

“పోనీ మీరిద్దరూ ఎందుకు కొట్లాడుకుంటారు. ‘సంశవిచం’ అధ్యక్షుడికి ఇచ్చేద్దాం. మిగిలినవి మీరిద్దరూ చెరోటీ పుచ్చుకోండి” అన్నాను నేను పరిష్కార మార్గం సూచిస్తూ.

“అట్లా వీల్లేదు. ‘సంశవిచం’ నాకే ఉండాలి. విన్నీ ఏమందో అంది. ఆవిడ మాట చెల్లాలి” అన్నాడు బన్ను గ్రూపును కూడగట్టుకుంటూ.

“నిజమే, ‘సంశవిచం’కి తగిన వారు బన్నూనే” అంది విన్నీ.

“సంఘ శత్రు వినిర్మూలనాదోర్దండ చండశాసనులు బన్నూకు జై” అన్నాడు కన్నూ కృతజ్ఞతాభావం ఉట్టిపడగా.

“అసలు బిరుదులు అనవసరమయ్యా! సంఘ నియమావళిలో ఇంకో అధికరణం చేర్చాల్సిన అవసరం లేదు” అన్నాడు జున్ను.

“నువ్వన్నమాట నిజమేరా!” అన్నాను నేను.

“సిగ్గులేదుటయ్యా ఆ మాట అనటానికి, నువ్వేగా బిరుదులివ్వాలని ప్రతిపాదించింది” అన్నాడు బన్నూ తీవ్రంగా నా వంక చూస్తూ, కోపం వల్ల అతని నెత్తిమీదున్న నాలుగు వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

“బిరుదు లివ్వాలని నేనేం ప్రతిపాదించలేదు. ఆ మాట అంది నువ్వే” అన్నాను నేను.

“అబద్ధమాడకు...”

“నేనేం అబద్ధమాడటంలా, నువ్వే అబద్ధమాడుతున్నావు.”

“ఇదుగో చూశారా... ఈ గురుద్రోహం! రచన చెయ్యటానికి నా సలహా సంప్ర దింపులు కావాలి. గురువని కూడా యోచించకుండా నేను అబద్ధాలు మాట్లాడుతున్నా నంటున్నాడు. ఈయనపై మనం సంఘ ఐదో అధికరణం ప్రకారం చర్య తీసుకోవాలని నేను కోరుతున్నాను.” అన్నాడు బన్ను ఆగ్రహంతో.

“ఇక్కడ గురువులెవరూలేరు. శిష్యులెవరూలేరు. అందరూ ఒకటే. సంఘ వాతా వరణంలో సభ్యుల సృజనాత్మక శక్తికి దోహదం చేయాల్సిన బాధ్యత అందరిదీ. ఏదో రెండు సలహాలివ్వగానే నువ్వు నా గురువై కూర్చోలేదు” అన్నాను నేనూ ఘాటుగా.

“నిజమే. ఇక్కడ గురువులు, శిష్యులూ, శిష్యురాళ్ళూ ఎవరూ లేరు. అందరం, ఒకటే, అందరం సమానమే” అని నినదించింది విన్నీ.

"ఏం మాట్లాడవేం అధ్యక్షా! ఈయనపై మనం ఐదో అధికరణం క్రింద గట్టి చర్య తీసుకోవాలని నేను ప్రతిపాదిస్తున్నాను" అన్నాడు బన్నూ.

"ప్రతిదానికీ ఇంత రాద్ధాంతం చేస్తావెందుకయ్యా! కన్నుకు 'సృజనాత్మక విమర్శక చండశాసనుడు' బిరుదివ్వాలని నువ్వే ముందు ప్రతిపాదించావు" అన్నాడు హన్ను.

దాంతో తగ్గిపోయాడు బన్ను. గాలెటు వీస్తూందో అర్థమైపోయింది అతనికి. జున్ను ఎప్పుడూ నాపక్షమే. కనీసం హన్నూ అయినా తనతో కలుస్తాడేమో, నాపై చర్యతీసుకో వచ్చున్న బన్నూ ఆశ నీరుగారిపోయింది.

"రాద్ధాంతం చేయటం కాదు. సంఘంలో సభ్యులకు కొంతలో కొంతయినా క్రమ శిక్షణ ఉండాలికదా!" అన్నాడు గౌరవంగా ఉపసంహరించుకుంటూ.

"క్రమశిక్షణ లేనివారెవరూ లేరు ఇక్కడ. ఉన్న వాళ్ళందరూ రచయితలు, కవులు విమర్శకులు. ఎవరికి లేదంటావు క్రమశిక్షణ?" అన్నాడు హన్ను.

జున్నుకు బిరుదు ప్రదానాలు ఇష్టంలేదు. నాకు విన్నీకి వెధవలు ఒక్కడు కూడా మాటవరసకయినా బిరుదు ఇస్తామనలేదు. మాకులేని బిరుదులు వాళ్ళకెందుకు అని మాకు మంటగా ఉంది. హన్నూకు ఇష్టమైన 'సంశవిచం' బిరుదు బన్నూ తన్నుకపోయే టట్లు ఉన్నాడు. అందువల్ల అసలు బిరుదు ప్రదానాలే మానేస్తే బన్నూ తిక్క కుదుర్తుంది. 'మనకు రాకపోయినా ఫరవాలేదు. ఎదుటి వాడికి రావటానికి వీలులేదు' అన్న ఆలోచన హన్నూది. ఇంక బిరుదు ప్రదానానికి సుముఖులు బన్ను, కన్ను. అరిట్లో, నాలుగు అటు పోతే, తమ తీర్మానం నెగ్గేదెలా? అందువల్ల బన్నూ వెంటనే ఫ్లోర్‌క్రాస్ చేసేశాడు.

"అసలు నాకు బిరుదులూ, భేషజాలు నచ్చవనుకోండి. అయినా మీరందరూ సరే నన్నారు కనుక, మీ మాట కాదనలేక నేనూ సరేనన్నాను. పోన్లేండి. బిరుదులెవరికీ ఇవ్వద్దు" అన్నాడు బన్నూ.

"అదేంటి నాక్కూడా ఇవ్వరా?" అనడిగాడు కన్ను.

"మీ విమర్శక చండశాసనత్వాన్ని పూర్తిగా నిరూపించుకోండి. బిరుదు సంగతి తర్వాత" అన్నాను నేను.

"ఇంకా ఏం నిరూపించుకోవాలి?" అన్నాడాయన.

"సృజనాత్మక ప్రక్రియల్లో కవిత్వం సంగతే మాట్లాడారు. మరి నవల, కథానిక, వగైరాలను గూర్చి కూడా మీ అమూల్యాభిప్రాయాలను శెలవియ్యండి" అన్నాను. నాకెం దుకో ఆయన మాట తీరు, డాంబికం నచ్చలేదు.

"సృజనాత్మక ప్రక్రియల్లో కవిత్వం తప్ప మిగతావేవీ పరిగణించ తగినవికాదు. కొంత నాటకం గూర్చి ఒప్పుకోవచ్చుగాని, నవల కథానికా సృజనాత్మక ప్రక్రియలా? నాలుగు వచనం ముక్కలు వ్రాయంగానే సృజనాత్మక ప్రక్రియ అయిపోయిందా! వాటిని నేను సృజనాత్మక సాహిత్యంగా పరిగణించను" అన్నాడు కన్ను.

మహారచయిత బన్ను తన్ను హత్యచేసినంత ఇదిగా బాధపడ్డాడు.

"ఇదుగో కన్నూ! ఆమాట కొస్తే అసలు కవిత్వమే సృజనాత్మక ప్రక్రియ కాదంటాను. మనం ఐరన్ ఏజ్‌కి వచ్చేశాం కవిత్వాన్ని అర్థం చేసుకునే ఓపికా, తీరికా, సామర్థ్యం ఎవరికీ లేదు ఈ కాలంలో. ఈ కాలంలో సాహిత్య ప్రపంచాన్ని ఏలేది కథానికా, నవలా ప్రక్రియలే" అన్నాడు బన్ను.

"అది నేనంగీకరించను. కవిత్వం కవిత్వమే, వచనం వచనమే. వచనం కవిత్వ స్థాయికి ఎప్పుడూ ఎదగలేదు" అన్నాడు కన్ను.

"వచనం, వచనం అంత ఇదిగా ఈసడిస్తున్నారు. మీరు మీ విమర్శ వచనంలో రాస్తారా, కవిత్వంలో రాస్తారా?" అన్నాను నేను వళ్లుమండిపోయి.

ఇంతా కష్టపడి, కాఫీలు గ్రటాతాగి, సిగరెట్లు తగలెట్టి ఏదో ప్రయత్నం నా శక్తిమేరకు చేస్తున్నాను కదా - కథానికలు, నవలలు, ఎందుకూ పనికి రావంటాడా? అని అతని మీద కోపం గొంతువరకు వచ్చింది నాకు.

"అదేనయ్యా పొన్నూ నీకూ, నాకూ తేడా! విమర్శ వచనంలో ఉంటేనేమయ్యా. అది ఒక కావ్యం. విమర్శనా వ్యాసాన్ని కథానిక, నవలలతో పోల్చకండి. ఆధునిక సాహిత్యానికి పట్టుకున్న తెగులు కథానిక, నవల. నడమంతరపు సిరిలా వచ్చింది నడుమనే కొట్టుక పోతుంది" అన్నాడు కన్ను.

ఇహ వీణ్ణి మార్చటం ఆ బ్రహ్మతరం కూడాకాదు అని నేను నోర్మూసుకున్నాను. నేను మాట్లడకపోవటంతో ఇంకా పెట్రేగిపోయాడు పెద్దమనిషి. "వచన కవిత్వాన్ని కూడా నేను కవిత్వంగా పరిగణించను. కాని తప్పదుగదా! తామరతంపరగా పుట్టుకొస్తున్న వచన కవితా రచయితలు 'మా రచనలు కూడా చదివి మీ విమర్శక మధుధార మాపై కురి పించండి' అని నన్ను ఆశ్రయించటంతో ఆశ్రయించిన వారిని పొమ్మనలేక 'పోన్లే పాపం! పిచ్చి సన్నాసులు' అని వచన కవిత్వాన్ని కొంతవరకంగీకరిస్తున్నాను. అసలు కవిత్వమంటే ఛందో నిబద్ధమైన పద్య కవిత్వమే కవిత్వం. వచన కవితలో ఏం ఉండదు కనుక, విమర్శ కూడా లేకపోతే వాటికి అస్తిత్వమే ఉండదని వాటిని కూడా విమర్శించవలసి వస్తున్నది. ఇంకో విషయం కూడా మీకు చెప్పాలి. ఇప్పుడు చాలా మంది అజాగళ స్తనులైన విమర్శ కులు విమర్శనను చప్పచప్పగా జనం స్థాయికి దింపిరాస్తున్నారు. ఇంతఘోరం ఎక్కడా ఉండదు. విమర్శకుడు ఊహాలోకంలో విహరించి, కవితలో లేని అందాన్ని కూడా దర్శించి, విమర్శను కమనీయ కావ్యంగా మలచాలి" అని అలుపు తీర్చుకున్నాడు.

నేను, విన్నీ తప్ప జున్ను, హన్ను, బన్నులు చప్పట్లుకొట్టారు. ఎవరూ ప్రశంసించక పోతే చిన్నబుచ్చుకుంటాడని వాళ్ళలా దోహద ప్రక్రియగా ఉత్సాహాన్ని కల్గించ ప్రయత్నించా రని నేననుకున్నాను. సభ్యుల సామర్థ్యాలను వెలికి తీయాల్సిన బాధ్యత సంఘంది కదామరి!

"స్వంతమైంది రవ్వంత కూడా లేకుండా ఎంగిలి కూతలు కూసే సాహిత్య విమర్శకు లను సాహిత్య వ్యాపసాయికులుగా నేనసలు పరిగణించను" అంది విన్నీ. వచన కవిత్వాన్ని కన్ను దుయ్యబట్టటం ఆమెకు నచ్చలేదు.

"అదేంమాట. విమర్శకూడా సాహిత్య ప్రక్రియే. విమర్శకులు కూడా సాహిత్య కారులే" అన్నాడు జున్ను.

"అంతవరకు అంగీకరించవచ్చు. సృజనాత్మక రచయితల కంటే మేమే గొప్ప అని హనుమంతునిలా తమ తోకలతో ఉన్నత పీఠాన్ని తమంతతామే వేసుకుని, . ఆ పీఠం నుండి సృజనాత్మక రచయితలను చిన్నచూపు చేసే విమర్శకులు సాహిత్యకారులు కాదు, సాహిత్య విధ్వంసకులు. అసలు సృజనాత్మక రచన లేకపోతే విమర్శ ఎలా ఉంటుంది! ఎంగిలి కూతలకు స్థానమెక్కడ?" అని దుయ్యబట్టటం మొదలెట్టింది విన్నీ.

"ఎవరిని గురించి ఆమె అనేది? నన్నేనా..." అడిగాడు కన్ను.

"మిమ్మల్ని గురించి కాదులేండి. సాధారణ విమర్శకుల గురించి ఆమె మాట్లాడింది. మీలాంటి సృజనాత్మక విమర్శకుల జోలికెళ్ళి తన మాట నిలబెట్టుకోగలదా ఆమె!" అన్నాను నేను.

విన్నీ ఇంకా ఏదో అనబోతే కంటిసైగ చేసి వారించాను.

"నా మాటలు ఇన్ని విన్నారు. ఇంక బిరుదు సంగతేమిటో తేల్చండి" అన్నాడు కన్ను.

"బిరుదు ఎవ్వరికి ఇవ్వటంలేదని తీర్మానించుకున్నాంగా?" అన్నాడు జున్ను.

"ఏమిటి? నాగ్గూడానా? మీ సంగతి సరే. కుక్కనూ, గాడిదనూ ఒకే గాటిన కట్టేసి మాటాడకండి" అన్నాడు కన్ను కినుకతో.

"ఎవరు కుక్క. ఎవరు గాడిదండి? మీ మాటలేం బాగులేవు" అన్నాను నేను.

"మీరు బిరుదు ఇవ్వకపోతే నేనిక్కడుండి ప్రయోజనంలేదు. సంఘ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను" అని లేచి వెళ్ళిపోయాడు కన్ను. మా అందరిమీద గొంతువరకు కోపం వచ్చింది అతనికి.

వెంటనే బయటకు వెళ్ళాడు బన్నూ కూడా.

"గాడిద, గాడిద వెంట కుక్క! బన్నూ ఎందుకు వెళ్ళాడు బయటకు?" అంది విన్నీ మెల్లగా.

"ష్! పెద్దగా అరవకండి బాగుండదు" అన్నాను.

జున్ను, హన్నూ లేం మాట్లాడలేదు. ఏం బతిమిలాడాడో, భంగపడ్డాడో కాని కన్నును వెంటపెట్టుకు వచ్చాడు బన్ను.

"కన్నూకు బిరుదు విషయంలో అంత పట్టింపు లేదుగాని, నిజమైన విమర్శక శిఖా మణికి బిరుదు ప్రదానం చేసే అదృష్టం, సంఘానికి లేకపోయిందే అని ఆయన బాధ. పాపం కన్ను చాలా సున్నిత హృదయుడు. ఆ బాధలో ఆయన కొంచెం కరకుగా మాట్లాడిన మాట నిజమే. అయితే ఆయన మాటల్ని కాదు, ఆయన మనసు నర్థం చేసుకోండని కోరుతున్నాను" అన్నాడు బన్నూ ఎంతో వినయంగా.

మేము ఆయన మనసు నర్థం చేసుకున్నాం. ఆనాటి 'మాసికం' ముగిసి బయట కొస్తూంటే కన్ను అన్నాడు నాతో, "మీరు కూడా విమర్శ చాలా బాగాచేస్తారు" అని.

"ఏదోలేండి మీ అంత గొప్ప సృజనాత్మక విమర్శకుణ్ణి కాదు" అన్నాను.

"ఓ మాట చెప్పనా? ఇందాక విన్నీ కవితపై మీ విమర్శ విన్న తరువాత నాకనిపించింది - ఈనాటి ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ విమర్శకులు ఇద్దరే ఇద్దరు అని. మొదటివాణ్ణి నేను. రెండు మీరు" అన్నాడు.

ఇహ నేనేం మాట్లాడలేదు. నా నోరు పడిపోయింది. అంతగా సబ్బు పులుముతుంటే ఆయన్ని ప్రముఖ విమర్శకుడిగా గుర్తించక తప్పలేదు నాకు.

'నెలవంక' సాహిత్య వార్షిక సంచిక, 1996-97

## -4-

ఈ మధ్య రెండు, మూడు, 'వరసం' మాసికాలకు వెళ్ళటం పడలేదు.

"ఈసారి మన 'వరసం'కో కొత్త సభ్యుడు వస్తున్నాడోయ్. మర్చిపోక రావాల్సింది బన్నూ వాళ్ళింట్లో సమావేశమవుతాం ఈసారి" అని ఆ మధ్య హన్నూ బజార్లో కన్పించి చెప్పిం తరువాత ఎలాగో వీలు చేసుకుని ఆ నెల 'వరసం' మాసికానికి వెళ్ళాను. హన్నూ ఆ కొత్త సభ్యునితో వచ్చాడు. ఆయన పేరు సుబ్రహ్మణ్యం. టి.వి.లో నాటకాలకు దర్శకత్వం వహిస్తూంటాడాయన. వయస్సు 43, 44 ఉంటుంది. విశాలమైన నుదురు. మనిషి పచ్చగా ఉన్నాడు. గిరజాల జుట్టు.

హన్నూ సంప్రదాయం ప్రకారం ఆయనకు సంఘ చట్టాన్ని చదివి విన్పించాడు. సంఘ నియమాలకు లోబడి విధేయతతో వర్తిస్తానని ఆయన అన్న తరువాత ఆయనకు 'సున్నూ' అని నామకరణం చేయటం జరిగింది. వరసం మాసికానికి జున్నూ, హన్నూ, బన్నూ, కన్నూ, నేను - పొన్నూను వచ్చాం. ఇంకా విన్నీ రాలేదు. వస్తుందో రాదో తెలియదు. "కబురు అందింది వస్తాను" అని మాత్రం అన్నది రెండు రోజుల క్రితం. అయితే ఆలస్యం కాకుండా మా సమావేశాలు జరగటం మామూలు కనుక వెంటనే ప్రారంభించాము.

కొత్త సభ్యుడు వచ్చాడు కనుక మా సంభాషణ - నాటకాలు, వాటి నిర్వహణ దర్శకత్వం వగైరా విషయాల మీదకు పోయింది.

"మీరు నాటకాలు దర్శకత్వం వహించటమేనా లేక వేషాలు కూడా వేస్తారా" అని అడిగాడు కన్నూ.

"ఈనాటి దర్శకుడంటే అన్ని రంగాల్లోను ప్రావీణ్యత ఉండాలి. దర్శకుడే రచయిత అయివుండాలి. వీలయితే నాయకుడి పాత్ర వేయగలిగి ఉండాలి. రెండు మూడు పాత్రలు కూడా ధరించగలిగి ఉండాలి. ఏం చెప్పను లేండి, ఈనాటి దర్శకుడి మీదవుండే బరువు బాధ్యతల గురించి. సర్వజ్ఞుడై ఉండాలి" అన్నాడు ఆయన.

"అయ్యా మీరు నా ప్రశ్నకు సరిగ్గా సమాధానం చెప్పలేదు. మీరు వేషాలు కూడా కడ్తారా అంట?" అన్నాడు పట్టువదలని విక్రమార్కుడు కన్నూ.

"రంగు పులుముకోని దర్శకుడెవడండీ అసలు. సినిమారంగం నుండి, నాటకరంగం వరకు – ఆఖరుకు వీధినాటకాల్లోను దర్శకత్వం వహించే వాడు, ముఖ్యంగా ఎప్పుడో అప్పుడు వేషం కట్టే ఉండాలి. నేనూ వేషాలు వేశాను. ఒక్కోసారి ఒకే నాటకంలో రెండు మూడు పాత్రలు కూడా వేశాను" అన్నాడు ఆయన.

"ఒకే ముఖాన్ని ఒకే నాటకంలో రెండు మూడు సార్లు చూసి జనం విసిగిపోరుటండీ. సినిమాల్లోను అదే తంతు! నటులే లేనట్టు ఒకే నటుడు రెండు మూడు పాత్రలు ధరిం చేయటం! ముఖ్యంగా పౌరాణికాల్లో మా ప్రాణం తీస్తున్నారనుకోండి. ఒకే నటుడు రాముడు, రావణాసురుడు. ఒకే నటుడు. భీముడు, ఘటోత్కచుడు, కీచకుడు, దుర్యో ధనుడు వీలయితే పంచపాండవుల పాత్రలన్నీ వేసేవాడు. కాని, మరీ జనం భరించలేరని మానేసినట్టున్నారు" అన్నాడు, విమర్శక శిఖామణి కన్ను.

"మీకు తెలియకా అలా అడుగుతున్నారు. డబ్బండీ స్వామీ డబ్బు! నాలుగు పాత్రలకీ నలుగుర్ని పెట్టుకుంటే వాళ్ళందరికీ డబ్బివ్వాలా? నలుగురూ నాటకాల్లో అయితే రిహా ర్సల్స్‌కూ, సినిమాల్లో అయితే కాల్‌షీట్లకూ సరిగా హాజరవరు. వీళ్ళందర్నీ సరిదిద్ది ఒక దగ్గరకు చేర్చటం ఎంత కష్టమో మీకు తెలీదు. కప్పల తక్కెడ సామెతనుకోండి. ఒక కప్ప వేస్తే, ఇంకో కప్ప ఎగిరిపోతుంది. అందువల్ల అన్ని పాత్రలు ఒక్కడే వేస్తే, అదీ దర్శకుడైన నటుడు వేస్తే ఇబ్బందే ఉండదు. అందుకనే సినిమాల్లో కథా, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, నటుడూ వాళ్ళే ఉంటున్నారు, ఈ బాధలన్నీ భరించలేక."

"నటుడికి దర్శకత్వం చేసే తెలితేటలుండవచ్చు కాని కథారచన, స్క్రీన్‌ప్లే, నాటకాల్లో అయితే నాటక రచనా సామర్థ్యం ఉండొద్దుటండి" అన్నాడు హన్ను.

"నటుడిగా ప్రావీణ్యం ఉంటే మిగతావేముందండీ. చచ్చు కథారచన, నాటకం రాయటం, చేయలేడుటండీ. అం నటించటమంటే కష్టం, దర్శకత్వ వహించటమంటే కష్టం, రచన అంత కష్టం కాదని నా ఉద్దేశం" అన్నాడాయన.

"మరి చాలా మంది దర్శకులకు ఘోస్ట్ రచయితలుంటారని విన్నాను. ఆ మాటల్లో ఎంత సత్యముందంటారు" అనడిగాను నేను.

"కొంత మందికి తీరిక దొరక్క రచన ఎవరు చేస్తేనేమిలే, మనం దాన్ని మెరుగు పెడతాము కదా అని ఘోస్ట్ రైటర్స్‌ని పెట్టుకుంటారనుకోండి. అందువల్ల వాళ్ళు ఈ చచ్చు రచన చేయలేరని మనం అనుకోరాదు" అని తన అమూల్యాభిప్రాయాన్ని సెల విచ్చాడు సున్ను.

"అయితే నటుడైతే దర్శకత్వ లక్షణాలు వచ్చేస్తయ్యన్నమాట" అన్నాన్నేను.

"మీకు తెలియంది ఏముంది. ఒకనాటి గొప్ప నటులందరూ, ఈ నాటి గొప్ప దర్శ కులే కదా! మనక్కావల్సింది నటనండీ, మిగతావన్నీ వాటంతటవే వస్తాయి."

"నటులే దర్శకులయి పోవటంతో సినిమారంగం చెడిపోయిందని నా అభిప్రాయం. నటన కళే. సందేహం లేదు. కాని దర్శకత్వం కూడా వేరే కళ. దర్శకులందరూ గొప్ప

నటులు కాకపోవచ్చు. నటులు దర్శకులయ్యే అవకాశాలు తక్కువ. దర్శకుడికుండాల్సిన లక్షణాలు, నటుడి కుండాల్సిన లక్షణాలు వేరు. ఇది మీరు కాదనరని నా ఉద్దేశం" అన్నాను నేను.

"లెట్స్ అగ్రీ టు డిజెగ్రీ. ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి" అన్నాడాయన.

"అదేవిటిలేండి. నటుడైం తర్వాత నాటకం, సినిమాలకు ఎలా దర్శకత్వం వహించాలో అదే తెలిసిపోతుంది. ఈ నాటి విమర్శకుల్లో ఎంత మంది కవుల్లేరు. చేపపిల్లలకు ఈత నేర్పాలా ఏం? నటుల పిల్లలు కూడా చిన్నప్పటి నుండి ఆ వాతావరణంలో ఉండటం వల్ల నటన సహజంగా వచ్చేస్తుంది" అన్నాడు కన్ను.

"నేనొప్పుకోనండీ. రచన లాగా నటన కూడా ఇన్ బార్న్ టాలంట్. మీరో కవిని, రచయితని, నాటక కర్తని ఎలా తయారు చెయ్యలేరో, అలాగే ఒక నటుడ్నీ, నటీమణినీ తయారు చేయలేరు. ఒక మనిషిని చక్కగా పాట పాడేట్టు చేయలేం. అలాగే నృత్యం చేసేట్టు చేయలేం. అసలు ప్రతిభ లేకపోతే పైపై మెరుగులు ఎన్నిపెట్టినా ప్రయోజనం లేదు."

"మీరనేది అనుభవం లేనిమాట. అక్కడిదాకా ఎందుకు. మా అబ్బాయి కూడా నాటకాల్లో వేస్తాడు. తండ్రీ కొడుకుల పాత్రలు వేయవల్సి వస్తే మేమిద్దరం కట్టేస్తాం. నిజంగా నాటకం ఎంతో రక్తి కడుతుందనుకోండి. మన సినిమా రంగంలో కూడా చూస్తున్నాం కదా! నటుల పిల్లలు దర్శకుల పిల్లలు నటులయిపోవటంలా" అన్నాడు సున్ను.

"అందుకనే సినిమారంగం ఇంత అధ్వాన్నమయిపోయింది" అన్నాను నేను.

"పొన్ను చెప్పే మాట నేనూ ఒప్పుకోను. మన 'వరసం' కూడా ఏ మౌలిక సిద్ధాంతం మీద ఏర్పడింది. వాతావరణం సృజించినట్లయితే మామూలు మనుష్యులు కూడా, కవులు, రచయితలు, నటులు అయిపోతారనేగా? వాతావరణం ముఖ్యంగాని ప్రతిభదేముందండీ, దానంతటదే వస్తుంది" అన్నాడు బన్ను.

"వాతావరణమే కాదు. స్పందనా హృదయం కూడా ఉండాలి. అలా అని మన చట్టంలో రాసుకున్నాం. నటుడి కొడుకు నటుడైతే, కవి కొడుకుని కవి, గాయకుడి కొడుకు గాయకుడు, చిత్రకారుడి కొడుకు చిత్రకారుడూ అవడం లేదే?" అన్నాడు జున్ను.

"మరి 'సురభి' నాటక సమాజంలాంటి వాటిల్లో నటుల సంగతేమిటి? ఒక సమాజంలో రమారమి ఏడెనిమిది కుటుంబాలు ఉంటాయి. కుటుంబ సభ్యులు చాలా మంది నటులే. అనారోగ్యంవల్ల ఒకరు వేషం వేయటానికి వీలుకాకపోతే ఇంకోరు వేస్తారు. వాతావరణం నుండి నటులు పుట్టుకు రావటం లేదా?" అన్నాడు సున్ను.

"మరి వారిలో ఎంతమంది నటులు, నటీమణులు ప్రఖ్యాతి గాంచారు. ఆ విషయం కూడా చెప్పండి" అడిగాడు జున్ను.

"దానికి బోల్డన్ని కారణాలున్నాయి లేండి. పోనీ ఇప్పుడు సినిమా రంగంలో చాలా మంది నటుల, దర్శకుల కొడుకులే ఉన్నారు కదా! వారు నటులుగా ఎంతో పేరు పొందుతున్నారు. జనాదరణ లభిస్తోంది. దానికేమంటారు మీరు?" అన్నాడు సున్ను.

"చవకైన వినోద సాధనం సినిమా. ఏమీ తోచక ముసలాయన స్టెప్పులెలా వేస్తాడో, కుఱ్ఱాయన ఎలా వేస్తాడో చూడటానికి వెళ్తున్నారు జనం. ఈ సినిమాల్లో కావలసింది నృత్య దర్శకుడు కాదు డ్రిల్లు మాష్టరు. జనం వెళ్తున్నారు కాబట్టి వాళ్ళు మహానటులై పోలేదు. విషాద ఘట్టంలో నటుడు ఏడిస్తే తాదాత్మ్యం చెందటంపోయి జనం నవ్వుకుంటు న్నారు. అఫ్‌కోర్స్, ఇదీ ఒక రకం వినోదమే. నటనంటే విదూషకత్వంకాదు, స్టెప్పులేయటం కాదు – సరిగ్గా ఉచ్చారణ, డైలాగ్ డెలివరీనే లేనివాళ్ళు నటులేమిటండీ?" అన్నాను నేను.

"మీది మరీ చాదస్తమండీ. తెలుగుభాష వట్టి దరిద్రపు భాష – మహాప్రాణాలు, అల్పప్రాణాలు, నా బొంద, నా బోలె. పిల్లలకు ఆ వత్తులు అవీ పల్కటం కొంచెం కష్టంగానే ఉంటుంది. నేర్చుకుంటారు. అయినా జనంలో ఎంత మందికి తెల్సు – ఎక్కడ వత్తులు పెట్టాలో, ఎక్కడ పెట్టక్కరలేదో. అందువల్ల కొంత సహృదయతతో మీరు వీటిని గమ నించాల్సి ఉంటుంది" అన్నాడు సున్ను.

టీ.వి. అనౌన్సర్ల ఉచ్చారణ సంగతి కూడా అడుగుదామనుకున్నాగానీ, కాళ్ళ బేరానికి వచ్చేసింతరువాత ఇంక, ఆ విషయంలో పెద్ద మనిషిని వత్తిడి చేయడం నాకు బాగని పించలా. అందుకని ఆ విషయాన్నంతటితో వదిలేశాను.

"మీరేమి అనుకోకపోతే మీరన్న ఇంకొక్క మాట నాకు నచ్చలేదండీ. నాటక రచన చచ్చుప్రక్రియగా జమకట్టారు. ప్రపంచంలో ఎక్కడయినా నాటక రచనా ప్రక్రియ గొప్పగా భావిస్తారు. మన పూర్వీకులు కూడా శ్రవ్య, దృశ్య కావ్యాల్లో దృశ్య కావ్యమే ఉన్నతమైందిగా, కష్ట సాధ్యమయిందిగా భావించారు. కావ్యంలోను, లేక నవలలోను కవికీ, రచయితకూ ఉన్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నాటక కర్తకు ఉండవు. ఆయన చెప్పదల్చుకున్నదంతా పాత్రల నోటినుండి చెప్పించాల్సిందే. నాటక రచన అంత సులువైందీ, చచ్చు ప్రక్రియా కాదని నా ఉద్దేశం. మీరేమంటారు?" అని అడిగాను.

"మీవన్నీ పాతకాలంనాటి భావనలు. ఇవాళ నాటకం, సినిమా స్క్రీన్‌ప్లే ఎలా రాస్తున్నాం? స్టాక్ క్యారెక్టర్స్ ఉన్నాయి. స్టాక్ ఇన్సిడెంట్సు ఉన్నాయి. ఆ పాత్ర ఈ పరిస్థితిలో ఇలా ప్రవర్తిస్తుంది. ఇలా మాట్లాడుతుంది అని ఊహించటమేం గొప్పండి. అసలు నటుల్ని దృష్టిలో ఉంచుకొని నాటకాలు, స్క్రీన్‌ప్లేలు రాసేస్తున్నారు. నటులు వాటికి మెరుగులు పెడ్తున్నారు. అందుకనే స్టేజీ మీద కూడా నాటకంలో డైలాగ్ ఓ విధంగా ఉంటే నటుడు తనకి సరిపోయినట్టుగా, సహజంగా ఉండేటట్లు మార్చేస్తున్నాడు. కాబట్టి నటుడికంటే, దర్శకుడి కంటే నాటక కర్త గొప్ప కాదని నా భావన" అన్నాడు సున్ను. వెధవది మా 'వరసం' నియమాల ప్రకారం వీలుకాదుగాని ఆయన పేరు 'సున్న'గా మారిస్తే నాకేం అభ్యంతరం ఉండదు.

"మీకు పౌరాణికాలంటే ఇష్టమా, సాంఘికాలంటే ఇష్టమా?" అని అడిగాడు జున్ను.

"నాకు పౌరాణికాలు, మా అబ్బాయికి సాంఘికాలంటే ఇష్టమండి" అన్నాడు సున్ను.

"అయితే మీరు సాంఘికాల్లో నటించటంగానీ, వాటికి దర్శకత్వం వహించడంగాని చేయరన్నమాట" అడిగాడు జున్ను.

"అలా ఏంలేదు. సాంఘికాల్లోనూ వేస్తాను. దర్శకత్వం వహిస్తాను" అన్నాడు సున్ను.

"పౌరాణిక నాటకాలెలా ఉండాలో మీ అభిప్రాయం చెప్పండి" అడిగాడు జున్ను.

"ఏం చెప్పమంటారు! విపరీతకాలమొచ్చింది. సాంఘికాల సంగతి వదిలేయండి. పౌరాణికాల్లో కూడా సామాన్య జనానికి అర్థమయ్యే వాడుక భాషలోనే రచన ఉండాలని కొంతమంది పెద్దల్లోనే భావం పేరుకుపోయింది. నా ఉద్దేశంలో భాష ఉదాత్తమై, సంస్కృత సమాస భూయిష్టమై ఉండాలి. టాపిక్ క్లాసికల్, భాష కూడా క్లాసిక్‌గా ఉండాలి. పద్యం రాగయుక్తంగా చదివే నటుడుండాలి. ఇహ చూసుకోండి, జనం చప్పట్లు చరుస్తారు. హాలంతా ఒన్సు మోర్లలో మారు మోగిపోతుంది పద్యం చదివినప్పుడు...." అని ఓ పద్యం చదివాడు రాగయుక్తంగా.

"చతురంబోధి పరీత భూవలయ రక్షాదక్ష చామీకరా
యత దండంబు దండించు ఈ కరమె ఆహా! ఇప్పుడిక్కాటిలో
చితిలో కాలుచున్న ఈ కొరవి ద్రాల్చెన్ నవ్యమాణిక్య రా
జిత నీరాజన కాంతికిన్ బదులు వచ్చెన్ శోచనీయంబుగన్... న్... న్... న్..."

రాగం పది నిమిషాలు తీసి ఆపాడు. సున్ను పద్యమయాక చెప్పాడు:

"అసలు స్వారస్యం అల్లా రాగంలో ఉంది లెండి. చివర్లో ఠక్కున గొంతు కొరికేసినట్లు పద్యం ఆపేస్తే ఏం బావుంటుంది. అలా హొయలు హొయలుగా పైకి, కిందికి తిప్పి ప్రేక్షకుల హృదయాన్ని కూడా ఒక ఊపు ఊపని రాగం లేనిపద్యం చదివీ చదవకా ఒకటే."

"అంత పొడుగ్గా అరమైలు సాగితే అది అరునొక్క రాగాన్ని తలపింప చేస్తుందేమోనని నా భయం" అన్నాను.

"మీకు తెలియక అలా అంటారు కానండీ. అసలు పౌరాణిక నాటకానికి శోభ రాగం, పద్యం. ఇవి లేకుండా ఇదే భావాన్ని 'రాజదండం ధరించే ఈ చేయి ఇప్పుడీ కాటిలో చితిలో కాలుతున్న కొరవి పట్టుకుంది' అని వచనంలో అన్నామనుకోండి. ఎంత పేలవంగా ఉంటుంది. ఆఁ, ఆ వచనమైనా సంస్కృత సమాస భూయిష్టమైతే నాటకానికొక వన్నె, ఠీవి, ఉదాత్తత వస్తాయి" అన్నాడు సున్ను.

"రాగాలు అంతపొడుగ్గా దీర్ఘంగా సాగడం, వన్స్ మోర్లతో మళ్ళీ పద్యాలు పాడటంతో రాత్రంతా సాగే పాండవోద్యోగ విజయాల్లాంటి పౌరాణికాల్లో ఒకటవ కృష్ణుడు, రెండవ కృష్ణుడు, మూడవ కృష్ణుడు, నాల్గవ కృష్ణుడు అలాగే అర్జునులు పెట్టుకోవాల్సి వస్తోంది. ఇంతమంది పాత్రధారులుండటంతో నాటకంలో హార్మొనీ దెబ్బతింటోంది. పైగా ఎప్పుడో చివర్లో వచ్చే నాలుగో కృష్ణుడు తప్పతాగి పడుకున్నవాణ్ణి లేపి రంగస్థలం మీదకు పంపిస్తే అర్జునుణ్ణి, 'ఓరే బామ్మర్ది!' అని రసాభాస చేయటంలాంటి సంఘటనలు మనం వింటూనే ఉంటాం" అన్నాడు జున్ను.

"అది రాగం తప్పుకాదులేండి. రాత్రల్లా సాగే నాటకాల్లో పద్యం రాగయుక్తంగా పాడటానికయినా దమ్ముండాలి గదా! అందుకని ఒకే పాత్రకి అంత మంది పాత్రధారుల్ని

పెట్టాల్సి వస్తున్నది. దానివల్ల కూడా ఉపయోగం ఉంది. నటులు తమ వైయక్తిక ప్రతిభతో వైవిధ్యాన్ని సమకూర్చి పెడుతున్నారు" అన్నాడు సున్ను.

"సరే సాంఘిక నాటకాల పరిస్థితి గురించి కూడా రెండు ముక్కలు చెప్పండి" అని అడిగాడు జున్ను.

"సాంఘిక నాటకాలదేముందండి చాలా సింపుల్. హాస్య ప్రధానం. లేక మెలోడ్రమిటిక్ ఎలిమెంటు ఉంటే చాలు."

"బట్ వాటై హర్డ్ ఈజ్ మెలో డ్రామా ఈజె డిబేసడ్ ఫాం ఆఫ్ ట్రాజెడీ, అండ్ ఫార్స్ ఈజ్ ద కోర్సర్ ఫాం ఆఫ్ కామెడీ; అండ్ ఇన్ బోత్ నో అటెంప్ట్ ఈజ్‌మేడ్ ఎట్ ఫిడిలిటీ టు రియల్ లైఫ్" అన్నాను.

"అవి పాతబడిన భావాలు. కళంతా అనుకరణే అని సిద్ధాంతం కదా! జీవితాన్ని అనుసరించని ఫార్స్‌కాని, మెలో డ్రామాగాని బతుకుతాయిటండీ?" అన్నాడు సున్ను.

"నూతనత్వం, ఆధునికత సంతరించుకోవాలని తెలుగు నాటకకర్తలు విదేశీ నాటక కర్తలను అనుకరించారు. కుటుంబంలోని వ్యక్తులంతా డైనింగ్ టేబుల్ దగ్గర తప్ప కలుసుకోని సాంఘిక వ్యవస్థలో నుండి నాటకం వస్తోందని గోలపెట్టాడు ప్రీస్ట్‌లీ. మనం డ్రాయింగ్ రూం యధాతథంగా తెచ్చిపెట్టుకొన్నాం. ప్రతి ఎమెచ్యూర్ నాటకంలో డ్రాయింగ్ రూం తప్పనిసరి. మీ టి.వి. నాటకాల్లో కూడా ఈ గది ఇనెవిటబుల్ అయి పోతోంది. అక్కడనే పాత్రల ప్రవేశాలు, నిష్క్రమణలూ. పోనీ, నాటకాలంటే సీన్లు మార్చాల్సిన ఇబ్బంది ఉంది. టి.వి.లో తీరిగ్గా కెమెరా చెసే పనే కదా! డ్రాయింగ్ రూం అనే స్టాక్ సీను తప్పించలేరా?" అన్నాను నేను.

"సీన్సే కాదు, పాత్రలు కూడా స్టాక్ క్యారెక్టర్స్ తయారు చేస్తున్నారు. అటు సినిమాల్లోను, నాటకాల్లోను. జమీందారు లేక ఫాక్టరీ యజమాని అలాగే లక్షాధికారి స్నేహితుడు. ఆయనకొక కొడుకు, ఈయనకొక కూతురు. వాళ్ళ మధ్య డ్రిల్ పెరేడ్ ప్రేమాయణం. నాటకంలో అయితే కాఫీ హోటలు అయ్యరు, రాజకీయ నాయకుడు (ఆయన ఇప్పటికీ గాంధీ టోపినే పెట్టుకుంటాడు), దురాశ ఉన్న కోమటి (వీడు సుబ్బిశెట్టి బ్రదర్) మధ్య తరగతి గృహస్థులకు కూడా ఒక నౌకరు. వాడు చాలా ఫిలసాఫికల్. యజమానికి కూడా సలహాలిస్తుంటాడు. ఇన్సిడెంట్స్ కూడా స్టాక్ ఇన్సిడెంట్సయి పోయాయి" అన్నాడు జున్ను.

"స్టాక్ సీన్స్, స్టాక్ క్యారెక్టర్స్, స్టాక్ ఇన్సిడెంట్స్ ఉన్నాయి. నిజమే. ముఖ్యంగా ఏకాంకికల్లో స్టాక్ సీన్సు తప్పవు. దానివల్ల నష్టమేంటంట! పైగా లాభం కూడా. నాటక రచయితల అవసరం తప్పిపోయింది. నటుడైన వాడు ఇట్టే నాటకాన్ని రాసిపారెయ్యగలడు" అన్నాడు సున్ను.

"అదేనండీ అందువల్లే పారెయ్యాల్సిన నాటకాలు, తలనొప్పి మాత్రలు వాడాల్సిన సినిమాలు వస్తున్నాయి" అన్నాను.

"మీ పేరేమిటండీ!... మర్చేపోయాను" అడిగాడు సున్ను.

"ఔను."

"మీరు కూడా నటులేనా?"

"అమ్మ బాబోయ్, నటుడికి నాకూ ఆమడ దూరం."

"అదీ, అందువల్లే మీరు సరిగ్గా విషయ గ్రహణం చేయలేకుండా ఉన్నారు."

"నాటకాన్ని చూసి ఆనందించటానికి నటుడవ్వాలా ఏమిటండీ?"

"నాటకాన్ని, సినిమాని చూసి, ఆనందించాలంటే నటహృదయం ఉండాలి."

"ఇదేదో కొత్త పదార్థంలాగా ఉందే. కవి హృదయం అని విన్నాను కాని నట హృదయం అనేది ఇప్పుడే వినడం."

"అయితే నాటకాన్ని గురించి సినిమాల గురించి మాట్లాడే హక్కులేదు మీకు."

"చంపారు పొండి. పోనీ అదెక్కడుంటుంతో చెప్పండి. వీలైతే అరువైనా తెచ్చుకుంటాను."

"అరువు తెచ్చుకోవటానికి అదేం వస్తువు కాదండీ! నటుడవటానికి స్కిల్ అవసరం. సామాన్య ప్రేక్షకుడికి నట హృదయం అయినా ఉండాలి. నట హృదయమంటే నాటకాల్లో సినిమాల్లో తాదాత్మ్యం చెందటం. అప్పుడు మీ దృష్టి ఇలా తప్పుదోవ పట్టదు."

"అది నా బాధ్యతకాదు. నాటకం కల్గించాల్నిందేమిటి? ఆ పెద్ద మనిషెవడో చెప్పాడు గదా విల్లింగ్ సస్పెన్షన్ ఆఫ్ డిజ్‌బిలీఫ్ అని. అది కల్గించాల్సిన బాధ్యత నాటక కర్తలదీ, నటులదీ, ప్రయోక్తలదీ. తప్పు మీ దగ్గర పెట్టుకుని నాబోటి వాణ్ణి పట్టుకొని మీకు నట హృదయం లేదనడం అర్థంలేని మాట" అన్నాను.

"అబ్బా, నువ్వుండరా! మీరే మనుకోకండి, సున్నూ! మా వాడు కొంత తీవ్రవాది. అప్పుడప్పుడూ మా వరసంలో వివాదాలు రేపుతుంటాడు" అన్నాడు జున్ను.

"అయ్యో మీరంతగా చెప్పాలా. నేనెప్పుడో ఆ విషయం గ్రహించానులేండి" అన్నాడాయన.

ఇలా మా సంభాషణ సాగుతుండగా విన్నీ ఆమెతో పాటు కన్య వచ్చారు. కన్యకూడా మేమున్న లోగిల్లోనే అద్దెకుంటోంది. పరిచయాలైం తరువాత కన్యను కూడా మా వరసంలో సభ్యురాల్ని చేసుకోవాలని అర్థించింది విన్నీ. ఆమెకు క్వాలిఫికేషన్లుగా శరత్‌బాబు నవలలు చదివి చదివి ఏడుకుండల నీళ్లు, బండెడు పాద ధూళి శిరసున ధరించి భరిస్తున్నట్లుగాను, చిన్నప్పుడు స్కూల్లో చిన్న చిన్న నాటకాల్లో పెద్ద పెద్ద పాత్రలు ధరించినట్లుగాను చెప్పింది. ఇంక మాకే శంక కలుగలేదు. ఆమెకు శంఖ చక్రాంకితాలు వేసి, పేరు కన్నీగా మార్చి సంఘ సభ్యురాలిగా చేశాం.

"అయ్యా సున్నూ! మీరేదయినా పౌరాణికాలలో నుండి ఓ ఘట్టం తీసుకుని ఏక పాత్రాభినయం చేసి చూపండి. మన సంఘ సభ్యులకు గూడా నటన అంటే ఇలా ఉండాలి అని అర్థమవుతుంది" అన్నాడు జున్ను.

"అలాగే, మయసభలో దుర్యోధనుని ఏకపాత్రాభినయం చేసేదా."

"అది వద్దండీ బాబు! చూసీ చూసీ విసుగొచ్చేసింది. మరేదయినా కొత్తది విన్పించండి" అన్నాడు జున్ను.

"ముందది వినండి. నేనో కొత్త ప్రయోగం చేశాను. ఇది ఏ ఏకపాత్రభినయానికైనా పనికి వస్తుంది 'టాట ట ట్టీ ట ట్టా ట టా' అని సాగుతుంది. పాటలకు సినిమా సంగీత దర్శకులు ముందే రాగం కడ్తుంటారు చూశారూ, ఆ పద్ధతిలో ఇదో అపూర్వ ప్రయోగం! ఈ 'టా ట ట ట్టీ ట ట్టా ట టా' లు సంస్కృత సమాసాలతో దీర్ఘంగా సాగే ఏ వచనంతో నయినా పూరించవచ్చు. కాదంబరి వచనమో, మనుచరిత్రలో వేటవర్ణనో ఏదయినాసరే సందర్భానికి సరిపోవాలని ఏమీలేదు. ఏవయినా దీర్ఘంగా సాగే సంస్కృత సమాస వాక్యాలుండాలి. ప్రేక్షకులకు వాటినర్థంచేసుకునే ఓపికా, సామర్థ్యం ఉండదు కనుక నడిచిపోతుంది. ఇక వినండి" అని ఓ క్షణం అలుపు తీర్చుకుని చెప్పసాగాడు.

"టాట ట ట్టీ ట ట్టా ట టా, టాట టట్టీ ట ట్టా ట టా, టాట ట ట్టీ టట్టా ట టా, టాట టట్టీ టట్టాట టా. సైపజాల. టా ట ట ట్టీ ట ట్టాటటా, టాటటట్టీ టట్టాటటా, టాటటట్టీటట్టాటటా, టాటటట్టీటట్టాటటా, ఖండించెదంగాక! టా ట టట్టీ ట ట్టా ట టా, టా ట ట ట్టీ ట ట్టా ట టా, టా ట ట ట్టీ ట ట్టా ట టా. నిలు నిలు దురాత్మా! టా ట ట ట్టీ ట ట్టా ట టా, టా ట ట ట్టీ ట ట్టా ట టా, టా టట ట్టీ టట్టాట టా, ఆహా, హా హా! టా ట ట ట్టీ ట ట్టా ట టా, టా ట ట ట్టీ ట ట్టా ట టా, టా ట ట ట్టీ ట ట్టా ట ట్టా, టా ట ట ట్టీ ట ట్టా ట టా, ఏమి నీ కండ కావరము. టాటటట్టీ టట్టా ట టా, టా ట ట ట్టీ ట ట్టా ట టా, టా ట ట ట్టీ ట ట్టా ట టా. నీ రక్తము ద్రావెదగాక... ఇలా సాగుతుంది" అని అభినయించి చూపాడు.

"బాగుంది బాగుంది" అన్నాడు కన్ను.

"అక్కడక్కడ రెండు మూడు తెలుగు మాటలుండాలి. మరీ ప్రేక్షకులకు అర్థం కాకుండా పోకూడదు. రెండు మూడు తెలుగు మాటలుంటే ప్రేక్షకులు అర్థమయినట్లు తల ఊపుతుంటారు. అయితే భావ ప్రకటన, అభినయం ఉద్రేక పూర్వకంగా ఉండాలి. భాషదేముందండీ? అందరికీ అర్థమయి ఏడుస్తుందా పాడా! జనం అర్థం చేసుకునేది ఆవేశాన్ని, అభినయాన్నే గాని భాషను కాదు. అఫ్‌కోర్స్ తెలుగు మాటలు విషయాన్ని బట్టి మారుస్తుండాలనుకోండి. ఇక చూడండి ఏకపాత్రాభినయం బ్రహ్మాండంగా రక్తి కడుతుంది. జనం చప్పట్లతో హాలంతా మార్మోగి పోతుంది" అని తన అద్వితీయ ప్రయోగాన్ని మాకు వివరించాడు సున్ను.

"ఓహ్! అద్భుత ప్రయోగం!" అన్నాడు కన్ను.

"నా మొహంలాగుంది" అన్నాను మా జున్ను చెవిలో.

"ముయ్యరా నోరు" అన్నాడు జున్ను మెల్లగా.

మిగతా వాళ్ళందరూ ఆయన అపూర్వ ప్రయోగానికి జోహారులర్పించారు.

"దీనివల్ల ఇంకో సౌలభ్యం ఉంది. ఇది రెడీమేడ్‌గా తయారయి ఉంటుంది కాబట్టి అప్పటికప్పుడు తెలుగుమాటలు మార్చుకోవటం ప్రదర్శించేయుటం. దీనికై రిహార్సల్సు వగైరా అవసరంలేదు. ఇంక, ఏమయినా ఏకపాత్రాభినయం చేసి చూపేదా?" అన్నాడు సున్ను ప్రసన్నంగా.

"వద్దులేండి అంతఃసూత్రం తెల్సిపోయిందిగా! బ్రహ్మాండమైన మీ ప్రయోగం చూసి వాళ్ళందరూ ఆనందంతో తలమునకలై పోయారు. ఆ సంతోషంలో నుండి తేరుకునేటట్టు లేరు" అన్నాను.

"ఏదో నట హృదయం ఉన్న మీలాంటి కొద్ది మంది మాత్రం మెచ్చుకుంటారు. ఏదీ, ఈ లోకంలో ప్రతిభకు గుర్తింపు లేదండీ" అన్నాడు సున్ను వినయ వినమితోత్తమాంగుడై.

"బాగుంది. ఇహ సాంఘిక నాటకంలో నుండి చిన్న ఘట్టాన్ని అభినయించి చూపండి" అన్నాడు జున్ను.

"సాంఘిక నాటకంలో ఘట్టమంటే కనీసం ఇంకో పాత్ర ఉండాలండీ. ఇదీ ఏక పాత్రాభినయం చేస్తే మీకు నచ్చదు. పౌరాణిక నాటకాల్లో సంస్కృత సమాస భాష భావాన్ని పూరించినట్టు. ఇక్కడ కుదరదు కదండీ" అన్నాడు సున్ను.

"ఆ ఇంకో పాత్ర నేను వేస్తాను" అంది కన్నీ.

"బాగుంది సంతోషం. ఓ గయ్యాళి భార్య, నెమ్మదైన భర్త మధ్య జరిగే సంభాషణ. మీ డైలాగ్ మీరే తయారు చేసుకోవాలి" అన్నాడు సున్ను.

"సై అంటే సై" అంది కన్నీ.

"మరి మొదలెట్టండి" అన్నాడు సున్ను.

(గదిలో ఓ మూలనుండి రంగప్రవేశం చేసింది కన్నీ)

**భార్య:** ఏవండీ ఎక్కడ చచ్చారండీ! మీ మొహం పాడుగాను! ఎప్పుడూ కొంపలో తగలడరేమండీ!

**భర్త:** అబ్బ! ఇక్కడే చచ్చానే, బయట మా ఆఫీసు వాళ్ళున్నారు. మెల్లగా మాట్లాడు.

**భార్య:** ఏం వాళ్ళకు భార్యలు లేరా? కాపరాలు చేసుకోవటంలేదా?

**భర్త:** భార్యలూ ఉన్నారు, కాపురాలూ చేసుకుంటూనే ఉన్నారు. కానీ నీలాంటి భార్యతో కాపురం చేసే వాళ్ళులేరు.

**భార్య:** అది అందరికీ వస్తుందా? మా అమ్మ, అమ్మమ్మ, వాళ్ళ అమ్మ ఇలా తరతరాల నుండి మాది పతివ్రతల వంశమండీ! నిద్రలేచి భర్త పాదధూళి స్వీకరించందే మిగతా పనులేవీ చేసుకొనేవాళ్ళు కారు మా వాళ్ళెవరూ.

**భర్త:** అందుకనే మీ నాయన, మీ తాత, ముత్తాత తొందరగా కూకారు. నేనూ ఎప్పుడో తగలడవలసింది. మీ వాళ్ళందరి పాతివ్రత్య మహిమా నిన్నే ఆవహించినట్టుంది. బతకలేకా, చావలేకా త్రిశంకుడి స్వర్గంలో పడి ఛస్తున్నాను.

భార్య: మీ నోటికి సుద్దీ బుద్దీ లేకుండా పోతున్నదండీ. మీరు చావటమేమిటి? ఆ యమధర్మరాజు వస్తే మెడపెట్టి గెంటేయనూ!

భర్త: అమ్మమ్మా! అంత మాటనకు. బుద్ధుంటే నిన్ను పెళ్ళి చేసుకునుండే వాడినా?

భార్య: అయ్యో, అయ్యో. ఎంతలేసి మాటలంటున్నారు! మీకు బుద్ధిలేదని నేనన్నానా? అయ్య నాయనోయ్! ఈ మొగుడితో ఎలా వేగనురా భగవంతుడా! అమ్మా! నన్నీయనకిచ్చి నా గొంతు కోశావుకదే. భర్తలకు బుద్ధిలేదనే వంశమా మంది! ఈ గయ్యాళి మనిషి కంట గట్టకపోతే పుట్టగానే గొంతు పిసికేస్తే పోయేదిగదా! బుద్ధిలేకుండా ఎలా వాగుతున్నాడో ఈయన! వీళ్ళ వంశమే ఇట్టాంటి పాడువంశం. ఈయన తండ్రి పెళ్ళాన్ని రాచి రంపాన పెట్టి చంపాడు. తాత వట్టి ముండల ముఠాకోరు. నేను రాబట్టి కదా ఇవాళ్టికీ కొంప ఉద్ధరింపబడింది. అయ్యో, తల్లీ, అమ్మా..." (అంటూ గుండెలు బాదుకుని బక్కెటు కన్నీళ్ళు కార్చేసింది కన్నీ.)

అలా ఓ చిన్న ఘట్టం అభినయించారు సున్ను, కన్నీలు.

"ఓహ్! అద్భుతం ఫాంటాస్టిక్! చాలా బాగా చేశారు. మీకు నటిగా పైకి వచ్చే లక్షణా లున్నాయి" అని పొగిడేశాడు సున్ను కన్నీని.

"నాకు తెలుసండీ, నేను బాగా చేస్తానని సదవకాశం రాకా, చిన్న పిల్లడితో కుదరకా ఇలా ఉన్నాగానీ. లేకపోతే నటిగా మంచి పేరు తెచ్చుకుని ఉండేదాన్ని కాదుటండీ! అయినా మీబోటి పెద్దలు బాగా చేశావు అన్న తరువాత నిజంగా అది సర్టిఫికెట్టే" అందికన్నీ.

"ఓసారి టి.వి. స్టేషనుకు రండి. మీకేమన్నా అవకాశం దొరుకుతుందేమో చూద్దాం" అన్నాడు సున్ను.

"అలాగే. థ్యాంక్స్" అంది కన్నీ.

మా వాళ్ళందరికీ కూడా ఈ ఘట్టం బాగా నచ్చింది మానవ హృదయ సున్నితత్వాన్ని మెరుగుపర్చే మేధావిగా సున్ను ఎక్స్‌పెరిమెంటు కంటే ఇది వాళ్ళకు బాగనిపించింది. చప్పట్లు చరిచి మా అభినందనలు తెలిపాం.

"ఇప్పుడు నేను రెండు విషయాలు మీకు ప్రత్యక్షంగా ఋజువు పర్చాను. ఒకటి నాటకకర్త అవసరం లేదు. నటుడెవడైనా ఆమాత్రం నాటకం అల్లగలడని. నేను కన్నీకి ఏమని చెప్పాను. ఓ గయ్యాళి భార్య, నెమ్మదైన భర్త మధ్య జరిగే సంభాషణ అని. ఆమె నటి. నట హృదయం ఉన్న మనిషి కాబట్టి ఆ పాత్రల సంభాషణ ఇట్టే అల్లేయ కలిగింది. సరే, నా కయితే కొట్టిన పిండే ననుకోండి. నాటకకర్త పెద్ద చేయగలిగిందేం లేదు. కనుక నటుడు ముఖ్యం, నాటక కర్త కాదు. రెండోది - స్టాక్ కారెక్టర్స్ అని ఇంతకు ముందు మీరు విమర్శించారు. స్టాక్ కారెక్టర్స్ ఉండబట్టేగదా నాటకం ఇంత సులువైంది. అందువల్ల స్టాక్ కారెక్టర్స్‌ని విమర్శించాల్సిన పనిలేదు. ఇట్స్ ద స్టాక్ కారెక్టర్స్ దట్ ద పబ్లిక్ లైక్స్" అని సిద్ధాంతీకరించాడు సున్ను.

"పబ్లిక్ సంగతి వదిలేయండి మరి మేధావి వర్గానికి మీరెలా నచ్చ చెప్తారు?" అని అడిగాను.

"ఈ మేతావులు వ్యక్తులండీ. నాలుగు మేతావుల్ని ఓచోట కట్టేస్తే కొట్టుకు ఛస్తారు. వాళ్ళకు కలెక్టివ్ ఇంటరెస్టులు లేవు. యునీడెంట్ కాటర్ టు దైర్ నీడ్స్."

"మేధావులకు నచ్చినదే ఉత్తమ కళ కదా!" అన్నాను.

"మళ్ళీ అదే మాట- ఈ మేతావులకు ఏం నచ్చుతుందో వాళ్ళకే తెలీదు. ఒకాయనకు నచ్చింది, ఇంకో ఆయనకు నచ్చదు. వాళ్ళది అల్ప సంఖ్యాక వర్గం. వాళ్ళ జోలికి పోకపోతే మంచిది" అన్నాడు సున్నూ.

"అలా అనుకున్నట్లయితే మనమింత నాగరికత, సంస్కృతి సాధించే వాళ్ళం కాదు" అన్నాను.

"ఏం మనిషండీ ఈయన...!" అన్నాడు సున్నూ.

"ఒరే నువ్వూర్కోరా! వాడంతేనండీ. ఓసారి చెబితే అర్థం చేసుకోడు" అన్నాడు జున్నూ.

"ఇంకో విషయం చెప్పండి, కళ వాస్తవికతను ప్రతిబింబించాలా అక్కరలేదా?" అన్నాను.

"దాంట్లో సందేహమెందుకు!" అన్నాడు సున్నూ.

"మరి మన సినిమాల్లో - నాటకాల్లో మరీ అంత దౌర్జన్యం లేదనుకోండి - బడుగు గుమస్తా కూతురు హీరోయిన్ అయితే ఆమె కట్టే చీరలు చాలా ఖరీదైనవి. నాయకి ఇల్లు కాబట్టి ఇల్లు కూడా చాలా ఖరీదైందిగా ఆ సెట్టింగులు బట్టి మనకు కన్పిస్తుంది. మీరు టి.వి.ల్లోనూ అలానే చూపిస్తున్నారు. పని మనిషి కట్టే చీరెలు, ఇంటి యజమానురాలు కట్టే చీరలు ఒకటిగానే ఉంటున్నాయి. ఇదంతా వాస్తవికతను ప్రతిబింబించటమేనా?" అడిగాను.

"మరి హీరోయిన్ ఇల్లు దరిద్రంగా ఉంటే మనం చూడలేం కదండీ! పైగా హీరోయిన్లు ఫేషన్లు నేర్పాలి, రకరకాల చీరెలు రకరకాల పద్ధతుల్లో కట్టుకోవాలి. ఇట్స్ దే హు హేవ్ టు ఇన్‌కల్ కేట్ టేస్ట్ ఇన్ పబ్లిక్. అంత బాధ్యత నెత్తిన పెట్టుకుని, వాస్తవికత అంటే కుదురుతుందా? అయినా వాస్తవికత అంటే మనం సృజించేదేమిటి? ఇట్స్ ద సెన్స్ ఆఫ్ రియాలిటీ. నాట్ ద రియాలిటీ; ఇట్స్ నెవర్ పాజిబుల్ టు క్రియేట్ రియాలిటీ బట్ ద సెన్స్ ఆఫిట్. సెన్స్ ఆఫ్ రియాలిటీ ఈజ్ రియలిజం" అని టూకీగా వివరించాడు సున్నూ చాలా సహనంతో.

"బాగుందండి మీ వివరణ" అని మెచ్చుకున్నారు బన్నూ.

"నేననేది అదే. వాస్తవికత అంటే వాస్తవికతా భ్రమే. కానీ ఆ భ్రమను కూడా కల్పించలేక పోతున్నారే సినిమాల్లో."

"నేన్చెప్పలేదటండీ మీకు నట హృదయం లేదు. మీ కర్థంకాదు. ఇంక గప్‌చిప్‌న ఊర్కోండి" అన్నాడు సున్నూ, తను అంగీకరించనిష్టం చూపని దాన్ని కోపంతో పూరిస్తూ.

"కన్నీ! మీరు కూడా మీ అభిప్రాయాలు చెప్పండి. పౌరాణిక, సాంఘిక నాటకాల గురించి" అన్నాడు జున్ను దారి మళ్ళిస్తూ.

"పౌరాణికాలు నా వంటికి పడవండీ. ఎంతసేపు రాముడు, కృష్ణుడు, రావణాసురుడు, దుర్యోధనుడు - జీసస్‌లాంటి దేవ పుత్రుడి గురించి ఒక్క పౌరాణిక నాటకముందా? అందుకనే అవంటే నాకు పడవు. ఆఁ, సాంఘికాలన్నారు అవి నాటకాలు, నాటికలు" అంది ఆమె.

"పోనీ సాంఘిక నాటకాల గూర్చి మీ అభిప్రాయాలు సెలవివ్వండి" అడిగాడు జున్ను.

"స్త్రీకి ప్రాధాన్యత ఇచ్చే పాత్రలంటే నాకిష్టమండీ. ఇప్పుడు మరీపోయే కాలమొచ్చింది. 'ఆడది' అని పేరుబెట్టి స్త్రీ పాత్రలు లేకుండా నాటకాలు, నాటికలు రాసేస్తున్నారు. అంతకంటే సినిమాలే నయం. ప్రతి సినిమాలోను ఒక్క హీరోయిన్ అయినా ఉంటుంది" అంది కన్నీ.

"స్త్రీ పాత్రలు ధరించే వాళ్ళు లేక అలా నాటకాలు వస్తున్నాయి. నాటక కర్తలను మీరు తప్పు పట్టగూడదు అందుకు" అన్నాడు జున్ను.

"స్త్రీ పురుషులు కలిస్తే జీవితం. స్త్రీ పాత్ర లేని నాటకం అసంపూర్ణం. స్త్రీలను ప్రోత్సహించి నాటకాల్లో పాల్గొనేటట్లు చేయాలిగాని, స్త్రీలు లేకుండా నాటకాలు రాయ కూడదు" అంది కన్నీ.

"మరి మీ లాంటి వాళ్ళు నడుం కడ్తే స్త్రీ పాత్రలున్న నాటకాలే వస్తాయి" అన్నాడు జున్ను.

"నాటకంలో స్త్రీ పాత్రలుండాలి. పతివ్రతల పాత్రలు, గయ్యాళి భార్య పాత్రలు అంటే నాకిష్టం. వాటిని నటించడంలో నటి నటనా వైదుష్యం వెల్లడవుతుంది. వీలుకాదుగాని నాటకాల్లో, సినిమాల్లో లాగా రేప్ సీన్లున్నా బాగా ఉంటుంది. దీనివల్ల స్త్రీ సమాజంలో ఎలా దోచుకోబడుతుందో అర్థమవుతుంది జనానికి" అంది కన్నీ.

"ఇది దుర్మార్గం. సినిమాల్లోనే సెక్స్, వయలెన్స్ తొలగించాల్సిన అవసరముండగా, వాటిని నాటకాల్లో కూడా ప్రవేశపెట్టమనటం అన్యాయం" అన్నాడు బన్ను.

"మీరలా పక్షపాతంగా మాట్లాడకండి. మీ నవలలు చదివాను. మీ నవలల్లో సెక్స్, వయొలెన్స్ లేవా? నవలల్లో పనికి వచ్చేవి నాటకాల్లో, సినిమాల్లో ఎందుకు పనికిరావు? జీవితంలో సెక్స్, వయలెన్స్ లేవా? ఉన్నాయి. వీటికి ప్రతిబింబంగానే నవలలొస్తున్నాయి, సినిమాలొస్తున్నాయి. నాటకంలో కూడా ఉంటే ప్రమాదమేముంది? అవి కూడా జీవితానికి ప్రతికృతిగా ఉండాలి కదా!" అంది కన్నీ.

"కన్నీది వాస్తవికతా దృష్టి. ఆమె వాదనలో నిజముంది" అన్నాడు హన్ను.

"సినిమాల్లో డ్యూయెట్లు ఉన్నట్టే. నాటకాల్లోనూ డ్యూయెట్లు ప్రవేశపెట్టాలి. పాడగలిగే వాళ్ళు ఆ పాత్రలు వేయాలి" అంది కన్నీ.

"జీవితంలో ఓ స్త్రీ, పురుషుడు ప్రేమించుకున్నారంటే వాళ్ళు డ్యూయెట్లు పాడుకుంటూ బతుకుతున్నారా? లేదే. సినిమాల్లోనే పాటలు పెట్టటం జీవితానుకరణ కాదనుకుంటే వాటిని నాటకాల్లోకూడా ఇంట్రడ్యూస్ చెయ్యాల్సిన అవసరంలేదు" అన్నాను నేను.

"మీకు నాటకాల గురించి తెలీదు. పెట్టాలి. నాటకం కూడా ఒక ఇండస్ట్రీలాగా పెరుగుతుంది. దర్శకుడొక్కడే చాలడు అప్పుడు. సంగీత దర్శకుడు కావాలి..."

"స్టెప్పులేయించటానికి డ్రిల్లు మాష్టరు కావాలి" అంది విన్నీ కన్నీ మాటల్ని తుంచేస్తూ.

"అప్పుడు అందరూ కావాలి. సంగీత సాహిత్యాలతో, నృత్యంతో నాటకం సర్వాంగీణ సౌందర్యం పొందుతుంది అప్పుడు" అంది కన్నీ.

"కన్నీ అలోచన విప్లవాత్మకమైన ఆలోచన. సినిమాల్లో పాటలు పెట్టడమన్నది ఎక్స్ప్రెషనిజం. పాత్ర ఆనందాన్ని కాని, విషాదాన్నిగాని కొట్టొచ్చే విధంగా ఎక్స్ప్రెస్ చేస్తాయి పాటలు. దీసీజ రివోల్ట్ అగెనెస్ట్ ద డల్ డ్రయరీ రియలిజం" అన్నాడు సున్ను.

"అవునులేండి. సినిమా అంటే అందర్నీ అలరించేటట్లుగా ఉండాలి కదా! కొంత రొమాంటిక్ ఎలిమెంట్ ఉండాలి, హ్యూమర్ ఉండాలి, మీరన్నట్లు ఎక్స్ప్రెషనిస్టిక్ ఎలిమెంట్ ఉండాలి..."

"వీటన్నిటినీ చిరుగుల వాస్తవికతా వస్త్రం కప్పుతుండాలి" అన్నాను జున్ను మాటల్ని తుంచేస్తూ.

"ఇదేం తత్వమయ్యా, నీవు ఎపుడూ మాటల కడ్డమొస్తుంటావు" అన్నాడు బన్ను.

"ఆయన తత్వమే అంతండీ! మా కిరాయి వాసుల సమావేశాల్లో కూడా అలాగే మాట్లాడుతుంటాడాయన" అంది కన్నీ.

"బాగుందే! మాట్లాడటం కూడా తప్పేనా?" అంది విన్నీ.

"ఎవరి తత్వాలు వాళ్ళవి, కొంతమంది ఒకే ఇదిగా మాట్లాడుతుంటారు, కొంతమంది మాటల కడ్డమొస్తుంటారు, కొంతమంది తమ మాటలకు వ్యతిరేకంగా పలికారని ఏడుస్తుంటారు. పుర్రెతో పుట్టిన బుద్ధి పుడకలతో గాని పోదని సామెత" అన్నాను.

"చూశారా నేనేడుస్తున్నానంట..." అంది కన్నీ.

"నేనింత మంది సంగతి మాట్లాడితే, చూశారా! మీక్కావాల్సింది మీరెన్నుకున్నారు" అన్నాను.

అంతే రక్కున ఓటికుండ పగిలింది. బోరుబోరున కన్నీళ్ళు కార్చేసింది కన్నీ. దాంతో మా మగ సభ్యుల గుండెలు కరిగిపోయాయి.

"అదేంటయ్యా! ఆడ కూతురితో అలాగేనా మాట్లాడేది?" అన్నాడు కన్ను.

"అందర్నీ నొప్పించేట్టు మాట్లాడటం ఆయన గొప్పనుకుంటాడు" అన్నాడు బన్ను.

"అమ్మాయి! నువ్వు నాటకాలకు బాగా పనికి వస్తావు. అలా క్షణంలో కన్నీళ్ళు తెప్పిం చటం సాధ్యమయిన విషయంగాదు. ఇదివరకు కన్నాంబ గ్లిజరిన్ లేకుండానే కన్నీళ్ళు తెప్పించేదని ప్రసిద్ధి. నువ్వు ఆమెను మించిపోయావు" అన్నాడు సున్ను.

ఆ మాటలతో కన్నీరు కానకట్ట పడింది. తలెత్తి ఆయన వంక ఆనందంగా చూసింది, నవ్వులు చిలకరించింది.

"అవును కన్నీ! మీరు మంచి ఆక్ట్రెస్" అని నేనూ ఒప్పుకున్నా.

అలా అవాల్టి వరసం మాసికం ముగిసింది.

'నెలవంక' సాహిత్య వార్షిక సంచిక, 1997-98

## -5-

ఆ నెల్లో 'వరసం' మాసికం మా ఇంట్లో పెట్టాలని క్రిందటి సమావేశంలో నిర్ణయించటం వల్ల, రాబోయే సభ్యుల కోసం ఎదురుచూస్తూ, మా కాలేజీ మాగజైనుకు ఓ 'కథో-కాకరకాయో', 'కవితో- గివితో' గిలుకుదామని కాయితాల్తో కుస్తీపడుతున్న సమయంలో విన్నీ అవతరించింది.

"ఏమిటో ఘోరంగా రాసేస్తున్నారు?" అనడిగింది సోఫాలో సెటిలవుతూ.

"మా కాలేజీ మాగజైన్‌కు ఏదైనా ఆర్టికల్ రాద్దామని ప్రయత్నం చేస్తున్నానండీ" అని సమాధాన మిచ్చాను. ఏదైనా 'కవిత'రాసే ప్రయత్నంలో ఉన్నానని చెప్పలేదు. ఎందుకంటే కవులందరికీ తాము రాసేదే గొప్ప కవిత్వమనీ, ఇంకెవరు రాసినా అది చచ్చు కవిత్వమనీ అనుకోటం సర్వసాధారణం కనుక. నిజానికి నాకూ అలాగే అన్పిస్తుంది. నేను రాయనిదైనా నా కవిత్వమే గొప్పది.

"మీ కాలేజీ మాగజైను పేరు 'నెలవంక' కదా! ఆ 'నెలవంక'మీదే ఓ కవిత చెప్తాను వింటారా?" అందామె. ఆమె మర్యాదస్థురాలు కనుక "వింటారా" అని నా పర్మిషన్ అడిగింది గానీ, సాధారణంగా కవులెవరూ అలా అడగరు: "వినండి" అంటారు.

తప్పేదేం లేదు కనుక, "సరే కానీండి" అన్నాను. అసుఖదమైన పనిని త్వరగా ముగించేస్తే మంచిదనిపించింది నాకు.

ఆమె కవితాగానం ప్రారంభించింది.

### నెలవంక

"రావోయి నెలవంక!
నా స్వర్ణలంక!
వంక కలదు నీలోనని
వలవంతలేలనోయి

వంకలేని వాడెవడోయి
వగపులెందుకోయి

రావోయి నెలవంక

వైవిధ్యమీ భువిని
వన్నెలు చిందించుననే
పరబ్రహ్మ సృష్టిలోని
పరమార్థమ్మెరిగినప్పుడు
ఒప్పులకు తప్పులకు
తారతమ్యమేమి కలదు

రావోయి నెలవంక

సెలయేరుల జాలువారు
కలగీతికి మధురంగా
నాట్యమాడే వనమయూరికి
కలకూజితముందా!
తలిరాకుల జొంపములో
కలకూజిత మొలకించే
కోకిలమ్మ మేనికాంతికి
విలువేమైనా ఉందా?

రావోయి నెలవంక

పై మెరుగుల భ్రమలోపడి
బాధచెందనేలనోయి
అస్తి నాస్తి విచికిత్స
ఆత్మననుసరించునోయ్.
ఆత్మసౌందర్యమ్ముకన్న
సమున్నతమైనదేది?
అంతర్యమ్మిది ఎరుంగము
ఆహ్వానమ్ముందుకొమ్ము!

రావోయి నెలవంక

కవిత అయిపోయింది. ఇహ నా బాధ్యత నిర్వహించక తప్పదు. "ఫాంటాస్టిక్. అద్భుతం. నభూతో నభవిష్యతి అన్నట్లు కవిత్వం చెప్పారు" అన్నాను.

కవులు ఇలా ప్రశంసలు మేసే జీవనం వెళ్ళదీస్తారని తెల్సినా, గత్యంతరంలేక ఆమె కవితను మెచ్చుకోవాల్సి వచ్చింది. పొరుగు పొలాల్లో ప్రశంసల గ్రాసం మేసి బలిసే కవితామృగం చెంగున మరోసారి గొంతెత్తుతుంది. నా మెచ్చుకోలు విన్న ఆమె మర్యాదా మన్ననలు, అభ్యర్థనలు మానేసి "మరో కవిత రాశాను ఇంగ్లీషులో. వినండి" అంటూ తన

ఉద్గ్రంథం తెరిచింది. "కాప్షన్ ఆఫ్ద ఇంగ్లీష్ పోయమ్ ఈజ్ ద హెన్‌పెక్డ్" అని చదవటం మొదలెట్టింది.

## The Hen-pecked

Come Sir, be thou the judge
Life, my wife, said;
I flirted with her
I dallied with her
I conquetted with her
And I had no love for her.
I said to her.
You are mine
I do what I like
Bravo...bravo,
she laughed in her sleeves,
Poor man! I pity you
She complained further
I desecrated her
I despoiled her
I whored her
I said to her
You are mine
I do what I like
She shrugged her contemptuous shoulders
What education!
See, how foolish these Women are!
I told her
She was ungrateful
She was sterile
She was barren
She replied, Sir,
My seeds were impotent
My wits were low
I made her barren!
No...Dont pronounce the judgement!
What?...Decree for separation?
No, no, I compromise

**I shall make up with her**
**I don't mind**
**Let them call me hen-pecked**
**I cling to her**
**My wife, my life!**

ఆమె కవిత పూర్తిచేసింది. నేను చప్పట్లు చరిచాను మెచ్చుకోలుగా. చేతులేకాక నోరుకూడా ఆడించకపోతే మర్యాదగా ఉండదని (ఆమె చిన్నబుచ్చుకుంటుందని) "బాగుంది... బాగుంది... అద్భుతంగా ఉంది. 'జీవితమే భార్య అంది. నిర్భాగ్యుడు ఆమెతో ఆటలాడ చూశాడు. దేవుడు పదనివాళ్ళకు విడాకులిప్పిద్దామనుకున్నాడు. జీవితంలో విడాకులు పొంది మనలేడు కదా మానవుడు. రాజీపడ్డాడు - ఎవరేమనుకుంటే నాకేం సిగ్గు-సతీవ్రతుడనుకోనివ్వండి. జోరుకా గులాం అనుకోనివ్వండి. ఏమయినా ఆమెనుండి విడిపోలేదు' - అద్భుతం. చక్కటి మోనోలోగ్ చెప్పారు" అన్నాను.

అంతలో బన్ను, కన్ను, సున్ను వచ్చారు. దాంతో ఆమె కవితాకన్య బారినుండి తప్పించుకున్నాను. బన్నూ చాలా ఉత్సాహంగా ఉన్నాడు. సోఫాలో కూర్చుంటూనే చెప్పాడు. "మన మిత్రులందరికీ ఓ శుభవార్త. నేనో 'సచిత్ర వారపత్రిక' నడపబోతున్నాను. దానికి మనవాళ్ళంతా అన్ని విధాలా సాయం చెయ్యాలని ప్రార్థిస్తున్నాను". అని

"దానికేం. తమరు పత్రిక ప్రారంభించటమూ, మేం ఇతోధిక సాయం చెయ్యక పోవటమూనా?" అన్నాడు కన్ను, అప్పుడే పత్రిక సంపాదకుడికి కాకాపద్తూ.

"కొత్త పత్రికా?" అనడిగాడు సున్ను.

"లేదండీ. 'తెలుగువెలుగు' దినపత్రిక లేదూ? దానికి అనుబంధంగా వారపత్రిక నొకదాన్ని తీసుకురావాలని ఆలోచిస్తున్నారు. దినపత్రిక యజమాని నా మిత్రుడే. చిన్నప్పటి క్లాసుమేటు. నన్నే వారపత్రికకు సంపాదకుడుగా ఉండమంటున్నాడు మావాడు. నేను 'ఇంకెవరినయినా పెట్టుకోరా' అని అన్నాను. 'కాదు కూడదూ, నీలాంటివాడు నావాడుండగా మరొకణ్ణి వెతుక్కోవాల్సిన ఖర్మ నాకేంటి?' అని పట్టుబడుతున్నాడు. 'సరే, చూద్దాంలే' అన్నా."

ఇలా మేమంతా బన్ను వారపత్రికకు సంపాదకుడయ్యాడన్న ఆనందంలో ఉండగా జున్ను, హన్ను, కన్నీ ఒకళ్ళ తర్వాత మరొకళ్ళు వచ్చారు. హన్నుతోపాటు తిరపతిరావన్న వ్యక్తికూడా వచ్చాడు. అతను గొప్ప అనువాదకుడట. హన్ను సిఫారసుతో అతన్ని కూడా సంఘంలో సభ్యుడుగా చేర్చుకున్నాం. 'తన్ను' అన్న పేరు పెట్టాం.

బన్నూ మళ్ళీవాళ్ళకు శుభవార్త చెప్పిం తర్వాత కన్నీ అడిగింది. "పత్రికకు ఏం పేరు పెడ్తున్నారండీ?" అని.

"ఇంకా నిర్ణయించలేదండీ" అన్నాడు బన్ను.

"ఇవ్వాళ వచ్చే పత్రికల్లా కాకుండా, మీ పత్రిక సర్వాంగసుందరంగా ఉండాలి. ఉన్నతమైన ఆదర్శాలలో నడవాలి. సంపాదకుడిగా - అందులోను స్థాపక సంపాదకుడిగా

మీరు చాలా శ్రమించాల్సి ఉంటుంది. జనాకర్షణీయంగా పత్రికను మలచాలి. సర్క్యులేషను పెంచాలి. పత్రికకొక సుస్థిరత కల్పించాలి. ఎలా పత్రిక నడపాలనుకుంటున్నారు?" అనడిగాడు సున్ను.

"అఫ్‌కోర్స్ బాధ్యత బరువైనదేననుకోండి. మొదట్లో కొంత నిరుత్సాహంగా ఉన్నా, కొద్దికాలంలోనే లీడింగ్ వీక్లీగా పేరుతెచ్చుకుంటుందని నా ఉద్దేశ్యం."

"కానీ, టి.విలు - కేబుల్ టి.వి.లు రాజ్యమేలే ఈ కాలంలో వారపత్రికలు మనుగడ సాగించడం కష్టమవుతోంది. దినపత్రికలే దినదిన గండం నూరేళ్ళాయుష్షులా బతుకుతున్న రోజుల్లో వారపత్రిక బతుకు మఖలో పుట్టి పుబ్బలో గిట్టిన చందమవుతోంది. ఈ విషయం మీరు దృష్టిలో పెట్టుకుని పత్రిక నడపాల్సి ఉంటుంది" అన్నాను.

"శకునిలా అలా నిరుత్సాహపర్చకండి. టి.విలు చూసే జనం పత్రికలు చదవరా?" అంది కన్నీ.

"జనంలో పఠనాసక్తి పోయింది. చదవటం శ్రమ. చూడటం తేలిక. తేలికయిన జీవితవిధానానికి జనం అలవాటుపడ్డున్నారు అని చెప్పటమే నా ఉద్దేశం కానీ, నిరుత్సాహపర్చటం కాదు" అన్నాను.

"నువ్వు చదవటం మానేసి మొహం టి.వికి అంటించుకున్నావని చెప్పి జనమంతా అంతే అనుకుంటున్నావా? చదివే వాళ్ళూ ఉన్నారు. పాఠక మహాశయులనలా కించపర్చకూడదు" అన్నాడు బన్ను. అప్పుడే సంపాదకుడై, ఉజ్జ్వలంగా పత్రిక నడుపుతున్న కలల్లో ఉన్నాడు బన్ను.

"పోన్లెండి. ఆయన మాటలకేం గానీ, మీరు పత్రికనెలా నడపాలనుకుంటున్నారో చెప్పండి" అంది కన్నీ.

"పత్రిక చక్కగా రన్ అయేందుకు నేను కొన్ని చిట్కాలు ఆలోచించాను. శీర్షికలు ఆకర్షణీయంగా ఉండాలి. మాహాత్మ్యమంతా పేరు పెట్టటంలో ఉంది. డెబ్భై రెండు పేజీల పత్రిక ఉంటే ఓ నలభై పేజీలయినా సీరియల్స్‌కు కేటాయించాలి. నాలుగైదు సీరియల్స్‌తో నయినా పత్రిక నడిపితే, ఒకసారి పత్రిక కొన్నవాడు మరుసటివారం చచ్చినట్టు కొనాల్సిందే. ఆ సీరియల్స్ కూడా ఉత్కంఠ - మనం సస్పెన్స్ అంటామే అది కల్గించే విధంగా ఉండాలి. ఈ వారం మంచి సస్పెన్స్ కలిగించే తరుణంలో సీరియల్ ఆపేస్తాం. తరువాత ఏమవుతుందో, మన హీరో, హీరోయిన్ బతుకుతారో, చస్తారో నన్న ఉత్కంఠతో వచ్చేవారం వరకూ పాఠకుడు చచ్చిపోవాలి. అలాంటి సీరియల్స్ ఎన్నుకోవాలి" అన్నాడు బన్ను.

"అబ్బా! బన్నూ! నా అనుభవాన్ని ఎంత చక్కగా చెప్పారండీ. పత్రికలవాళ్ళు మంచి ఘట్టంలో ఠక్కున 'ఇంకా ఉంది' అని ఆపేస్తున్నారు. మరుసటి వారం దాకా నిరీక్షించ లేక నా ప్రాణం కడగట్టిపోతుంది అనుకోండి. ఎంత యాతన అనుభవిస్తున్నానో మీరూహించ లేరు" అంది కన్నీ.

"కాని ఎంత అవాస్తవికత? జీవితం అంత సస్పెన్స్ మయమా?" అన్నాడు జున్ను.

"జీవితం న్యూస్‌పేపర్ బ్రదర్! థ్రిల్‌లేదు. కాని నవల కూడా అలా ఉంటే నవల లెవరూ చదవరు" అన్నాడు బన్ను.

"అలాంటి నవలలు చదవకపోయినా ఇబ్బందిలేదుగాని, మీరు సాహిత్యాన్ని తప్పు దోవ పట్టిస్తున్నారు. జీవితాన్నుండి పలాయనం చిత్రగిస్తున్నారు" అన్నాడు జున్ను.

"సంప్రదాయం నీచేత అలా మాట్లాడిస్తోంది. ఇది ఆధునిక ధోరణి. అందుకనే ఈ ప్రక్రియకు 'నవల' అనే పాత చింతకాయ పచ్చడి పేరుపోయి 'థ్రిల్లర్' అని పిలుస్తు న్నారు" అన్నాడు బన్ను.

"మరీ 'థ్రిల్లర్' ఆంగ్లవాసన వేస్తూందండి. ఆధునిక తెలుగు నవలకు 'రోమాంచిత' అని పేరు పెట్టటం బావుంటుందని నేను భావిస్తున్నాను" అన్నాడు తన్ను.

"ఆహాహా బావుంది. తన్ను చక్కటి నామకరణ చేశారు ఆధునిక నవలకు" అన్నాడు బన్ను ఆనందపరవశుడై.

" 'పులకాంకిత' అంటే ఎలా ఉంటుందంటారు?" అడిగింది కన్నీ వేరే పేరు సూచిస్తూ.

" 'పులకాంకిత' కంటే 'రోమాంచిత' " అనే పిలవండి. మీసాలొచ్చిన ఆడదాన్ని గుర్తు చేసేట్టు ఆధునిక నవలను 'రోమాంచిత' అంటేనే బావుంటుంది" అన్నాను నేను.

"అయనవన్నీ పాతభావాలు లేండి. మీ పత్రికల్లో సీరియల్స్‌కి 'రోమాంచిత'లో 'పుల కాంకిత'లో అని పేరు పెట్టండి" అంది కన్నీ.

"తన్నులాంటి ఉద్దండ అనువాదకుడు సూచించిన తర్వాత వేరే పేరెందుకండీ? 'రోమాంచిత' అనే పేరు పెడ్తాను. ఇంత మంచిపేరు సూచించిన తన్నూకు నా కృతజ్ఞ తలు."

"ఈ 'రోమాంచిత'కు ముచ్చటగా మూడే ఆభరణాలు - క్రైమ్, సెక్స్ అండ్ వయెలెన్స్" అన్నాడు సున్ను.

"అవును. ఇనుప గొలుసులు!" అన్నాను నేను.

"కొంతమంది మనుషుల్ని మార్చటం దుష్కరం. ఆ ఏసుప్రభువే వాళ్ళని కాపాడాలి" అంది కన్నీ.

"అదే మాటండీ. జీవితంలో లేవా-నేర, శృంగార, హింసా ప్రవృత్తులు? వాటినే ప్రతి బింబిస్తుంది సాహిత్యం" అన్నాడు కన్ను.

"ఉన్నాయి. లేదనటంలేదు. మరి వాటిని దేనికి వినియోగిస్తున్నారు? ఏ పాశవిక భావాల్ని రెచ్చగొట్టటానికి వినియోగిస్తున్నారు? జనాన్ని ఎటువైపు మళ్ళిస్తున్నారు? అన్నది ప్రశ్న. ఎక్సెప్షనల్ బిహేవియర్‌ని జనరలైజ్ చెయ్యాల్సిన అవసరం లేదు" అన్నాను నేను.

"ఎవరేమైనా తన్నుకు చావండిగాని, క్రైం, సెక్స్, వయొలెన్స్ లేకుండా 'రోమాంచిత' బతకలేదు. పాఠకలోకం సహర్షంగా వాటిని ఆమోదిస్తున్నది అనేది నిర్వివాదాంశం! సత్యం!

వారపత్రికల్లో ఎన్నుకునే సీరియల్స్‌లో ఆ ఎలిమెంట్స్ ఉండాల్సిందే" అని తీర్పిచ్చాడు బన్ను.

"ఇంకొక విషయం. ప్రస్తుతం పత్రికలు... ముఖ్యంగా వారపత్రిలు - కథానికా ప్రక్రియను చంపేస్తున్నాయి. డెబ్బయ్ రెండు పేజీల్లో - ఇప్పుడన్ని పేజీలు కూడా ఉండటం లేదనుకోండి. నలభై పేజీలు సీరియల్స్‌వే. అంటే మీరన్న 'రోమాంచిత'లకే కేటాయిస్తే సంపాదకీయాలకు, కార్టూన్లకు, సినిమా వార్తలకు కొన్ని పేజీలు పోతే, 'కథానిక'ల కసలు స్పేస్ ఉండటం లేదు. పెద్దపెద్ద పత్రికల్లోనూ ఒక్క మంచి కథానిక వేయటం గగనమయి పోతున్నది. మీరలా చేయకండి, బన్నూ!" అన్నాను నేను.

"ఆకాశం, గగనం, శూన్యం-శూన్యమవుతుందన రాదూ, పొన్నూ!" అన్నాడు జున్ను.

"అవును, ఆ ఆర్ట్ చచ్చిపోయే దశలో ఉంది దీని కంతటికీ కారణం పత్రికాధిపతులు. 'తమ పత్రిక సర్క్యులేషన్ పెంచుకోవాలి. లాభాలు గడించాలి' అన్న ఆలోచన తప్ప, సాహిత్యాన్ని గూర్చి ఆలోచన చేయకపోవటం వల్ల, ఈ పరిస్థితి వచ్చింది" అంది విన్నీ.

"లాభాల కోసం కాకపోతే ఊరిని ఉద్ధరించటానికా పత్రికలు నడిపేది! 'రోమాంచిత'లు విరివిగా ప్రచురించకపోతే మర్నాటికే ప్రెస్సు మూసుకుని ఇంటికి తిరుగుముఖం పట్టాలి పత్రికాధిపతులు" అన్నాడు బన్ను.

"మంచి వ్యాపారి అన్నవాడు లాభాలు గడించటమే కాక విక్రయించే వస్తువు కూడా సరైంది అందించాలి వినియోగదారులకు. లాభాలు గడించటమే ఆశయమయితే ఆ వ్యాపారం ఎక్కువకాలం నడవదు. జనం అంత గుడ్డివాళ్ళు అనుకోకండి" అంది విన్నీ.

"అయినా చిన్నకథలో ఏముంది కళ? అంత తక్కువ స్పేస్‌లో రచయిత చెప్పగలిగే దేమిటి?" అన్నాడు కన్ను.

"అలా అనకు కన్నూ! చిన్న కథే నవలకు మూలం. 'కథానిక'ను అందంగా తీర్చి దిద్దటానికీ, తక్కువ స్పేస్‌లో చెప్పటానికీ రచయితకు ఒడుపూ, నేర్పూ ఉండాలి. 'బ్రెవిటీ ఈజ్ ది సోల్ ఆఫ్ విట్' అన్నారు కదా!" అన్నాడు హన్ను.

"అందుకనే మినీ కథలు, మినీ కవితలు వస్తున్నాయి పత్రికల్లో" అన్నాడు బన్ను.

"దె హావ్ నోపర్పస్ బట్ ఏజ్ స్పేస్ ఫిల్లర్స్. ఓ పాత్ర చిత్రణకు, మనోవిశ్లేషణకు, లేక ఒక సంఘటన విపులీకరించటానికీ ఎందుకూ పనికిరావు మినీ కథలు. యుగెట స్లయిస్ ఆఫ్ లైఫ్ ఫ్రం ఎ షార్ట్‌స్టోరీ అండ్ దటీజ్ బీయింగ్ సిస్టమెటికల్లీ కిల్డ్" అన్నాను నేను.

"కథానికా ప్రక్రియను చంపాలని ఎవరూ పనిగట్టుకుని ప్రయత్నించటం లేదు. స్పేస్ ప్రాబ్లం..." అన్నాడు బన్ను.

"అందువల్లనే మొత్తం పత్రికనంతా 'రోమాంచిత'లతో నింపకుండా, ఒకటి రెండు తగ్గించి కథానికలు వేయాలని నా అభిప్రాయం. పత్రికాధిపతులకు, సంపాదకులకులకూ

కూడా సమాజంపట్ల కొంత బాధ్యత ఉంది. దె హావ్ టు గైడ్ ద సొసైటీ, అండ్ ఇన్డట్ ప్రొసెస్ హావ్ టు సెట్ సం గుడ్ స్టాండర్డ్స్ అపార్ట్ ఫ్రం దైర్ బిజినెస్ ఇంట్రెస్ట్స్" అన్నాను నేను.

"వచనాన్ని గూర్చి విమర్శ చేయటం నా గౌరవానికి భంగం కలిగించుకోవటమే కాని, ఒక్కమాట మాత్రం చెప్పక తప్పదు. ఈ 'రోమాంచిత'లు ఇంగ్లీషు 'థ్రిల్లర్'ల మూసలో వచ్చినా నాకభ్యంతరం లేదు. పోతే వాటికి కాపీలు, అనువాదాలు కాకూడదు. ఒకోసారి సంఘటనలను కూడా కాపీ కొట్టేయటం జరుగుతున్నది. ఏ సిడ్నీ షెల్డన్ నవలనో చదవటం, మన రోమాంచితల్లో ఆ ఘట్టాన్ని యథాతథంగా దించెయ్యటం. ఇది గ్రంథ చౌర్యమంటాను నేను" అన్నాడు కన్ను.

దాంతో పెద్ద గోలయింది.

"పెద్ద పెద్ద రచయితల్ని పట్టుకుని గ్రంథ చౌర్యం చేశారనటానికి మీకు సిగ్గుండా లండీ. మీకసలు 'రోమాంచిత'ల్ని గురించి ఏం తెలుసు? ఏదో ఓ సంఘటన తీసుకుంటే ఇహ అక్కడకా రచయిత ప్రతిభ లేనివాడైపోతాడా? అసలు థ్రిల్లర్ మొత్తాన్నీ తెలుగులోకి దించితే మాత్రం రచయిత స్వంత ప్రతిభ లేకుండా అలా చేయగలట్టండీ? మీ విమర్శ కవిత్వానికే పరిమితం చేసుకుంటే ఆరోగ్యకరం" అన్నాడు బన్నూ భుజాలు తడుముకుంటూ కోపంగా.

"'రోమాంచిత' అనే ప్రక్రియ కొత్తగా తెలుగులోకి దిగుమతి అయింది. ఉయ్ వాంట్ మాడల్స్ ఫర్దెం. ఇంగ్లీష్ థ్రిల్లర్స్ ఆర్ రెడిలీ అవైలబుల్ అండ్ ఉయ్ మేక్ యూజ్ ఆఫ్దెం. దెన్ వాటీజ్ రాంగ్ విత్ఇట్?" అన్నాడు హన్ను కోపాన్ని ఇంగ్లీషులో పూరిస్తూ.

"కన్ను చెప్పిందదేనండీ. ఇంగ్లీషు థ్రిల్లర్ మూసలో రాసినా తనకభ్యంతరం లేద న్నాడు. ఆయన గర్హించింది కాపీ చేయటాన్నే" అన్నాను నేను.

"మళ్ళీ అదే కూత కూస్తావు-కాపీ, కాపీ అని. ద వెరీ ఆర్ట్ ఇట్ సెల్ఫ్ ఈజె కాపీ ఆఫ మాడల్. బుద్ధున్న వాడెవడూ ఆ మాటనడు" అన్నాడు బన్ను.

"ఆ మాట నిజమేలెండి. మంచెక్కడ ఉంటే అక్కడనుండి తెచ్చుకుంటాం. దాంట్లో తప్పేంది? మనం శరత్‌బాబు నవలలు తెలుగులోకి అనువదించుకోలా" అన్నాడు తన్ను.

ఇహ అతనికి కాపీకి, అనువాదానికీ తేడా చెప్పి ఒప్పించలేమని ఎవరూ ఆ ప్రయత్నం చేయలేదు.

"ఆంగ్ల 'రోమాంచిత'ల రచయితలు రచనకు ముందు ఎంతో ఇన్వెస్టిగేట్ చేసి, ఎంతో మెటీరియల్ సేకరించి ఆపైన రచన చేస్తున్నారు. ఆ పద్ధతిలో కొంతమంది తెలుగు రచయితలూ ప్రయత్నిస్తున్నారు. వారి కృషి అభినందనీయం. వాళ్ళను మీరు ప్రోత్సహిం చాలి" అంది విన్నీ.

"తప్పకుండా. 'రోమాంచిత'లు ఏ పద్ధతిలో వచ్చినా వాటికి నా పత్రికలో చోటిస్తాను. విన్నీ, మీరు కూడా మా పత్రికలో కవితలు రాయాలి" అన్నాడు బన్ను.

"రాస్తాను కాని. స్పేస్ లేదు- మినీ కవితలు రాయమంటే కష్టమండీ" అంది విన్నీ.

"అమ్మమ్మ, అంత మాటనకండి. మీరు రాయటం, స్పేస్ లేకపోవటమూనా? అలాగే 'దాంపత్యజీవనా'న్ని గురించి డాక్టర్ సలహాలకు కూడా రెండు పేజీలు పత్రికలో కేటాయిస్తాం."

"ఆ పేరుతో పోర్నో చేస్తారన్నమాట పత్రికను" అన్నాను నేను.

దాంతో బన్నూ మండిపోయాడు. "నువ్వు మాట్లాడకూర్రొ! తగుదునమ్మా అని అన్నిట్లో తలదూరుస్తావు" అన్నాడు.

"అదేం మాట. ఎవరి అభిప్రాయం వాళ్ళు చెప్తారు. ఏ సభ్యుడూ మరో సభ్యుడి వాక్ స్వాతంత్ర్యాన్ని హరించే ప్రయత్నం చెయ్యరాదు" అన్నాడు హన్నూ. దాంతో మరెవరూ ఆ ప్రస్తావన చేయలేదు.

"ఇంకొక మాట, బన్నూ! యు హేవుటు క్రియేట్ ఎ టేస్ట్. వస్తువుల 'బ్రాండ్ నేమ్' అంటారే అలా. దాంతో నీ పత్రిక మనిషి జీవితంలో తప్పనిసరి భాగమవాలి" అన్నాడు జున్ను.

"అంటే స్పష్టీకరించు, బ్రదర్!" అన్నాడు బన్ను.

"ఇప్పుడు మనం రకరకాల టూత్‌పేస్ట్‌లు, సబ్బులు వాడుతున్నాం. ఒక్కొక్కళ్ళం ఒక్కో బ్రాండ్‌కి అలవాటు పడిపోయాం. అది మార్కెట్టులో దొరకలేదా, ప్రాణం గిలగిల కొట్టుకుపోతుంది. అలా నీ వెరైటీ సాహిత్యాన్నీ, వ్యక్తిత్వాన్నీ నిల్పుకోవాలి నీ పత్రిక" అని విపులీకరించాడు జున్ను.

నాకు సిగరెట్ల సంగతి గుర్తుకొచ్చింది. "అవును. ఓ కొత్తబ్రాండు సిగరెట్టు వచ్చిం దనుకోండి. దాని ధర మొదట్లో మిగతా వాటికంటే చవగ్గా ఉంటుంది. అలా ఒకటి, రెండు సంవత్సరాలు మనకు అలవాటు చెయ్యగానే, ఒక్కసారిగా మార్కెట్టులో, ముఖ్యంగా ప్రతి ఫిబ్రవరి మాసంలో మాయమైపోతుంది. అతికష్టం మీద ఒక పెట్టో, అరపెట్టో బ్లాక్‌లో దొరుకుతుంటాయి. ఇహ ఆ తర్వాత ప్రభుత్వం వాటి మీద సుంకం విధించినా, లేక పోయినా ధర పెంచేస్తారు. ఎంత ధర పెంచినా అలవాటుపడ్డ జనం చచ్చినట్టు కొంటారు. కనుక మీ పత్రిక కూడా మొదట్లో, మిగతా వారపత్రికల కంటే తక్కువ ధరలో- అయితే స్టాండర్డ్స్ ఏ మాత్రం తగ్గకుండా - జనానికందించి అలవాటు చేయండి. ఒకసారి జనానికి రుచి చూపించి మిమ్మల్ని మీరు ఎస్టాబ్లిష్ చేసుకున్న తర్వాత, ఇహ కొంచెం కొంచెంగా ధర పెంచండి. అలవాటుపడిన జనానికి మీ పత్రిక కొనక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది" అన్నాను.

"మా బాగా చెప్పావు, పొన్ను! దిసీజ్ వన్నాఫ్ ద కాంప్లెక్సిటీస్ ఆఫ్ మాడరన్ లైఫ్ విచ్ నో బడీ కెన్ ఎస్కేప్. మన తాతలు, తండ్రులు టూత్‌బ్రష్షులు, పేస్టులు వాడలేదు గదా! పందుం పుల్లతో మొహం కడుక్కునే వాళ్ళు. అందువల్ల వాళ్ళ పళ్ళు పుచ్చిపోలేదు. అయితే, జీవితాన్ని కమ్మర్షియల్ చేసే ప్రాసెస్‌లో మనకు కొన్ని సుఖాలు అలవాటయ్యాయి.

ఒక టూత్‌పేస్ట్‌లో ఫ్లూరైడ్ ఉందంటారు. మరోదాంట్లో లవంగనూనె దంతాలకు బలాన్నీ, రక్షణను కలగజేస్తుందంటారు. మరో దాంట్లో జెర్మిచెక్ ఫార్ములా ఏదో ఉందంటారు. ఇంకో దాంట్లో మరేదో మహత్తర మూలికల సమ్మేళనముందంటారు. దేంట్లో ఏం ఉందో, ఏది మన పళ్ళకు మంచిదో మనకు తెలీదు. ఈ అడ్వర్టయిజ్‌మెంట్లు వినీ, చూసీ, వాడే జనాన్ని పరికించీ, మనమూ ఏదో బ్రాండుకు అలవాటుపడిపోతాం. ఇహ ఆ ఆకర్షణని తట్టుకు నిలబడటం కష్టం. చచ్చినట్టు అది ఉండాల్సిందే. అది లేకపోతే జీవితం దుర్భరమై పోతుంది. ప్రస్తుతం బిజినెస్ టెక్నిక్ ఇది. నువ్వలా జనాన్ని నీ బ్రాండుకు అలవాటు చెయ్యాలి. అడ్వర్టయిజ్‌మెంట్లతో జనం మతిపోగొట్టాలి. మతిపోయిన జనం 'ఇదే గతిరా బాబూ' అన్నట్టు శరణుజొచ్చుతారు" అని ఓ పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు జున్ను.

"అంటే జనం అభిరుచితో మనం పోక, మన అభిరుచికి జనాన్ని తిప్పుకోవాలంటావు" అని అడిగాడు బన్ను.

"ఎక్జాక్ట్‌లీ. యుహేవ్ కాట్ ద పాయింట్" అన్నాడు జున్ను. "యు హేవ్ టు ఇన్కల్కేట్ టేస్ట్ ఇన్దెం".

"ఇదేం బాగాలేదండీ. ప్రతికలను మరీ టూత్‌పేస్టులు, సబ్బులు, సిగరెట్లు, డిటర్జెంట్ పౌడర్ల స్థాయికి దింపి మాట్లాడుతున్నారు" అంది విన్నీ.

"ఇంకా నయం. హెరాయిన్, ఎల్.ఎస్.డిల స్థాయికి దించలేదు. ఓ విధంగా డ్రగ్ ఎడిక్ట్స్‌లాగ, జనం థ్రిల్లర్ ఎడిక్ట్స్ అయిపోతున్నారు. ఇదో స్లో పాయిజనే సందేహమేం లేదు. అయితే, మిగతా పత్రికలతో పోటీకి మనవాడు తట్టుకుని నిలబడాలంటే 'రోమాంచిత'లను ప్రకటించక తప్పనిసరి. 'దాంపత్యజీవనం' లాంటి పోర్నోలు తప్పనిసరి. 'రోమాంచిత'లను సృజించే రచయితలను కూడా మనవాడు కల్టివేట్ చెయ్యాల్సి ఉంటుంది. బాక్స్‌కట్టి 'రచయితలతో ముఖాముఖీ'లు ప్రచురించాలి. ఇంకా వెయ్యి చెయ్యాలి. వాటన్నిటినీ తప్పుపట్టి ప్రయోజనం లేదు. సర్క్యులేషన్ పెంచుకునే ప్రయత్నం ప్రతి పత్రికా చేయవల్సిందే కదా! స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్" అన్నాడు జున్ను.

"కన్నూ కూడా వచన రచనలని చిన్నచూపు చూడక, తన సృజనాత్మక విమర్శతో మా పత్రికను పావనం చేయాలని నేను కోర్తున్నాను" అన్నాడు బన్ను.

"మీరు, హన్నులాంటి వారు వచన రచనలు చేస్తుంటే, నేను మాత్రం వాటిని తృణీకారభావంతో చూడటమెలా కుదురుతుంది లెండి. అలాగే... పెద్దలు మీరు సెలవిచ్చిన తర్వాత ఇహ నేను తప్పుకోటానికి ఆస్కారమేదీ?" అన్నాడు కన్ను.

"మరి మీరు మా నాటక కళకు ప్రాధాన్య మివ్వరా?" అని అడిగింది కన్నీ.

"అమ్మమ్మ! అలా అనకండి. మీరు నాటకాలు రాయండి. ప్రచురించకపోతే అప్పుడడగండి నన్ను" అన్నాడు బన్ను.

"రాయటం నా వల్ల కాదు. ఆ పని మన సున్నే చేయాలి."

"అదేం మాట మీరు స్వయంగా నటీమణై ఉండీ నాటకం రాయలేకపోవటమేమిటి?

నటనకు, నాటక రచనకు అవినావభావసంబంధం. మనం నటులం రాయటల్లేదంటే మన బద్ధకం తప్ప మరో కారణం లేదు. మన మిత్రులు పత్రిక పెట్టింతర్వాత కాస్త బద్ధకం వదిలించుకునయినా రాయాల్సిందే" అన్నాడు సున్ను.

పాపం, ఇన్నీకి నన్నెవరూ రాయమని అడగనందుకు బాధ అన్పించినట్లుంది. "మీరూ, రాయండి కథలూ, కవితలూ, పొన్నూ" అంది.

"అవును, నేనూ రాస్తాను, బన్నూ వేస్తానంటే" అన్నాను ఉత్సాహంతో.

"పంపించు చూద్దాం. అర్హమయితే ప్రచురిస్తాను" అన్నాడతను.

"ఎవరి రచనకూ లేని అర్హత నా రచనలకే వచ్చిందా, ఏం?" అన్నాను, రోషంగా.

"అదుగో, అలా కోపం తెచ్చుకోకండి. మన బన్నూ ఎవరివైనా అర్హమైతేనే తన పత్రికలో ప్రచురిస్తారు. పత్రిక ప్రమాణాలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది" అన్నాడు కన్ను, నన్ను బుజ్జగిస్తూ.

అలా ఆనాటి 'వరసం' మాసికం ముగిసింది.

'నెలవంక' సాహిత్య వార్షిక సంచిక, 1998-99

## -6-

ఈ మధ్య 'వరసం' మాసికాలకు వెళ్ళటం పడలేదు. ఆఫీసు పనుల్లో తీరికలేక జున్ను కూడా రాకపోవడంతో నాకూ ఆ సమావేశాలపై అంతగా ఆసక్తిలేకపోయింది. ముఖ్యంగా సమావేశాల్లో బన్ను నా పట్ల వ్యవహరించే తీరు నాకు నచ్చలేదు. అందుకే వాటిపై అంత ఆసక్తి చూపలేదు.

'వరసం' సభ్యుల సాంగత్యమో, మరేమో నేనూ కొంత సాహిత్య వ్యవసాయం చేయటం మొదలెట్టాను. అప్పుడప్పుడు కవితలు రాస్తున్నాను. కొన్ని పత్రికల్లో అచ్చుయాయి కూడా. కథానికలు కూడా గిలుకుతున్నాను. పత్రికల వాళ్ళకు రాసేవాళ్ళు కరువేమో - నావీ కొన్ని కథలు అచ్చుయాయి. జున్ను బలవంతంతో రెండు కథల సంకలనాలు ప్రచురించటంతో నాలోనూ అహం పెరిగింది. నేనంతకు ముందు రచయితనని అనుకునేవాడిని కాదు. కథా సంకలనాలు ప్రచురించటం వాళ్ళూ వీళ్ళూ నేనూ రచయితనని చెప్పటంతో 'నిజమే కాబోల'నుకున్నాను.

బన్ను 'ఆంధ్రదీప్తి' పత్రికకు సంపాదకుడైన తర్వాత ఓరోజు జున్నూ, నేనూ అతని ఆఫీసుకు వెళ్ళాం. బన్ను "మా పత్రికకు మీరో 'కాలం' రాయకూడదూ" అన్నాడు జున్నుతో.

"ప్రస్తుతం నా వల్ల కాదులే, పైగా నాకు కర్నూలుకు ట్రాన్స్‌ఫరయేటట్లుంది. వారం వారం పత్రిక్కి రాసి పంపాలంటే కుదిరే పనికాదు. పోనీ మనవాడు రాస్తాడు, నీ కిష్టమైతే" అన్నాడు జున్ను.

"అలాగే, ఆయన రాస్తే నాకేమభ్యంతరం. మన 'వరసం' సభ్యులకు ప్రోత్సాహమివ్వాల్సిన బాధ్యత కూడా మనమీద ఉంది కదా!" అన్నాడు బన్ను.

అయితే నేను బన్ను మాటల్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. జున్ను మాటల్ని కాదనలేక నన్ను 'కాలం' రాయమన్నాడేమోననుకున్నాను. అయితే. ఓరోజు బన్ను ఫోను చేశాడు. "ఏంటీ 'కాలం' ఎప్పుడు మొదలెడతావు? రాసి తీసుకొస్తావని అనుకున్నాను. ఇంతమటుకు మళ్ళీ ఈదిక్కే చూడలేదు" అంటూ.

"ఏ విషయంమీద రాయమంటారు?" అనడిగాను అతన్ని.

"నీ ఇష్టం ఏ విషయంపై రాసినా ఫర్లేదు. కథలు రాస్తున్నావుగా. కథల ఫక్కీలో, నాటకీయంగా స్కెచ్‌లాంటి దేదయినా రాస్తే బావుంటుందేమో. ఇది వట్టి సూచన మాత్రమే. నీకు నచ్చిన పద్ధతిలో నీకు నచ్చిన విషయం మీద రాయి. రెండు మూడు రోజుల్లో రాసి పట్టుకురావాలి. వచ్చే వారంనుండి మొదలెడ్దాం. నీ 'కాలం' శీర్షిక కూడా నువ్వే ఎంచుకో" అన్నాడు బన్ను.

"సరే" అన్నాను, మరీ అంత ప్రేమగా అడుగుతున్నప్పుడు కాదనలేక. అయితే అదొక్కటే కారణం కాదులెండి. నాకూ ఈమధ్య సాహిత్యపరమైన దురద మొదలైంది. రాసినవి అచ్చవుతున్నాయి. పైగా వాళ్ళు వీళ్ళు బహుశ నన్ను సంతోషపెట్టటానికేనను కుంటా మెచ్చుకుంటున్నారు. ఆ మెప్పుకోలుతో 'సెవెంత్ హెవెన్'లో ఉన్న నేను బన్నూకు మాట ఇచ్చేశాను రాస్తానని.

నా 'కాలా'నికి శీర్షిక ఏం పెట్టాలో తోచి చావలేదు. 'కింగ్స్ అండ్ కాటేజెస్'లా క్రిస్ప్‌గా, అర్థవంతంగా ఉండాలి. చివరికి ఏం తోచిచావక 'బలుపూ వాపూ' అన్న పేరెట్టాను. కాయితం మీద అక్షరం పెట్టింతర్వాత దానికి అర్థం చేకూరుతుందనుకుంటాను. ఆ శీర్షిక 'మంచీ – చెడూ'కు సమానార్థక మనిపించింది నాకు. విమర్శిస్తే ఏడుపు ముఖం పెడ్తాననుకునే నా మిత్రులు "బాగుందోయ్" అన్నారు. ఇంకేం. ఓ రెండు అర్టికల్స్ తోచి నట్టు బరికేసి ఒక మంచి రోజు చూసి తీసుకెళ్ళి బన్నూకిచ్చాను. "మీకు నచ్చితే వెయ్యండి" అని.

బన్నూకు నచ్చుతుందో లేదో నాకనుమానమే. వేస్తాడో లేదో అనుకున్నాను. వెంటనే ఆ వారం పత్రికలోనే వేసేశాడు. తీరా చదివి చూసుకుందును కదా, కేటాయించిన స్పేస్‌లో వెయ్యటానికి ఆర్టికల్‌ని ఎడిట్ చేయాల్సి వచ్చినట్టుంది. అందులో నేను ముఖ్యం అనుకున్న వాక్యాలు పోయాయి. ఒకోచోట ముందు వాక్యానికీ తరువాత వాక్యానికీ పొంతనలేకుండా పోయింది. దాంతో నేనుద్దేశించిన వ్యంగ్యం ఆర్టికల్‌లో లోపించినట్టనిపించింది. రచ యితకు తను రాసిందంతా ప్రింటులో రావాలని ఉంటుంది. అదో దౌర్భాగ్యం! అక్కడికి తాను రాసిందేదో మహత్తర విషయమైనట్టు! అందుకే ఉండబట్టలేక మర్నాడు 'ఆంధ్ర దీప్తి' ఆఫీసుకు వెళ్ళి "ఏమిటి బన్నూ, ఇలా చేశారు" అని అడిగా.

"బావుంది. నీ ఇష్టమొచ్చినట్టు రాస్తే వేయటం ఎలా! మాకూ స్పేస్ ప్రాబ్లం" అన్నాడు.

"నిజమే. కానీ ఇష్టమొచ్చినట్టు ఎడిట్ చేస్తే ఆర్టికల్ డినోమా దెబ్బతింటుంది."

"నిన్ను కథలు రాయమన్నదెవరు? వ్యాసంలాంటిది రాయకపోయావూ."

"అది కథ కాదు, స్కెచ్."

"ఏ పేరెడితేనేం. కథకున్న అన్ని లక్షణాలూ దాని కున్నయ్యి. నో. నో. మా స్వాతంత్ర్యం హరించటం నేనొప్పుకోను. నీకిచ్చిన స్పేస్‌కాక ఇంకా ఎక్కువ వెయ్యాలా ఏం? కుదరదు" అంటూ గయ్యమని లేచాడు.

అతనికంత కోపమెందుకొచ్చిందో నాకు అర్థం కాలేదు.

నేను హర్టయినట్టు వెంటనే గమనించాడు. "అంతగా పెద్ద ఆర్టికలయితే వేరేగా వేద్దాంలే. ఇది మన పత్రిక. మన వాళ్ళంతా రాయాల్సిందే" అన్నాడు, ఆ పైన నన్ను ఓదారుస్తున్నట్టు. పత్రిక సంపాదకుడయింతర్వాత అతను కొత్తగా నేర్చుకున్న కళ ఇది - గిల్లి బుజ్జగించడం.

ఇంక అతనితో మాటలు అనవసరం. ఎడిట్ చేయటానికి వాళ్ళకవకాశం ఇవ్వకుండా వాళ్ళు కోరినంతే - వాళ్ళు స్పేస్ ఇచ్చినంతే రాద్దామని తీర్మానించుకుని పత్రికలో సబ్ ఎడిటర్ని అడిగాను. "నా రాతలో ఎన్ని పేజీలు రాస్తే సరిపోతుందయ్యా 'బలుపూ - వాపూ' కాలానికి" అని అడిగాను. అతను "రెండు పేజీలు రాయండి చాలు" అన్నాడు. అప్పటినుండి అంతమేరకే రాయసాగాను. వాళ్ళ కత్తివేటుకు గురికాకుండా.

అయితే బన్నూ నన్ను కాలం రాయమని అడగటం నా మీద ప్రేమతోనో, లేక నా సామర్థ్యం మీది నమ్మకంతోనో కాదు. అతనికి ఆ మేరకు వారం వారం పత్రికలో స్పేస్ నింపేవాళ్ళు కావాలి. పైగా జున్నూను కించపరచటం ఇష్టంలేక కూడా నన్ను 'కాలం' రాయమని కోరాడతను అని నాకు చాలా రోజుల వరకూ తెలియలేదు.

ఓసారి నేను రాసిన 'బలుపూ - వాపూ' కాలం రచన ఇవ్వటానికి 'ఆంధ్రదీప్తి' పత్రిక ఆఫీసుకు వెళ్ళేసరికల్లా హన్నూ కూడా అక్కడే కూర్చుని ఉన్నాడు. హన్నూ నవ్వు ముఖంతో "రండి. రండి" అంటూ ఆహ్వానించాడు. సంపాదకుడు బన్నూకు నేను 'విష్' చేసినా అది గుర్తించనట్టే ఉన్నాడు. నన్ను పలకరించకుండా హన్నూతో మాట్లాడసాగాడు. అలా ఓ పావుగంట గడిచాక. నేనిచ్చిన 'కాలం' రచనను పుచ్చుకుంటూ "క్రితం వారం నువ్వు రాసింది ఏం బాగాలేదు. అహ, నువ్వేమి అనుకోవద్దు. అంతకు ముందు కొన్ని మంచివే రాశావు. క్రితంవారం రాసింది మాత్రమేం బాగాలేదు" అన్నాడు బన్నూ.

ఏ రచయితకైనా తను రాసింది బాగుండలేదంటే కోపమే వస్తుంది. అదీ హన్నూ ముందు అనటం నా కసలు నచ్చలేదు. బాగా లేదన్నవాడు ఏం బాగా లేదో విడమర్చి చెప్పవచ్చుగా, చెప్పడు. అది అతని తత్వం. ఓ స్వీపింగ్ కామెంట్ చేయటం తేలిక. సద్విమర్శ చేయటం కష్టం.

"ప్రతివారం రాయాల్సి రావటంవల్ల ఒక రచన బావుండకపోవచ్చులేండి" అన్నాను, నన్ను నేను సమర్థించుకుంటూ.

అలా మా మధ్య ఎప్పటినుండో ఉన్న కోల్డ్‌వార్ మరింత ఘనీభవించింది. బన్నూ, ఇంక నాకు త్వరలోనే ఉద్వాసన చెప్తాడనుకున్నాను. సంపాదకుల కది తేలిక. మనం ఓ

వారం ఇచ్చింది ప్రచురించక ఆపేసినట్టయితే, ఇంక మనం రాయాల్సిన అవసరంలేదని సమాచారం మనకు అందినట్లే. నోటితో చెప్పకుండా ఇలాంటి పనులు చేస్తుంటారు సంపాదకులు. మనుషులపై అకారణ ద్వేషం ఎందుకు కలుగుతుందో నాకెప్పటికీ అర్థం కాదు. ఓ మనిషి ముఖ లక్షణాలో, మాట తీరో, మరేదో ఆ అకారణ ద్వేషాన్ని కలుగజేస్తాయేమో.

ఈసారి 'వరసం' మాసికం బన్నూ 'ఆంధ్రదీప్తి' కార్యాలయంలో జరుగుతోందట. "ఆదివారం కాబట్టి సిబ్బంది ఎవరూ రారు. మనం తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" అన్నాడట బన్నూ. ఆ విషయం హన్నూ ఫోన్‌చేస్తే తెలిసింది. కిందటి నెల మేం జున్నూ బదిలీ అయిన సందర్భంలో హోటల్లో పార్టీ ఇచ్చి వీడ్కోలు చెప్పాం. ఈ సారి 'వరసం' మాసికంలో అధ్యక్ష పదవికి ఎన్నికలవుతాయి కనుక తప్పక రావల్సిందని చెప్పాడు హన్నూ.

మాసికానికి వచ్చే సభ్యుల సంఖ్య బాగా తగ్గిపోయింది. బన్నూ, హన్నూ, సున్నూ, కన్నూ, నేను మాత్రమే వచ్చాం. విన్నీకి పెళ్ళయింది. హనీమూన్‌కి కాశ్మీరు వెళ్ళిపోవటంవల్ల రాలేదు. ఆమె రావటంలేదని కన్నీ రాలేదు. నేను వెళ్ళేప్పటికి వాళ్ళు నలుగురూ వచ్చి ఉన్నారు "రండి. రండి" అని ఆహ్వానించాడు సున్నూ నన్ను. బన్నూ, కన్నూ నేను వచ్చినట్టే గుర్తించనట్టుండిపోయారు. హన్నూ 'ఆంధ్రదీప్తి' వారపత్రిక తిరగేస్తూ, నన్ను గమనించ లేదు.

నమస్కారాలు చెప్పటంతో, హన్నూ తలెత్తి నన్నుచూసి, "ఇహమనం కార్యక్రమం మొదలెట్టొచ్చనుకుంటాను. కన్నీ తాను రానని చెప్పింది, విన్నీ వచ్చే అవకాశం లేదు" అన్నాడు.

"మంచిది" అన్నాడు బన్నూ.

"ముందుగా జున్నూ అధ్యక్షుడిగా మన సంఘానికి చేసిన సేవకు కృతజ్ఞతలు చెప్పాలి. అసలు సంఘం పెట్టాలనే ఆలోచనే ఆయనది. పెద్ద హృదయం ఉన్న మనిషి. మనందరికీ మార్గదర్శకత్వం వహించి, మన సాహిత్య వ్యవసాయానికి ఎంతో దోహదపడిన మనిషి, మహామనీషి. ఉయ్ మస్ట్ రికార్డ్ అవర్ గ్రాటిట్యూడ్ ఫర్ద యోమన్ సర్వీసెస్ హి వరెండర్డ్ ఫర్ద ప్రోగ్రెస్ ఆఫ్ అవర్ సొసైటీ. బన్నూ తాత్కాలిక అధ్యక్షుడిగా ఈ కార్యక్రమాన్ని నడపాలి అని నేను కోరుకుంటున్నాను" అన్నాడు హన్నూ.

మేమందరం చప్పట్లు చరిచి తాత్కాలికాధ్యక్షుణ్ణి అభినందించాం.

"తాత్కాలిక అధ్యక్షుడెందుకండీ! పర్మినెంటుగానే ఎన్నుకోవచ్చుగా" అన్నాడు కన్నూ.

"ముందు పాత కార్యవర్గానికి కృతజ్ఞతలు చెప్పి, కొత్త కార్యవర్గం ఎన్నుకుంటే బావుంటుంది" అన్నాను నేను.

"కార్యవర్గానికి ఎన్నికలెందుకు? నేను కార్యదర్శిగా రాజీనామా చెయ్యలేదుగా. జున్నూ స్థానంలో అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటే సరిపోతుంది" అన్నాడు హన్నూ.

"ఇంకా ఎన్నికలు ఎందుకండీ, స్థాపక సభ్యులు బన్నూ ఉన్నారుగా. 'ఆంధ్రదీప్తి' సంపాదకులు. 'రోమాంచితలు' విరివిగా వండి పండించిన బన్ను నాయకత్వంలో మన మింతకు ముందు ఎదగని ఎత్తులకు ఎదగగలం. ఈనాటి రోమాంచితా సాహిత్యాకాశంలో ధృవతార, సహృదయ శిఖామణి అయిన బన్నూ కంటే ఆ స్థానాన్ని భర్తీ చేయనర్హులెవరు?" అన్నాడు కన్ను.

"వారు అందుకు అర్హులే, కాదనను. నిజానికి మనలో ఎవరు ఆ పదవికి తగినవారు కారు? ఉదాహరణకు మన పొన్ను ఉన్నారు చూడండి. యువకుడు. ఉత్సాహవంతుడు. ఇప్పుడిప్పుడే రచనాకాశంలో పైకెదుగుతున్నారు. ఆయన మాత్రం ఆ పదవికి తగినవాడు కాదూ!" అన్నాడు సున్ను. అతనికీ పదవీ వ్యామోహం పట్టుకున్నట్టుంది. తన పేరు తను చెప్పుకోలేక నన్ను ఎగదోసే ప్రయత్నం చేశాడతను. బన్ను నా వంక గుర్రుగా చూశాడు.

"ధృవతారలుండగా, ఎదుగుతున్న తారలు ఆ పదవిని అధిష్ఠించడం నాకిష్టంలేదు. ఆయనకింకా సమయముంది. ఇంకా నేర్చుకోవాల్సినవెన్నో ఉన్నాయి. కనుక మన బన్నూనే ప్రస్తుతం ఆ పదవికి తగినవాడు" అన్నాడు కన్ను గట్టిగా.

గాలెటు వీస్తున్నదో అర్థమైపోయింది సున్నూకు. తన పేరెవరూ ప్రతిపాదించరని అతనికి తెలిసిపోయింది. "బన్నూ విషయంలో చెప్పాల్సిందేవుందీ. ఆయన తగిన వ్యక్తి కాదని ఇక్కడున్న వాళ్ళల్లో ఎవరనగలరూ! కాకపోతే, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నుకుంటే బావుంటుందేమోనన్న ఉద్దేశంతోనే ఈ మాట చెప్పాను" అన్నాడు సున్ను.

"ఏకగ్రీవంగా ఎన్నుకోవటం కూడా ప్రజాస్వామ్య పద్ధతే లేండి" అన్నాడు కన్ను.

దాంతో మరెవరూ ఎదురుపలకలేదు. అందరం చప్పట్లు కొట్టి కన్ను ప్రతిపాదనకు మా ఆమోదాన్ని తెలియపర్చాం.

"బన్ను మన 'వరసా'నికి అధ్యక్షుడిగా ఎన్నికైనట్లుగా ప్రకటిస్తున్నాను. వారు మన 'వరసం' ఉన్నత సంప్రదాయాల పరిరక్షణకు బద్ధకంకణులై, మన సంఘాన్ని ముందుకు నడిపించవల్సిందిగా, మాబోంట్లకు మార్గదర్శకత్వం వహించాల్సిందిగా కోరుతున్నాను" అన్నాడు హన్ను.

సభ్యులు 'ఆంధ్రదీప్తి' సంపాదకులను కాకాపడ్తున్నట్టనిపించింది నాకు.

బన్ను ఠీవిగా అధ్యక్ష స్థానాన్ని అలంకరించాడు. అది అప్పటిదాకా ఆయన కూర్చున్న కుర్చీనే అయినా, లాంఛన పూర్వకంగా అధ్యక్షుడయింతర్వాత ఆ పీఠం కొత్త వెలుగును, దర్జాను సంతరించుకున్నదని అభివర్ణించాడు కన్ను. ఆ తరువాత పాత అధ్యక్షుడైన జున్ను సేవలను కూడా రికార్డు చేయడం జరిగింది. జున్ను అకుంఠిత సేవను, ఆ స్థానంలో తాను అధ్యక్షుడవటం గూర్చీ 'ఆంధ్రదీప్తి' పత్రికలో ప్రచురిస్తున్నానని చెప్పాడు బన్ను.

"మనం ఇలా ఎంతకాలం పరిమితుల్లో సాగుతాం. మన సభ్యుల సంఖ్యను పెంచుకు నేందుకు మనం కృషి చేస్తే మంచిదని నా అభిప్రాయం" అన్నాను నేను.

"సంఖ్య ఇలా ఉన్నందువల్ల జరిగే నష్టమేమీ లేదు. మిగతా అన్ని సంస్థల్లాగా కాక మనం సంఘానికో విలక్షణత్వం ఉంది. ప్రత్యేకత ఉంది. సంఖ్యాబలంవల్ల ఒనగూడేదేమీ ఉండదు. పైగా సంఘ ఆదర్శ పరిధిని ఇంకా కుదిస్తే మంచిదని నా అభిప్రాయం. వన్ ఆర్ టు రిప్రజెంటేటివ్స్ ఫ్రం ఈచ్ ఫాం ఆఫ్ ఆర్ట్. పనికిరాని వాళ్ళనందర్నీ చేర్చుకున్నందు వల్ల ప్రయోజనమేంటి?" అన్నాడు బన్ను నా ప్రతిపాదనను ఖండిస్తూ.

"అంటే విడమర్చి చెప్పండి" అన్నాడు సున్ను. తన పేరెవరూ ప్రతిపాదించకపోవడం అతనింకా జీర్ణించుకున్నట్లు కనపడలేదు.

"చూడండీ, నాటకం- నటనకు మీరూ, కన్నీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మన కన్ను విమర్శకు, విన్నీ కవిత్వానికీ, హన్ను నవల- కథానికలకు, నేను 'రోమాంచిత'లకు ప్రాతినిధ్యం వహిస్తున్నాం. దేనికీ ప్రాతినిధ్యం వహించని వాళ్ళని చేర్చుకోవటంవల్ల మన సంఘ ప్రతిష్ఠ దెబ్బతింటమేకాక, మనం సాధించేదేమీ ఉండదు" అని వివరించాడు బన్ను.

బన్ను సంభాషణా సారాంశం నాకర్థమైంది. దేనికీ ప్రాతినిధ్యం వహించని వాణ్ణి నేనే. ఎన్నో దోహదక్రియలు చేస్తూ తలకిందులుగా తంటాలుపడ్తూ, నా ఓపినంతలో నేనూ సాహిత్య వ్యవసాయం చేస్తున్నా నా ప్రాతినిధ్యాన్ని అంగీకరించటానికి ఇష్టపడటం లేదు బన్ను. "కానీ ఏదో ఒక శాఖకు సభ్యులు ప్రాతినిధ్యం వహించాలని మనం సంఘ కాన్స్టిట్యూషన్‌లో రాసుకోలేదుగా" అన్నాడు సున్ను.

"రాసుకోకపోతే ఇప్పుడు రాసుకోవాలి. ఒకసారి పొరపాటు చేశామని, ఆ పొర పాటును ఎప్పుడూ కంటిన్యూ చెయ్యాల్సిన అవసరం లేదు" అన్నాడు బన్ను కంఠం పెంచి.

"కాని సంఘ నియమావళి మార్చటమా?!" అన్నాడు హన్ను. ఎంత బన్నును కాకాపట్టాలని ఉన్నా సంఘ నియమావళికి సవరణ చేయటం అన్నది అతని కాన్స్టి ట్యూషన్‌కు పడని విషయం.

"జున్ను సంఘ నియమావళిని మార్చటానికి, సవరించటానికి ఎప్పుడూ వ్యతిరేకించే వాడు. మీరు పొరపాటుగా అర్థం చేసుకోవద్దు. ఆయన సంఘ సేవ గణనీయమైందయినా, ఆయన సంప్రదాయవాది, కంజర్వేటివ్. విత్ ఆల్ రస్పెక్ట్స్ టు హిం, ఐ మస్ట్ సే హి ఈజ్ ఏంటీ రివల్యూషనరీ అని నేను చెప్పనక్కరలేదు. మీ కందరికీ తెలుసు" అని చిన్న ఉపన్యాసమిచ్చాడు బన్ను.

"అవును. అప్పుడు మన సభ్యులకు బిరుదు ప్రదానం చేద్దామనుకున్నప్పుడు కూడా ఆయన వ్యతిరేకించాడు. మీకు గుర్తు లేదూ!" అన్నాడు కన్ను.

"కాని బిరుదు ప్రదానం ఎంతవరకూ ప్రోగ్రెసివో మీరూ ఆలోచించండి" అన్నాను నేను.

"అదేం మాట! మెరిట్‌ని ప్రోగ్రెసివ్‌లు గుర్తించరా? బిరుదు ప్రదానంలో తప్పేంలేదు" అన్నాడు బన్ను.

పరిస్థితి నాకర్థమైంది. మాటల గారడీతో మనుషుల నెవరూ మోసం చేయలేరు. జున్ను వెళ్ళిపోయాడు. నన్నంత లెక్కచేయకపోయినా, నేను అన్నింటికీ అడ్డం పలకటం బన్నుకు తలకాయనొప్పి అయింది. నన్నూ సంఘం నుండి పంపేస్తే అతని మాటకు ఎదురు చెప్పే వారుండరు. ఇహ సంఘం అతని స్వంతమవుతుంది. వాళ్ళు మెడబట్టుకు గెంటకముందే నేనే సంఘానికి రాజీనామా చేస్తే మంచిదనీ, వాళ్ళకూ నాకూ గౌరవం దక్కుతుందని అన్పించింది.

"మంచిది. మీరు వివిధ కళా ప్రక్రియలకు ప్రాతినిధ్యం వహించేటట్లుగా సంఘాన్ని మలుచుకున్నప్పుడు నేనిక్కడ ఉండటం అనవసరం. నేను సంఘానికి రాజీనామా చేస్తున్నాను. వస్తాను" అని లేచి నిలబడ్డాను.

"అదేం మాట పొన్నూ! ప్రతినిధులతో కూడిన సంఘమయితే మాత్రం నిన్నెవరు రాజీనామా చెయ్యమన్నారు? అది ప్రస్తుతం ఉన్న సభ్యులకు వర్తించదు. కూర్చో..." అని నా చేయి పట్టుకు లాగాడు హన్ను. నేను చేయి విడిపించుకుని లేవబోయాను. అప్పుడో కొత్త వ్యక్తి గదిలోకి అడుగుపెట్టాడు. సూటూబూటూ తొడుక్కున్న స్థూలకాయం, బట్టతల. ధనవంతుడి దర్పం అతని ముఖంలో ప్రతిఫలిస్తోంది.

"రండి... రండి.. మీకోసమే ఎదురుచూస్తున్నాం" అని సీటు మీద నుండి లేచి, తన కుర్చీ అతనికి ఆఫర్ చేస్తూ ఆహ్వానించాడు బన్ను. అతను ఎంత గొప్పవాడైనా, బన్ను తన అధ్యక్ష స్థానాన్ని అతనికి కట్టబెట్టడం, ఆ బానిస మనస్తత్వం నాకు నచ్చలేదు.

"వీరు భూపాలరావు గారని... నేను మీకింతకు ముందు చెప్పలా మా మిత్రులని. వీరు మన పత్రిక 'ఆంధ్రదీప్తి' యజమానులు. వారిని పరిచయం చెయ్యాల్సిన అవసరం లేదు. అఖిలాంధ్ర ప్రజలకు వీరు సుపరిచితులే. ఇంతకు ముందు ఎన్నో పరిశ్రమలకు అధిపతి ఆయన. ఇవ్వాళ వీరు పత్రికా రంగంలో కూడా ఇతోధిక సేవ చేద్దామని ముందుకు రావటం మనం చేసుకున్న పుణ్యం" అని వంగి వంగి సలాములు చేస్తూ అతన్ని ఆకాశానికెత్తేశాడు బన్ను.

ఆపైన మమ్మల్ని ఆయనకు పరిచయం చేశాడు. "వీరు హన్ను-మన 'వరసం' కార్యదర్శి. వీరు కన్ను - ప్రఖ్యాత విమర్శకులు. విమర్శనా రంగంలో ఉద్దండ చండ శాసనులు. వీరు సున్ను - నాటక కర్తలు, పేరొందిన నటులు, దర్శకులు - అటు పౌరాణిక నాటకాలు, ఇటు సాంఘిక నాటకాలు రెండింటి నటన, దర్శకత్వం వహిస్తున్న సవ్యసాచులు..."

అందరూ అతనికి నమస్కారాలు చేశారు. అతను కూర్చునే తల ఊపుతూ సభ్యుల నమస్కారాలు స్వీకరించాడు. బన్ను నన్ను పరిచయం చేయకపోవడం చూసి, హన్నే ఆ పనికి నడుం కట్టుకున్నాడు. "వీరు పొన్ను. సంఘ సభ్యులు, అప్రాతినిధ్య ప్రతినిధులు" అంటూ.

"మన భూపాలరావు గారు మన సంఘ సభ్యులవడానికి దయతో అంగీకరించారు. ఆ విషయం మీకు చెబ్దామనుకుంటున్నాను. అంతలో వారే విజయం చేశారు" అన్నాడు బన్ను.

అంతకు ముందెప్పుడో 'మాసికం'లో ఈ విషయంలో తర్జనభర్జనలు జరగటం, అతన్ని సంఘ సభ్యుడిగా చేర్చుకోరాదని నిర్ణయించటం సభ్యులందరూ మర్చిపోయినట్టున్నారు. బన్ను అలా అనంగానే అతను ఓ చిరునవ్వు చిందించి, మమ్మల్ని చాలా దయగా, పాట్రొనైజింగ్‌గా చూశాడు.

"ఏదీ ఎక్కడా తీరిక ఉండటం లేదండీ. ఎప్పుడూ బిజీ టూర్లూ, ప్రోగ్రాంలు, మీటింగులు. ఇవాళ కూడా మన ముఖ్యమంత్రి గారిని కలిసే పనివుందిగాని, మన బ్రహ్మానందంగారు తప్పక రావాలని పట్టుబడితే, కాదనలేక, ఆ మీటింగును కాన్సిలు చేసుకుని ఇలా రావాల్సి వచ్చింది" అన్నాడతను.

"భూపాలరావు గారూ! మీకొక శుభవార్త. మన సంఘం ఇక నుండీ ఇతర రచయితల సంఘాల కంటే భిన్నంగా, విలక్షణంగా పనిచేస్తుంది. ఇక సంఘంలో అలగామూకనందర్నీ పోగుచేయదల్చుకోలేదు. సభ్యుడయిన వాడు విధిగా ఓ కళాప్రక్రియకు ప్రాతినిధ్యం వహించి ఉండాలి, లేకపోతే కళా ప్రోత్సాహకుడు, పోషకుడై ఉండాలి. మన వాళ్ళందరూ కూడా అంగీకరించారు. పెద్దలు మీరూ అంగీకరిస్తే మనం కాన్స్టిట్యూషన్‌ను అలా మార్చుకోవచ్చు" అన్నాడు బన్ను.

"సరే, బాగానే ఉంది. మీరు అవునన్నది నేను కాదంటానా? మన సంఘానికి నా అండదండలు ఎప్పుడూ ఉంటాయి".

"వీరికీ నామకరణం చేస్తే, వీర్ని సంఘ సభ్యులుగా చేర్చుకోవటం పూర్తవుతుంది" అన్నాడు హన్ను.

"నామకరణమేమిటి?" అడిగాడతను.

వివరించాడు హన్ను, మా సంఘ నామకరణ సంస్కారాన్ని గూర్చి.

"ఆ లెక్కన నా పేరేమవుతుంది సంఘంలో?"

"భున్ను" అవుతుంది అన్నాడు హన్ను.

"భున్నేమిటండీ నా బొంద! భూపాల్ అనండి"

"క్షమించాలి. అలా కుదర్దు. సంఘ నియమాలకు సభ్యులందరూ తలొగ్గవల్సిందే" అన్నాడు హన్ను.

"ఈయన ఎవరయ్యా ఇట్లా మాట్లాడుతాడు!"

"సంఘ కార్యదర్శి" అన్నాను నేను.

"కార్యదర్శి అయితే మాత్రం ఆ దబాయింపేమిటి? అక్కడికేదో నేను ఈయన్ను ప్రార్థించి సంఘంలో ప్రవేశం కోరుకుంటున్నట్లు."

"కార్యదర్శిగా సంఘ నియమాన్ని గుర్తు చేయటం. సభ్యులందరూ నియమాలననుసరించి నడిచేటట్లు చూడటం ఆయన బాధ్యత" అన్నాను నేను.

"ఇక్కడ చదువురాని వాళ్ళెవరూ లేరు, ఆయన నియమాల్ని వినిపించటానికి. ముందా యన్ని క్రమశిక్షణలో ఉండమనండి. లేకపోతే నా అంతవాడిని పట్టుకుని 'భున్ను' అంటాడా ఆ పెద్దమనిషి!" అన్నాడాయన కోపంగా.

"మీరూ క్రమశిక్షణతోనే మెలగాలి. అందరి పేర్లూ సంఘంలో అలానే ఉన్నాయి. అధ్యక్షుడు బన్ను. కార్యదర్శి హన్ను. వీరు సున్ను. కన్ను. నా పేరు పొన్ను" అన్నాను నేను, "నువ్వు మాట్లాడకయ్యా" అని బన్నూ అంటున్నా విన్పించుకోకుండా.

"చూడు, నేను ఈ పత్రిక యజమానిని. బ్రహ్మానందం సంపాదకుడు. వారపత్రిక్కి. సరే, మీరేం చేస్తున్నారో నాకు తెలీదు. ఏదో మీకూ, మీ సంఘానికీ చేతనైన సాయం. ఉపకారం చేద్దామని, మిమ్మల్ని పైకి తీసుకురావటానికి చేయూతనివ్వమని బ్రహ్మానందం మరీ మరీ ప్రాధేయపడగా వచ్చాను. నన్నిలా క్రమశిక్షణా, గాడిదిగుడ్డూ అంటూ అవమా నించటం మీకే మంచిది కాదు. మాలాంటివాళ్ళు ఉండటం మీకే లాభకరం. ఏమం టావయ్యా, బ్రహ్మానందం?" అన్నాడతను.

"అయ్యయ్యో! మీరు తప్పుగా మాట్లాడతారా?" అన్నాడు బన్ను పక్కనున్న కుర్చీలో కుంగిపోతూ.

ఇందాకటి ఠీవి, దర్జా అంతరించిపోయాయి. అలాంటి మనిషి ఆధ్వర్యంలో ఉన్న సంఘంలో నుండి ఎప్పుడు పారిపోదామా అని ఉంది నాకు.

"వ్యక్తులు ఎవరు ఎంత గొప్పవాళ్ళయినా, ఒక సంఘంలో చేరదల్చుకున్నప్పుడు దాని నియమావళి ననుసరించి నడవాల్సి ఉంటుంది అందరూ" అన్నాను నేను, పారిపో యేందుకు మెట్లు వేసుకుంటూ.

"ఈయన ఎవరయ్యా! ప్రతిదానికీ వితండవాదం చేస్తాడు!"

"నేను సంఘంలో సభ్యుడినండీ."

"సభ్యుడవయితే మాట్లాడకుండా కూర్చో."

"సంఘంలో మాట్లాడే హక్కు అందరికీ ఉంది. ఒక సభ్యుడి వాక్స్వాతంత్ర్యాన్ని ఇంకో సభ్యుడు - అదీ కాబోయే సభ్యుడు హరించాలని ప్రయత్నించటం అనుచితం, గర్హ నీయం."

"వాక్ స్వాతంత్ర్యం ఉందని అవాకులు చెవాకులు పేల్తావటయ్యా! నోర్మూసుకో" అన్నాడు బన్నూ ఇక లాభంలేదని కలుగజేసుకుంటూ.

"బ్రహ్మానందం! నన్నీ ఫిష్ మార్కెట్‌లోకి ఎందుకు తీసుకువచ్చావయ్యా! ఈ రౌడీ మూకతో నాకు కుదర్దు. వస్తాను" అని భూపాలరావుగారు లేచి నిలబడ్డాడు.

"అయ్యో. అయ్యో, భూపాలరావు గారూ! తమరు కూర్చోండి. తప్పయిపోయింది. క్షమించాలి. ఇదుగో పొన్నూ, ఇహ నువ్వు మాట్లాడక" అన్నాడు బన్ను.

ఇహ నేను మాట్లాడకపోయే ప్రశ్నేలేదు. బన్ను భూపాలరావుకు సంఘాన్ని అమ్మే స్తాడు. అలాంటి సంక్షోభం నుండి బయటపడేముందు నా ఉద్దేశం స్పష్టీకరించ దల్చు కున్నాను.

"నేనేం తప్పుచేశాను. మాట్లాడకుండా ఉండటానికి?"

"ఇంకా తప్పు చేశానంటావా? భూపాలరావు గారిలాంటి పెద్దమనిషిని పట్టుకుని అవాకులు, చెవాకులు పేల్తావా?"

"తమరు పేలేవే అవాకులు, చెవాకులు, నేనేం నియమాలకు విరుద్ధంగా మాట్లాడటం లేదు."

"ఇహ లాభం లేదు.. నీమీద చర్య తీసుకోవాల్సిందే. రచయితగా ఎదగాలని తప్ప టడుగులు వేస్తున్న నీకు సలహా సహకారాలందించి నిన్నో రచయితగా దిద్దితీర్చిన నన్నే అవాకులు, చెవాకులు పేలానంటావా? నిన్ను పైకి తీసుకురావాలనే ప్రయత్నంలోనే మా పత్రికలో 'బలుపూ-వాపూ' కాలం నీచేత రాయించాను. నీలాంటి చచ్చు రచయితలు నాకు దొరక్క కాదు. ఇంతచేసిన నా పట్ల ఇంత కృతఘ్నుతగా ప్రవర్తిస్తావా?"

"ఏవిటీ, ఇతని చేత మన పత్రికలో 'కాలం' రాయిస్తున్నావా? తీసెయ్. ఇంకతను మనకి రాయాల్సిన అవసరంలేదు" అన్నాడు భూపాలరావు.

"అదెప్పుడో నిశ్చయమైపోయింది లెండి. ఇతని వ్యవహారం తాడోపేడో తేల్చుకోవా లనే వచ్చాను నేనివాళ. సంఘానికి చీడపురుగై దాపరించాడు మనిషి!" అంటూ పక్క స్టాండ్ మీద ఉన్న 'తెలుగు తేజం' పత్రిక తీసి అన్నాడు బన్ను. "చూడు, హన్నూ! ఈ పత్రికలో ఈయన రాసిన వ్యాసం చూడు. తన బోడి ఆంగ్ల పరిజ్ఞానం అంతా వెలగ బెట్టాడు. నేను ఎవడో జాన్సన్‌గాడి నవలననుసరించానా? కానీ తెలివితేటల్లేవట. ఇంగ్లీషు నవలలు కాపీకొట్టి బతుకుతున్నామట..."

"నేనా మాట రాయలేదు. సమకాలీన నవలా విమర్శచేస్తూ తెలుగు నవలపై ఆంగ్ల నవలల ప్రభావం అమితంగా ఉందనీ, అక్కడక్కడా వాటిల్లో చెప్పిన సంఘటనల ఛాయలు తెలుగు నవలల్లో కన్పిస్తాయని రాశాను అది కూడా తప్పే."

"తప్పా, తప్పున్నరా. అసలా జాన్సన్ అన్న గాడిదకొడుకున్నాడన్న సంగతే నాకు తెలియదు. ఇంక వాణ్ణి కాపీ ఎలా చేస్తాను? ఆ మాత్రం జ్ఞానం లేకుండా ఆ చెత్తపత్రికలో అవాకులు చెవాకులు పేల్తావా? సరే. మాటవరుసకు అనుకుందాం. అలాంటి వాడెవడో ఉన్నాడు. నేను వాణ్ణి అనుకరించాను. అందులో తప్పేంటి? ఏం? హన్నూ మాట్లాడవు? అహఁ, అసలు తప్పుందాంట? పోనీ ఆ మాట మన 'మాసికం'లో చెప్పేడవచ్చుగా! ఉహూ, డైరెక్ట్‌గా పత్రికలకెక్కేయటమే" అన్నాడు బన్ను.

"అమ్మో, ఇంత దుర్మార్గమా? నేనేదో సాధుజీవనుకున్నాను కానీ, ఇంత వెన్ను పోటుదారు అనుకోలేదు ఎప్పుడూ" అన్నాడు హన్ను.

"పొన్నూ వరస నాకు మొదటినుండి నచ్చలేదు. నాకు సిక్స్ సెన్స్ చెప్తూనే ఉంది, ఈ మనిషి బ్లాక్‌షీప్ అని. జున్నిచ్చిన అలుసుతో మరీ పేట్రేగిపోయాడు. సంఘ ఐదవ అధికరణ కింద ఇతన్ని సంఘం నుండి బహిష్కరించాలని ప్రతిపాదిస్తున్నాను."

"మీరు బహిష్కరించనక్కరలేదండీ, నేనే రాజీనామా చేస్తున్నాను. ఆఁ, మీ అందరివల్లా రచనలో కొంత నేర్చుకున్నాను. అందుకు మీకందరికీ కృతజ్ఞతలు. అయితే, నన్ను రచయితగా తీర్చిదిద్దింది మీరేనంటే మాత్రం నేను ఒప్పుకోను. నాలో ఆ టాలెంట్ లేకపోతే మీరేం చేయలేరు. బన్నూ! మీరు మొదటి నుండీ నాపై అకారణ వైరం వహించారు. నాచేత 'కాలం' రాయించటం కూడా జున్ను మాట కాదనలేకా, నేను బాగా రాస్తానని మీ అంతస్సులో ఒప్పుకోవటంవల్లా మాత్రమే కానీ, నాకేదో ఒరగబెడదామని కాదు. 'తెలుగు తేజం' పత్రికలో వచ్చిన నవలా విమర్శ సాకు మాత్రమే నన్ను బయటికి పంపటానికి. ఇవ్వాళ సంఘాన్ని మీ పత్రికాధిపతికి అమ్మేస్తున్నారు. పత్రికకు ఏదో ఒక సాహిత్య సంఘంతో సన్నిహిత సంబంధం ఉండటం మంచిదని ఆయన సభ్యుడవుదామని వచ్చాడు. జనాన్నుండి దూరంగా తన చుట్టూ గిరిగీసుకుని బతకప్రయత్నించే సంఘం ఎన్నాళ్ళో మనలేదనీ, మరెవరికీ ప్రయోజనకారి కాదనీ ఆయనకు తెలియదు. ఆపైన ఆయన సభ్యుడయినందువల్ల సంఘానికి జరిగే మేలు ఏమీలేదు. పైగా మీరే ఆయన వ్యాపారానికి వినియోగపడ్తారు. ఆ విషయం మీకు మరికొద్ది కాలంలోనే అవగతమవుతుంది. భూపాలరావు గారూ! ప్రవేశార్హత కుంచించుకుపోయిన సంఘం ఎక్కువకాలం బతికి బట్టకట్టలేదనీ, తన స్వత్వం నిలుపుకోలేని ఏ సాహిత్య సంఘమూ మీకు ఉపయోగపడదనీ గుర్తుంచుకోండి" అంటూ నేను బయటకొచ్చేశాను. బన్నూ, భూపాలరావుగారూ నోరు వెళ్ళబెట్టి చూస్తున్నారు. మిగతా సభ్యులు అవాక్కయిపోయారు. హన్నూ ఏదో మాట్లాడా లనుకున్నాడు కానీ బన్నూను చూసి నోరు మూసుకున్నాడు.

'వరసం' నుండి బయటపడినందుకు నాకేమీ చింతలేదు. అంతకు రెండు నెలల క్రితమే జరగవల్సి ఉండింది. జున్ను, విన్నీలవల్ల ఉండవలసి వచ్చింది. నేను చాలావరకు రాజీపడే మనిషినే కానీ, ఆత్మన్యూనత కలిగించే రాజీపడను.

ఆ మధ్య కోటీ, 'తాజ్‌మహల్' హోటల్లో బన్నూ కన్పించాడు. 'ఆంధ్రదీప్తి' పత్రిక నుండి బయటకొచ్చేశాట్ట. ఎందువల్ల అతను పత్రికనుండి బయటపడ్డాడో నాకు తెలీదు. మనిషిలో అదివరకున్న అహంకారం చాలావరకు నశించిపోయింది. 'ఆంధ్రదీప్తి' పత్రికను తానెందుకొదిలేసి వచ్చాడో చెప్పాడు. "ఆ భూపాలరావుకు నాకు పడలేదు. మీకు తెలుసు కదా, పత్రికనెంత పైకి తీసుకువచ్చానో! త్రాష్టుడు, నాతో పనితీరగానే అనవసరమైన ఇబ్బందుల్ని కల్గించసాగాడు. మనకు తగిన వ్యక్తి అనిపించిన మనిషి చేత 'కాలం' రాయించటానికి వీల్లేదు. మీ విషయంలో ఎలా అడ్డం కొట్టేశాడో మీకు తెలుసుకదా! ఈ కాపిటలిస్ట్‌లందరూ ఇంతేనండీ. అవసరం తీరిం తర్వాత అల్లుడు లం... కొడుకన్న బాపతు. ఇహ వాడితో కుదరదని నేనే రాజీనామా చేశాను. మీకు తెలీంది ఏముంది! మన గౌరవానికి భంగం కలిగేచోట ఉండరాదని వచ్చేశా. పోనీ వెధవ! నన్ను చెడగొట్టినవాడు, వాడు బాగుపడ్తాడా?" అని.

"ఒకళ్లని ఇంకోళ్ళు ఏం చెడగొడ్తారులెండి. కాని నేననుకోలేదు, మీరింత తొందరగా పత్రికనొదిలేస్తారని."

"వాడేం రాజీనామా చెయ్యమనలేదు. వాడికి డబ్బుకు లంకె అనుకోండి. పైసాపోతే ప్రాణం పోయిందంటాడు. సర్క్యులేషను పెంచాలి, స్టాండర్డ్స్ తగ్గకూడదూ అంటే వాటికి తగిన డబ్బు ఖర్చుపెట్టాలి. మంచి రెమ్యూనరేషన్ ఇచ్చి రచయిత చేత రాయించాలి. పోటీలు పెట్టాలి. డబ్బు ఖర్చు కాకూడదు అంటే పని జరిగేదెలా? పైగా, ఈనాడు పోటీ ఎలక్ట్రానిక్ మీడియాతోనయ్యె. నేనే విసుగేసి వాడితో కుదరదని బయటపడ్డా. ఇప్పుడు హాయిగా ఉందనుకోండి..."

"మరిప్పుడేం చేస్తున్నారు?"

"ఇంకో పత్రిక పెట్టాలని ఆలోచిస్తున్నా. కాపిటలిస్ట్ ఒకతనితో ఈ మధ్యే పరిచయమైంది. చూస్తూండండి. 'ఆంధ్రదీప్తి'కి పోటీగా నడుస్తుంది, నేను కొత్తగా పెట్టబోయే పత్రిక. నాకొకందుకు బాధగా ఉందండీ, తప్పుడు వెధవ మిమ్మల్ని ఎన్ని మాటలన్నాడా రోజు. పెద్దమనిషండీ, అలా మాట్లాడటం తప్పు అని నేనాపితే ఆగితేనా? మనబోటి మంచివాళ్ళని కష్టపెట్టి వాడెలా బాగుపడ్తాడులెండి. చూస్తుండండి, ఎప్పుడో వాడి పత్రిక దివాలా తీస్తుంది. నెత్తిన చెంగేసుకుపోతాడు వెధవ."

'వరసం' ఎలా నడుస్తోంది?"

"ఏదండీ, అప్పుడా పత్రిక పనుల్లో ఆ సమావేశాలకే వెళ్ళడం పడలేదు.. ఎవరూ! వెంకటేశ్వర్రావుగారా..." అని మా పక్కనుండి పోతున్న వ్యక్తిని పిలిచి నా వంక తిరిగి, "వస్తానండీ, ఆయనతో అర్జంటు పనుంది. ఏమనుకోకండి, మళ్ళీ కలుద్దాం" అని అతన్ని కలుసుకోవటానికి కౌంటర్‌వైపు వెళ్ళిపోయాడు బన్ను.

'వరసం' నుండి నేను బయటకొచ్చాక, రెండు మూడుసార్లు మాత్రమే సమావేశాలయ్యాయట. బన్ను, భున్ను (తరువాత భూపాలరావును ఒప్పించి "భున్ను" అని నామకరణం చేశారటలెండి) – 'వరసం'ను తమ స్వంత ఆస్తిగా చూడటం, 'వరసం'లోని మిగతా సభ్యులందరూ 'ఆంధ్రదీప్తి' వికాసానికి తోడ్పడాలనటంతో సభ్యులందరూ ఒకరితర్వాత మరొకరు బయటకొచ్చేశారు. ఇక 'వరసం' పనిచెయ్యటం మానేసింది. ఈ సమాచారమంతా ఒకసారి హన్ను కన్పించినప్పుడు నాకు వివరించాడు. జున్ను నాకు అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు. 'వరసం' విఘటితమైనందుకు విచారం వ్యక్తపరిచాడు.

'నెలవంక' సాహిత్య వార్షిక సంచిక, 1999-2000